ప్రభాత
# వెలుగు
08.02.2019
www.v6velugu.com
శుక్రవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 353 పేజీలు: 12+12+16 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL





ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

ఇప్పటి యూత్ ఏం చేస్తున్నది? సోషల్ మీడియాలో మునిగితేలుతున్నది. జల్సాల్లో ఎంజాయ్ చేస్తున్నది. రోడ్డుమీద ఆవేశపడుతున్నది. మత్తులో జోగుతున్నది. బాధ్యత మరుస్తున్నది. కొన్ని సంఘటనలు చూసో, ఇంకొన్ని అనుభవాల వల్లో ఇలాంటి మాటలు వినిపిస్తుంటాయి. కానీ ఇదంతా నిజమేనా? ఇప్పటి యూత్ అలాగే ఉందా? అంటే కచ్చితంగా కాదు. నాణేనికి రెండో వైపు చాలా పెద్ద నిజం ఉంది. అది మన ముందే కనిపిస్తున్నది.



# ఇజ్జత్‌దార్ యూత్

**ఫుడ్, ఆన్‌లైన్ డెలివరీల్లో యువకులు**
**రాష్ట్రంలో 25 వేల మందికి ఇదే ఉపాధి**
**చదువుకుంటూనే కష్టపడి సంపాదన**
**తమ కాళ్లపై తాము నిలబడాలన్న తపన**
**డిగ్నిటీ ఆఫ్ లేబర్ చూపిస్తున్న కొత్త తరం**

**హైదరాబాద్, వెలుగు:**
మొబైల్ యాప్ లో ఫుడ్ ఆర్డర్ చేస్తే... ఇంటికొచ్చి ఇచ్చే వ్యక్తి ఓ యువకుడు. ఆన్ లైన్ లో మొబైల్ బుక్ చేస్తే డెలివరీ చేసే మనిషి మరో యువకుడు. రోడ్డు మీద పోతూ ఉంటే ఎటు చూసినా, ఎక్కడ చూసినా రకరకాల పెద్ద బ్యాగులను బైక్ వెనుక భుజాలకు తగిలించుకొని పోయే వందలమంది యువకులు కనిపిస్తారు. వీళ్లంతా ఎవరు? ఎక్కడి వారు? ఎందుకీ పనిచేస్తున్నారు. వారిని అడిగితే తెలుస్తుంది... ఇప్పటి యూత్ ఏం చేస్తోందో.. ఎలా ఆలోచిస్తోందో.
పట్నం వెళ్లాలి.. బాగా చదివి మంచి కొలువు సంపాదించాలి.. కుటుంబాన్ని పోషించాలి.. ఇదే లక్ష్యంతో లక్షలాదిమంది యువత నగరానికి వస్తోంది. వారిలో మిడిస్ క్లాస్, అంతకంటే తక్కువ స్థోమత ఉన్నవాళ్లే ఎక్కువ. వీళ్లంతా ఇంటి నుంచి వచ్చే డబ్బును జాగ్రత్తగా వాడుకుంటూ చదువుకోవడమో, మంచి ఉద్యోగం వెతుక్కోవడమో చేస్తుంటారు. ఇప్పటి యువతరంలో చాలామంది అలాగే చాలీచాలని డబ్బుతో అమ్మనాన్నలపై ఆధారపడి ఉండాలని అనుకోవడం లేదు. తమ అవసరాలు తామే తీర్చుకోవడానికి రకరకాల పార్ట్ టైం ఉద్యోగాలను వెతుక్కుంటున్నారు. అందులో వేగంగా విస్తరిస్తున్న ఫుడ్ డెలివరీ రంగం వారికి గొప్ప అవకాశంగా మారింది. కొన్నేళ్లుగా

మిగతా 2లో

బీటెక్ అయ్యాక సిటీకి వచ్చాను. కొన్ని రోజులు కోచింగ్ ఇనిస్టిట్యూట్ ల చుట్టూ తిరిగాను. ఏడాది తర్వాత నాన్న కాల్ చేసి జాబ్ వచ్చిందా అని అడిగారు. రాలేదని చెప్పా. బీటెక్ అయి ఏడాదైనా ఇప్పటికీ ఖాళీగా ఉన్నావ్... ఇంక నీకు డబ్బులు పెట్టలేం అని నాన్న తిట్టారు. దీంతో ఏం చేయాలో అర్థం కాక మా ఫ్రెండ్ బైక్ తో పార్ట్ టైం జాబ్ ట్రై చేశాను. మా ఏరియాలో కాకుండా వేరే ఏరియాలో జాబ్ లో చేరాను. నాకు వచ్చే డబ్బులతో ఇప్పుడు జాబ్స్ కి ప్రిపేర్ అవుతూ అమ్మకు కొంతమనీ పంపిస్తున్నా. నేను డెలివరీ బోయ్ గా చేస్తున్న విషయం మా నాన్నకు ఇప్పటికీ తెలియదు.

*-వినోద్, ఫుడ్ డెలివరీ బోయ్, మహబూబాబాద్*



నేను జూపార్క్ దగ్గర కుటుంబంతో పాటు ఉంటున్న. ఏసీ టెక్నీషియన్ గా చేసేవాణ్ణి. ఇప్పుడు ఫుడ్ డెలివరీ బోయ్ గా చేస్తున్నా. నాన్న ఆరోగ్యం బాగోదు. నేనే కుటుంబాన్ని చూసుకోవాలి. దీంతో ఇందులో చేరాను. మొదట్లో ఎవరు ఏమనుకుంటారో అనుకున్నా. కానీ నాలాంటివాళ్లు చాలామంది ఈ వృత్తిలో ఉన్నారు. రోజు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు డ్యూటీచేస్తా. రోజుకి రూ.500 వరకు వస్తుంది. మునుపటి ఉద్యోగానికి వెళ్లాలని లేదు. ఇందులోనే ఉంటా.

*- సయ్యద్ ఇర్ఫాన్, ఫుడ్ డెలివరీ బోయ్*

# బ్యాంకులపై ఎన్‌పీఏ బాంబ్!




**ఇప్పుడున్న వాటికి కొత్తగా మరో 3.5 లక్షల కోట్లు**
**అదే జరిగితే బ్యాంకింగ్ రంగం అతలాకుతలమే**

**హైదరాబాద్, వెలుగు:**
బ్యాంకింగ్ రంగంలో త్వరలో 'ఎన్‌పీఏ' బాంబు పేలనుందని ఇండియా రేటింగ్స్ సంస్థ హెచ్చరించింది. ఇప్పటికే ఉన్న రూ.10 లక్షల కోట్ల నాన్ పెర్ఫార్మింగ్ ఎసెట్స్(ఎన్‌పీఏ)కు తోడు మరో రూ.3.5 లక్షల కోట్లు కలిసే ప్రమాదం ఉందంటూ డేంజర్ బెల్స్ మోగించింది. అదే జరిగితే ఎన్‌పీఏలు రూ.13.5 లక్షల కోట్లకు చేరి బ్యాంకింగ్ రంగంలో భారీ కుదుపు తప్పదని తాజా రిపోర్టులో తెలిపింది. ఎన్‌పీఏల కోసం బ్యాంకులు చేయబోయే కేటాయింపులతో అవి దివాలా అంచుకు చేరొచ్చని పేర్కొంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించడంతో రుణాలకు డిమాండ్ పెరగడంతోపాటు అటు ఎన్‌పీఏలు పెరగనుండడంతో బ్యాంకులకు గడ్డుకాలం తప్పకపోవచ్చని అంచనా వేసింది.

**రెండేళ్లలో ఏం జరగబోతోంది?**
తీసుకున్న లోన్లు, వాటిపై కంపెనీలు వడ్డీ చెల్లిస్తుండటంతో ప్రస్తుతానికి రూ.3.5 లక్షల కోట్ల అప్పులను బ్యాంకులు స్టాండర్డ్ ఎసెట్స్‌గానే పరిగణిస్తున్నాయి. అసలు లేదా వడ్డీ మొత్తం 90 రోజులు అంతకంటే ఎక్కువ కాలంపాటు చెల్లించకపోతే ఆ మరుసటి రోజు నుంచే వాటిని ఎన్‌పీఏలుగా పేర్కొంటాయి. అయితే చాలా స్ట్రెస్డ్ ఎసెట్స్ రాబోయే రెండేళ్లలో ఎన్‌పీఏలుగా మారతాయని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ జిందాల్ హారియా చెప్పారు. ఇప్పటికే రూ.13.50 లక్షల కోట్ల నుంచి

మిగతా 2లో




పొలిటికల్
**కొత్త డీసీసీ చీఫ్‌లు**
31 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ. 12 మంది బీసీలు.. 10 మంది రెడ్లకు ఛాన్స్.
03



జనరల్
**అగ్రిగోల్డ్ బాధితులకు రిలీఫ్**
10 వేల లోపు డిపాజిటర్లకు పరిహారం చెల్లించాలని ఏపీ నిర్ణయం.. 250 కోట్లు కేటాయింపు.
02



ప్లే
**విజేత విదర్భ**
రంజీ ఫైనల్‌లో 78 రన్స్‌తో సౌరాష్ట్రపై విదర్భ గ్రాండ్‌విక్టరీ.. వరుసగా రెండోసారి టైటిల్ కైవసం.
11



బిజినెస్
**యస్ బాస్ పాలసీ**
కీలక వడ్డీ రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ.. రుణాలపై వడ్డీరేట్లు తగ్గే ఛాన్స్.. రైతులకు అప్పు పరిమితి పెంపు.
10



# మోడీ పిరికిపంద

**ఆయన కేరక్టర్ ఏమిటో ఐదేళ్లుగా చూశా**
**ఆరెస్సెస్ గుప్పిట్లో వ్యవస్థలు**
**ఆ మూడు రాష్ట్రాల్లో వాళ్ల పప్పులుడకవ్**
**మైనార్టీ సెల్ సదస్సులో కాంగ్రెస్ చీఫ్ రాహుల్ ధ్వజం**

03

# మీరా మాట్లాడేది?

**వ్యవస్థలను నాశనం చేసినవాళ్లా మమ్మల్ని విమర్శించేది?**
**లోక్‌సభ సాక్షిగా ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ ఫైర్**

దేశంలో ఎమర్జెన్సీని తెచ్చి వ్యవస్థలను నాశనం చేసింది కాంగ్రెస్. ఆర్మీని కించపరిచి, ఆర్మీ చీఫ్‌ను పట్టుకొని గూండా అన్నది వాళ్లే. ఇప్పుడు వ్యవస్థలను మోడీ నాశనం చేస్తున్నాడంటూ ఏడుస్తున్నారు. ఇంతకంటే సిగ్గుచేటు ఉంటుందా? ఉల్టాచోర్ చౌకీదార్‌కో డాంటే అంటే ఇదే.

BC అంటే బిఫోర్ కాంగ్రెస్.
AD అంటే ఆఫ్టర్ డైనాస్టీ.

*– ప్రధాని మోడీ*






# బెంగాల్ వార్

మోడీ వర్సెస్ దీదీ.. కొద్ది రోజులుగా మీడియాలో ట్రెండ్ అవుతున్న పదం. బెంగాల్ రాజకీయాల్లోనే కాదు, దేశ రాజకీయాల్లోనూ హెడ్ లైన్స్ గా ఉన్న మోడీ, దీదీ పోరు లో విజేత ఎవరు? మమత జోరుకు మోడీ కళ్లెం వేయగలుగుతారా ? 35ఏళ్ల పాటు బెంగాల్‌ను పాలించిన లెఫ్ట్ ఫ్రంట్ పరిస్థితి ఏమిటి? దానికి ఢిల్లీలో మిత్రపక్షంగా ఉండి, బెంగాల్ అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పరిస్థితేంటి?

**లోక్‌సభ ఎన్నికలవేళ బెంగాల్ రాజకీయాలపై 'వెలుగు' ప్రత్యేక కథనం.**

04

## వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

| హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ |
|---|---|---|
| 72.00 | 70.00 | 72.00 |
| **కరీంనగర్** | **నిజామాబాద్** | **ఖమ్మం** |
| 71.00 | 70.00 | 72.00 |

## ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు
# వానాకాలం నాటికి నీళ్లు

**14.40 లక్షల ఎకరాలకు సాగునీరు**
**పనులను వేగంగా పూర్తి చేయాలి**
**నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు**
**నదుల నీళ్లు పొలాలకు మళ్లాలె**
**లేదంటే పాపం చేసినవాళ్లమవుతాం**
**అధికారులతో సీఎం కేసీఆర్**



**హైదరాబాద్, వెలుగు:**
వానాకాలం నాటికి ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీళ్లు అందించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. అప్పటివరకు కాల్వల మరమ్మతు, లైనింగ్, తూముల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఎస్సారెస్పీ పరిధిలోని మొత్తం ఆయకట్టుకు నీరందించడానికి అనుసరించాల్సిన వ్యూహంపై సీఎం గురువారం ప్రగతి భవన్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇంజినీర్లతో సమీక్షించారు. పోచంపాడు (ఎస్సారెస్పీ) ఆయకట్టు 14.40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చి తీరుతామని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి వచ్చే వానాకాలంలో నీటిని ఎత్తిపోస్తామని తెలిపారు. ఆ నీటిని మిడ్ మానేరు, ఎల్‌ఎండీకి తరలిస్తామని, రెండు జలాశయాల్లో 50 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్నదని చెప్పారు. తొలి దశలోనే ఆ నీటితో కాకతీయ కాలువ పరిధిలోని అన్ని చెరువులను నింపాలన్నారు. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, నదుల్లో ప్రవహించే నీటిని పంట పొలాలకు మళ్లించకుంటే పాపం చేసిన వారమవుతామని వ్యాఖ్యానించారు. ఎస్సారెస్పీ పరిధిలో ఎక్కడ ఏ పని చేయాలో గుర్తించేందుకు 50 మంది ఇంజినీర్లను నియమించాలని, తద్వారా ఎక్కడ సమస్య ఉందో గుర్తించి అప్పటికప్పుడే పరిష్కరించవచ్చని వివరించారు. భూ సేకరణ, ఇతర పనులకు కావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలని

మిగతా 2లో

గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయి. ఆ నీళ్లను ఎత్తిపోసేందుకు కాళేశ్వరం నిర్మిస్తున్నం. ఈ వానాకాలంలోనే మేడిగడ్డ నుంచి నీటిని మిడ్ మానేరుకు అక్కడి నుంచి లోయర్ మానేరుకు తరలించాలి. ఆ నీటితో చెరువులు నింపాలి. ఈలోగా కాల్వల మరమ్మతులన్నీ పూర్తి చేయాలి. అవసరమైన చోట తూములు కట్టాలి. డిస్ట్రిబ్యూటరీలకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలి. అవసరమైతే కాల్వల క్యారీయింగ్ కెపాసిటీ పెంచుకోవాలి. ఈ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి.

**సిర్పూర్‌కు మళ్లీ కళ**




ముఖ్యమంత్రి కేసీఆర్, జేకే యాజమాన్యం చొరవతో సిర్పూర్ పేపర్ మిల్లు నాలుగేళ్ల తర్వాత మళ్లీ ప్రారంభమైంది. గురువారం సాయంత్రం 7.07 గంటలకు కాగితం ఉత్పత్తి చేసే 7వ యంత్రానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఉత్పత్తి మొదలైంది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎస్పీఎం యూనిట్ హెడ్ మహంక్ జిందాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

*– ఆసిఫాబాద్, వెలుగు*

# చత్తీస్‌గఢ్‌లో తుపాకుల మోత

10 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్
వారి శిక్షణ కేంద్రాన్ని చుట్టిముట్టిన బలగాలు
ఇరు వర్గాలకు మధ్య ఎదురుకాల్పులు

02



## వరల్డ్ బ్యాంకు చీఫ్ గా మాల్పాస్!

### నామినేట్ చేసిన డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్:** ప్రపంచబ్యాంకు నూతన చీఫ్ పదవికి ప్రముఖ ఎకానమిస్ట్ డేవిడ్ మాల్పాస్(62)ను అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. డాలర్లను సరిగా ఖర్చు చేస్తూ, అమెరికా ఇంట్రెస్ట్ లకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. దీంతో ప్రపంచ దేశాలకు సాయం చేసే వరల్డ్ బ్యాంకు పాత్రను ట్రంప్ శాసిస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. మాల్పాస్ ట్రంప్ కు సన్నిహితుడు. 2016 అమెరికా ఎన్నికల ప్రచారంలో ట్రంప్ కు సీనియర్ ఎకానమిక్ అడ్వైజర్ గా పని చేశారు. ఓ ఎకానమిస్టుగా ప్రపంచబ్యాంకు నిర్ణయాలను చాలా సార్లు విమర్శించారు. ప్రస్తుతం అమెరికా ట్రెజరీ డిపార్ట్ మెంట్‌లోని అంతర్జాతీయ సంబంధాల విభాగంలో సెక్రటరీగా పని చేస్తున్నారు. ట్రంప్ నామినేషన్ తో పాటు ఇతర దేశాల నామినేషన్లను వరల్డ్ బ్యాంకు డైరెక్టర్ల గ్రూపు పరిశీలిస్తుంది. అన్ని విధాల అర్హుడైన వ్యక్తిని బ్యాంకు చీఫ్ గా ఎన్నుకుంటుంది.

## ఈడీ ముందుకు కార్తి, వాద్రా

### ఐఎన్ఎక్స్ కేసులో కార్తి, మనీలాండరింగ్ కేసులో వాద్రా విచారణకు..

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కొడుకు కార్తి, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా వేర్వేరు కేసుల్లో ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట గురువారం విచారణకు హాజరయ్యారు. ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఉదయం 11 గంటలకు ఈడీ కార్యాలయానికి వచ్చిన కార్తి.. సాయంత్రం 6 గంటలకు బయటకెళ్లారు. కేసులో నిందితులు, సాక్షులు చెప్పిన వివరాలపై ఆయన్ను ఆరా తీసినట్టు సమాచారం. కార్తిని మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉందని అధికారులు అన్నారు. శుక్రవారం చిదంబరంనూ ప్రశ్నించనున్నట్లు చెప్పారు. కార్తి కార్యాలయానికి వచ్చిన 25 నిమిషాల తర్వాతే వాద్రా కూడా వచ్చారు. విదేశాల్లో ఆస్తుల కొనుగోలులో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న కేసులో వాద్రా రెండోరోజూ విచారణకు హాజరయ్యారు.

## నాణ్యమైన చదువుకు నూతన చట్టాలు: వినోద్

**న్యూఢిల్లీ, వెలుగు:** వచ్చే తరానికి నాణ్యమైన విద్యను అందించేలా చట్టాలను మార్చాల్సిన అవసరం ఉందని, ఆ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. గురువారం నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ (నీసా) ఆధ్వర్యంలో విద్యా సంస్కరణలపై ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అన్ని రంగాల్లోనూ విస్తరించాయన్నారు. శిక్షణ పొందిన టీచర్లతోనే ప్రైవేట్ స్కూళ్లలో బోధన చేయించాలని నిబంధన ఉన్నా ఎవరికీ పట్టట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# రూ.10 వేల లోపు డిపాజిటర్లకు పరిహారం

### అగ్రిగోల్డ్ కేసులో ఏపీ నిర్ణయం ■ 250 కోట్లు కేటాయింపు

**విజయవాడ, వెలుగు:** దేశవ్యాప్తంగా 32 లక్షల మంది బాధితులున్న అగ్రిగోల్డ్ కేసులో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.10 వేలలోపు డిపాజిట్లు చేసిన అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం అందిస్తామని ప్రకటించింది. దీని కోసం రూ.250 కోట్లు కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 10 వేల లోపు డిపాజిట్లు చేసినవారు 3.5 లక్షల మంది ఉన్నట్లు గుర్తించింది. హైకోర్టు పర్యవేక్షణలో జిల్లాస్థాయి కమిటీల ద్వారా చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. ఆత్మహత్య చేసుకున్న అగ్రిగోల్డ్ బాధితుల 43 కుటుంబాలకు గత ఏడాది ఆగస్టులో ఏపీ సీఎం చంద్రబాబు రూ.5 లక్షలు చొప్పున రూ.2.15 కోట్లు పంపిణీ చేశారు.

**తెలుగు రాష్ట్రాల్లో 19 లక్షల మంది బాధితులు**

తెలుగురాష్ట్రాలతోపాటు తమిళనాడు, చత్తీస్ గఢ్, కర్నాటక, అండమాన్ నికోబార్ లో 32 లక్షల మంది నుంచి అగ్రిగోల్డ్ డిపాజిట్లు సేకరించి చేతులెత్తేసింది. తెలుగు రాష్ట్రాల్లో 19 లక్షల మంది బాధితులు రూ.3,966 కోట్లు డిపాజిట్ చేశారు. అగ్రిగోల్డ్ పై తెలంగాణ, ఏపీలో 14 కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, నల్లగొండ, కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రిలో పోలీసులు కేసులు నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు తొలుత పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం సీఐడీ విచారణ చేస్తోంది. అగ్రిగోల్డ్ చైర్మన్, డైరెక్టర్లు అవ్వా వెంకటరామారావు, అవ్వా ఉదయ్ భాస్కర్, అవ్వా మణిశర్మ, అవ్వా శేషు నారాయణరావు, ప్రసాద్, సాయిరాంను అరెస్టు చేయగా, ప్రస్తుతం వారంతా బెయిల్ పై ఉన్నారు.

**అగ్రిగోల్డ్ కథ**

- 1995లో విజయవాడ కేంద్రంగా ప్రారంభం
- కలెక్టివ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం పేరుతో 32 లక్షల మంది నుంచి డిపాజిట్లు
- అండమాన్ నికోబార్ తో పాటు 8 రాష్ట్రాల్లో బాధితులు
- 2014 డిసెంబర్ లో అగ్రిగోల్డ్ పై కేసు నమోదు
- కేసును సీఐడీకి బదిలీ చేసిన ప్రభుత్వం
- దర్యాప్తు వేగవంతం చేయాలని 2015 అక్టోబర్ లో హైకోర్టు ఆదేశం
- 2016 ఫిబ్రవరిలో చైర్మన్, డైరెక్టర్ల అరెస్టు, బెయిల్
- మొత్తం 18 మంది నిందితులు, ఆరుగురు మాత్రమే అరెస్టు
- హైకోర్టు అనుమతితో కృష్ణా జిల్లా, విజయవాడలోని ఆస్తులు వేలం వేస్తామని ప్రకటించిన సీఐడీ
- పెద్దనోట్ల రద్దు ఇతర కారణాలతో స్పందన కరవు
- తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 19.52 లక్షల మంది బాధితులు
- 105 మంది బాధితులు ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్న అగ్రిగోల్డ్ బాధితుల సంఘం



గురువారం చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భద్రతా బలగాలు

# చత్తీస్‌గఢ్‌లో తుపాకుల మోత

### 10 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్

**భద్రాచలం, వెలుగు:**

చత్తీస్‌గఢ్ దండకారణ్యం తుపాకుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్‌జిల్లా ఇంద్రావతి నదీ తీరంలో మావోయిస్టుల శిక్షణ కేంద్రాన్ని గురువారం భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఇరువర్గాల మధ్యా జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మరణించారు. గాయపడిన మరికొందరు పరారైనట్టు తెలిసింది. చత్తీస్ గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బైరాంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నదీతీరం మంద్ అటవీప్రాంతంలో మావోయిస్టుల శిక్షణ కేంద్రం నడుస్తున్నట్టు ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో బీజాపూర్ ఎస్పీ గగన్ మోర్గ్ నేతృత్వంలో జిల్లా రిజర్వ్‌డ్‌గార్డ్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో బోడ్గా గ్రామ సమీపంలో మావోయిస్టులు భద్రతా బలగాలపై ఎదురుకాల్పులకు దిగారు. గంటకుపైగా ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. మావోయిస్టుల శిక్షణ కేంద్రాన్ని చుట్టిముట్టి భద్రతా బలగాలు కాల్పులు జరపడంతో కొందరు మావోయిస్టులు చనిపోగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని మావోయిస్టులు తమ వెంట తీసుకెళ్లిపోయారు. 10 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించామని, 11 తుపాకులు, భారీగా ఐఈడీ డిటోనేటర్లు, నిత్యావసర వస్తువులు, విప్లవ సాహిత్యం తదితరాలు స్వాధీనం చేసుకున్నామని బస్తర్‌ఐజీ వివేకానంద సిన్హా తెలిపారు. మృతులను గుర్తించాల్సి ఉందని ఆయన చెప్పారు.

- మావోయిస్టుల శిక్షణ కేంద్రాన్ని చుట్టిముట్టిన బలగాలు
- ఇరు వర్గాల మధ్య కాల్పులు
- భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

### ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు

# వానాకాలం నాటికి నీళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక శాఖను ఆయన ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వానాకాలానికి మొత్తం ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని, ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ ప్రాంతం మొదలు పెట్టి చివరి ఆయకట్టు డోర్నకల్, తుంగతుర్తి, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల్లో అన్ని దిక్కులకు నీళ్లు అందాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఎంపీలు సంతోష్‌కుమార్, సీతారాం నాయక్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, డీఎస్ రెడ్యానాయక్, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, బాల్క సుమన్, సుంకె రవిశంకర్, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, గంగుల కమలాకర్, ఆరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, గ్యాదరి కిశోర్, నన్నపునేని నరేందర్, వి. సతీశ్‌కుమార్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అధికారులకు సీఎం చేసిన సూచనలు**

- కాకతీయ కాల్వ, వరద కాల్వ మధ్య 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి. అవసరమైన చోట తూములు ఏర్పాటు చేయాలి. వెంటనే సర్వే నిర్వహించి, పనులు ప్రారంభించాలి.
- ఎస్సారెస్పీ స్టేజ్ 2లో అన్ని డిస్ట్రిబ్యూటరీలకు లైనింగ్ చేయాలి. ఇందుకోసం వెంటనే అంచనాలు రూపొందించి, టెండర్లు పిలవాలి. ఎండాకాలంలోపు పనులు పూర్తి కావాలి.
- ఎస్సారెస్పీ కాల్వల పనుల కోసం ఎక్కడికక్కడ ఎక్కువ మంది కాంట్రాక్టర్లను నియమించాలి. అన్నిచోట్ల పనులు సమాంతరంగా జరగాలి.
- అన్ని ప్రాజెక్టుల కాల్వలకు సంబంధించిన హద్దులను నిర్ణయించాలి. ప్రాజెక్టుల భూముల సమగ్ర వివరాలను (ఇన్వెంటరీ) రూపొందించాలి.
- కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులను చేపట్టాలి.
- ఎస్సారెస్పీ పంట కాల్వలను ఎవరైనా దున్నుతుంటే, వాటిని పునరుద్ధరించాలి. ఈ విషయంలో ఎమ్మెల్యేలు చొరవచూపి, రైతులను ఒప్పించాలి.
- అన్ని ప్రాజెక్టుల ప్రొఫైల్ తయారు చేయాలి. ప్రతి ప్రాజెక్టుకు ఆపరేషన్ రూల్స్ రూపొందించాలి.
- ప్రాజెక్టుల నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయాలి. ఆ నిధులను బడ్జెట్‌లోనే కేటాయిస్తాం.
- చనాఖా కొరాటా పనులు మే 15 నాటికి పూర్తి కావాలి.
- దేవాదుల నీటిని తరలించే రామప్ప, లక్నవరం, ఘనపూర్, పాఖాల కాల్వల పనులను ఈ ఎండాకాలంలోనే పూర్తి చేయాలి.
- దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించతలపెట్టిన పాలకుర్తి, ఉప్పుగల్లు, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలి.

## ఎన్‌పీఏ బాంబు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.14 లక్షల కోట్ల దాకా కార్పొరేట్ స్ట్రెస్డ్ ఎసెట్స్ ఉండగా.. అందులో రూ.10 లక్షల కోట్లను బ్యాంకులు ఎన్‌పీఏలుగా గుర్తించాయన్నారు. ఇండియా రేటింగ్స్ అంచనా ప్రకారం ఈ ఎన్‌పీఏల కోసం బ్యాంకులు అదనంగా రూ.40 వేల కోట్లను కేటాయించాలి. ఇండియాలోని బ్యాంకులు ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల ఎన్‌పీఏలతో సతమతమవుతున్నాయి. డిసెంబర్‌లో ఆర్‌బీఐ ప్రకటించిన అంచనాలు మాత్రం బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు సెప్టెంబర్ 2018 నాటికి 10.3 శాతానికి తగ్గాయని చెబుతున్నాయి.

**ప్రభుత్వ బ్యాంకులకే దెబ్బ**

మొండి బకాయిలతో ప్రధానంగా దెబ్బతినేది ప్రభుత్వ రంగ బ్యాంకులే. ఎందుకంటే ఎక్కువ రుణాలను ఇచ్చింది అవే. దేశంలోని బ్యాంకుల పరిస్థితి ఒక దశలో ఎంత దిగజారిందంటే.. ఆర్‌బీఐ ఒకేసారి 12 ప్రభుత్వ రంగ బ్యాంకులపై ఆంక్షలు పెట్టాల్సి వచ్చింది. బ్యాంకుల కార్యకలాపాలను పూర్తి స్థాయిలో నియంత్రణలోకి తీసుకునేందుకు ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) పెట్టారు. దేశంలోని పెద్ద ప్రైవేటు బ్యాంకులకు, రెండు పెద్ద ప్రభుత్వ బ్యాంకులు ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు మాత్రం తాజాగా వృద్ధి అవకాశాలు మెరుగయ్యాయి. రాబోయే రెండేళ్లలో ఇవి మార్కెట్ వాటాను వేగంగా పెంచుకుంటాయని ఇండియా రేటింగ్స్ అంచనా వేసింది. మిగతా ప్రభుత్వ రంగ బ్యాంకులు కోలుకోవడం అనుమానమేనని పేర్కొంది. ఎన్‌పీఏలూ పెరిగితే అవి మరింత అగాథంలోకి జారిపోతాయంది.



జొమాటో డెలివరీ బాయ్స్ జాబ్స్‌కు హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూ కోసం క్యూలో నిలబడ్డ యువకులు

# ఇజ్జత్‌దార్ యూత్

## బోయ్స్.. సంపాదనలో బెటర్

దేశవ్యాప్తంగా 80వేల మందికి పైగా ఫుడ్ రైడర్స్ ఉన్నారని అంచనా. అందులో హైదరాబాద్ లో 11వేల మందికి పైగా ఫుడ్ డెలివరీ బాయ్స్ ఉన్నారు. ఆన్ లైన్ సేల్స్ రంగంలో పనిచేసే యువత కూడా కలిపి మన దగ్గరే 25వేలమంది వరకు ఉపాధి పొందుతున్నట్లు అంచనా. ఫుడ్ డెలివరీ బోయ్స్ రోజుకు 10 వరకు డెలివరీ చేసినా సగటున నెలకు 300 వరకు అవుతాయి. ఒక్కో డెలివరీపై కంపెనీని బట్టి రూ.40 నుంచి 60 వరకు చెల్లిస్తున్నారు. వీక్ డేస్, వీకెండ్లలో టార్గెట్లు అందుకోవడాన్ని బట్టి రూ.100 నుంచి 250 వరకు అదనంగా ప్రోత్సాహకం ఇస్తుంటారు. దీంతో వారు రూ.18వేల నుంచి ఒక్కోసారి 40వేల వరకు కూడా సంపాదిస్తున్నారు. వీరికి వారం లెక్కల నేరుగా బ్యాంకు అకౌంట్లలో వేతనాలు చెల్లిస్తుంటారు.

(మొదటిపేజీ తరువాయి)

ఆన్ లైన్ సేల్స్ డెలివరీ యువతకు ఉపాధి కల్పిస్తుంటే దానికి ఇప్పుడు ఫుడ్ డెలివరీ తోడైంది. స్విగ్గీ, జొమాటో, ఫుడ్ పాండా, ఉబెర్ ఈట్స్ లాంటి కార్పొరేట్ సంస్థలు భారీ ఆఫర్లతో జనాన్ని ఆకర్షిస్తున్నాయి. వినియోగం ఎక్కువగా ఉండడంతో ఫుడ్ డెలివరీలోనే ఎక్కువగా యువత కనిపిస్తున్నారు. డెలివరీ బోయ్ లుగా వేలాదిమంది యువత ఉపాధి పొందుతున్నారు. వీరిలో బీటెక్ లు, డిగ్రీలు చేసే విద్యార్థులు, చదువు పూర్తిచేసి కొలువుల వేటలో ఉన్న నిరుద్యోగులే ఎక్కువమంది ఉంటున్నారు. వీళ్లంతా రోజూ ప్రముఖ రెస్టారెంట్ల ముందు రకరకాల యూనిఫాంలు వేసుకొని ఆర్డర్ల కోసం ఎదురుచూస్తూ కనిపిస్తుంటారు. వారిని కదిలిస్తే ఒక్కొక్కరిది ఒక్కో కథ. డిగ్నిటీ ఆఫ్ లేబర్ తెలిసి, ఆత్మవిశ్వాసంతో తమకు తాముగా ఎదగాలనుకునే వందలాది మంది యువత వారిలో ఉన్నారు. అమ్మనాన్నల కష్టాన్ని గుర్తించి, వారికి తమ వంతుగా అండగా ఉండాలని ఆలోచించే బాధ్యత తెలిసిన కొత్త తరం వారిలో ఉంది.

**తిరిగేద్దాం.. పనిచేద్దాం**

చదువుకునే వయసులో ఖాళీ టైంలో సరదాగా ఎంజాయ్ చేద్దామని ఈతరం అనుకోవట్లేదు. హాయిగా ఊరంతా చుడుతూ తమ సరదానే సంపాదనగా మార్చుకుంటోంది. కాలం, అవసరాలు వారి ఆలోచనలో మార్పు తెస్తే కొత్త అవకాశాలు వారికి ఉత్సాహాన్నిస్తున్నాయి. ఫుడ్ డెలివరిని ఉపయోగించుకునే జనం బాగా పెరుగుతుండడం డెలివరీ బోయ్ లకు మంచి డిమాండ్ తెచ్చిపెట్టింది. కష్టాన్ని బట్టి సంపాదన పెంచుకునే అవకాశం ఉండడం మరింత మంది యువతను ఆకర్షిస్తోంది. దీంతో చదువుకుంటూ పార్ట్ టైంగా ఫుడ్ డెలివరీ బోయ్ లుగా మారిపోయేవారు పెరుగుతున్నారు. ఊరి నుంచి తల్లిదండ్రులు పంపే డబ్బు సరిపోక కొందరు, అవసరాల కోసం మరికొందరు, కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇంకొందరు ఫుల్ టైమ్ బోయ్ లుగా కూడా పనిచేస్తున్నారు. నిరుద్యోగులకు కూడా వారికి నచ్చే ఉద్యోగం దొరికే వరకు సంపాదన కోసం ఇదే ఉపాధి కల్పిస్తోంది. చదువుకునేవాళ్లు సాయంత్రం కాలేజీ తర్వాత యూనిఫాంలోకి మారిపోతున్నారు. డెలివరీల సంఖ్యను బట్టే సంపాదన ఉండడంతో తమ అవసరాన్ని బట్టి ఆదాయం పెంచుకుంటున్నారు కొత్త తరం బాచిలర్స్. ఆడుతూ పాడుతూ ఫుడ్ డెలివరీలు చేస్తూనే వేలల్లో సంపాదిస్తున్నారు.



జాబ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థి

**చదువుకున్నవాళ్లకే అవకాశాలు**

ఫుడ్ డెలివరీలో కనిపించేవారిలో చాలామంది పల్లెల నుంచి వచ్చినవారే. అనుకున్న ఉద్యోగం రాక, పెద్ద చదువులు చదివే అవకాశం లేక, డిగ్రీలు, పీజీలు చేశామన్న గొప్పలకు పోకుండా ఫుడ్ డెలివరీ బాయ్స్ గా పనిచేయడానికి సిద్ధపడుతున్నారు. చదవడానికి పట్నం వచ్చేవారు పాకెట్ మనీ కోసం కూడా అమ్మానాన్నలపై ఆధారపడొద్దని తమకు తాముగా సంపాదించుకుంటున్నారు. కొంతమంది పార్ట్ టైంగా పనిచేస్తుంటే, డబ్బు ఎక్కువగా వస్తుందని మరికొందరు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ డెలివరీలు చేస్తుంటారు. మొదట్లో చదువు అర్హత లేకుండానే ఫుడ్ డెలివరీ కంపెనీలు బోయ్స్ ను నియమించుకునేవి. అయితే రకరకాల కారణాలతో వీరిపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో బోయ్స్ కు ఇంటర్ తప్పనిసరి అని నిబంధన పెట్టుకున్నారు. అలాగే ఆండ్రాయిడ్ మొబైల్ వాడడం తెలిసి ఉండడం కూడా తప్పనిసరి.

**నియామకాల్లో ఏజెన్సీలదే హవా**

సిటీలో ఫుడ్ డెలివరీల రంగం ఊపందుకోవడంతో ఇందులోనూ ఏజెన్సీలు అడుగుపెట్టాయి. కంపెనీలు బోయ్స్ ను నేరుగా రిక్రూట్ చేసుకోకుండా ఏజెన్సీల ద్వారానే తీసుకుంటున్నాయి. దీంతో థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారానే ఇందులో చేరే అవకాశం ఉంది. ఇవి రిక్రూట్ మెంట్ ను బట్టి, రోజువారీ, శాలరీ బేస్డ్ గా కమిషన్ రూపంలో ఒక్కో బోయ్ నుంచి నెలకు రూ.1000 నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నాయి. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఏజెన్సీల ద్వారానే చేరాల్సి వస్తోంది. అయితే ఈ విధానంలో శ్రామికులుగా వారికి ప్రయోజనాలు రాకుండా చేస్తున్నారన్న విమర్శ ఉంది.

**సమస్యలున్నా పని తప్పదు**

డెలివరీ చేస్తేనే డబ్బు వస్తుంది కాబట్టి ఆరోగ్యం బాలేకపోయినా పనిచేయాల్సిందే. డైలీ టార్గెట్లలో భాగంగా కొన్నిసార్లు కంపెనీలు ఆర్డర్లను నిలిపివేస్తే డెలివరీ బోయ్స్ ఇబ్బంది పడుంతుంటారు. ఒక్కో ఆర్డర్ కోసం గంటల కొద్దీ ఎదురుచూడడం, ఒక్కోసారి 5 గంటల పాటు పనిచేస్తేగానీ కనీస సంపాదన రాని సందర్భాలు కూడా ఉంటాయి. దీనికితోడు డెలివరీ త్వరగా చేస్తే రేటింగ్ ఆధారంగా కంపెనీలు ఇన్సెంటివ్స్ ఇస్తుంటాయి. వీటి కోసం ఒక్కోసారి బోయ్స్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోలీసు జరిమానాలతో వచ్చిన సంపాదన కూడా పోగొట్టుకుంటున్నారు. ఇటీవల ఫుడ్ డెలివరీ కంపెనీలపై పోలీసుల పర్యవేక్షణ కారణంగా బోయ్స్ కు ఆరోగ్య, జీవిత, ప్రమాద బీమా కల్పించడంతో వారికి వెసులుబాటు కలిగింది. అదనపు జరిమానాలూ తగ్గాయి.

### ఇక్కడా తప్పని మోసాలు

తక్కువ టైంలో మంచి సంపాదన అందుకునే వెసులుబాటు ఉండడంతో డెలివరీ బోయ్స్ గా చేరడానికి ముందుకొచ్చే యువకులు పెరుగుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని వారిని మోసం చేసే బోగస్ ఉద్యోగ ఏజెన్సీలు పుట్టుకొస్తున్నాయి. ఉద్యోగ అవకాశాలంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రకటనలతో యువతను ఆకర్షిస్తున్నాయి. ఇలాంటివారు ముందుగానే నామినల్ ఫీజు అంటూ రూ.1000 నుంచి 3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలాంటి వారిని నమ్మి వేలాదిమంది యువత మోసపోతున్నారు. దీంతో డబ్బు కట్టాలని అడిగేవారిని నమ్మొద్దని చెబుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కంపెనీలకు కూడా ఇబ్బందిగానే మారుతోంది. దీంతో కొన్ని కంపెనీలు పరిమితంగా నేరుగా రిక్రూట్ మెంట్లు చేయడంపై ఆసక్తి చూపిస్తున్నాయి.

### ఇంటికీ డబ్బు పంపిస్తున్నా

"మాది ఖమ్మం. నాన్న డైలీ కూలీ. నేను డిగ్రీ చదివా. ఏదైనా కోచింగ్ లో చేరదామని వచ్చి అమీర్ పేట్ లో ఒక ఇన్ స్టిట్యూట్ లో చేరాను. అక్కడ కోచింగ్ కి డబ్బు కట్టడం, నా ఖర్చులు చూసుకోవడం కష్టమయ్యేది. ఇంటి నుంచి పంపే డబ్బు కోచింగ్ కే సరిపోయేవి. మళ్లీ వాళ్లను ఇబ్బంది పెట్టాలని లేదు. అందుకే ఇక్కడ ఫ్రెండ్స్ ద్వారా తెలిసి ఫుడ్ డెలివరీ బోయ్ గా చేరాను. మనం చేసే డెలివరీలను బట్టి మనీ ఇస్తారు. మాకు వారం లెక్కన జీతం ఉంటుంది. రోజుకు రూ.500 నుంచి వేయి వస్తాయి. నన్ను నేను చూసుకుంటూ ఇంటికి కొంత పంపిస్తున్నా. కొన్నిసార్లు ఆర్డర్ టైంకు ఇవ్వాలని ఫాస్ట్ గా వెళుతుంటాం. డెలివరీ బాయ్స్ అంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేది. కానీ చాలామంది నిరుద్యోగులకు ఇదే ఉపాధినిస్తుంది. ఒకరి మీద ఆధారపడకుండా మా పని మేం చేసుకుంటున్నాం."

**- అజయ్, ఫుడ్ డెలివరీ బోయ్**

### చదువు వదిలేసి...

"నేను ఏడో క్లాస్ వరకు చదివాను. తర్వాత ఇష్టం లేక మానేశాను. ఏదో ఒక పనిచేస్తూ ఉండేవాణ్ణి. నాకొక బైక్ ఉంది. ఫ్రెండ్స్ ద్వారా ఫుడ్ డెలివరీ బోయ్ గా చేరి సంవత్సరం నుంచి చేస్తున్నాను. ఇప్పుడు అమ్మవాళ్లకు ఇబ్బంది కాకుండా నా ఖర్చులు నేనే చూసుకుంటూ ఇంటికీ డబ్బు ఇస్తున్నా. 8 గంటల డ్యూటీ. డెలివరీలను బట్టి మనీ ఇస్తారు."

**- బండి అయ్యప్ప, ఫుడ్ డెలివరీ బోయ్**





# కోర్టు ఆదేశాలతో ఆటలా?

**న్యూఢిల్లీ:** సీబీఐ మాజీ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావుపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. సంచలనం రేపిన బిహార్‌లోని ముజఫర్‌నగర్ షెల్టర్‌హోం రేప్ కేసులను దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారి ఏకే శర్మను ట్రాన్స్ ఫర్‌చేయడాన్ని తప్పుబట్టింది. తాత్కాలిక డైరెక్టర్‌గా ఉండగా కోర్టు అనుమతుల్లేకుండానే జనవరి 17న శర్మను ఎలా బదిలీ చేశారంటూ సీజేఐ జస్టిస్ రంజన్‌గొగోయ్, జస్టిస్ దీపక్‌మిశ్రా, జస్టిస్‌సంజీవ్‌ఖన్నాలతో కూడిన బెంచ్‌నిలదీసింది. "దీన్ని మేం చాలా సీరియస్‌గా తీసుకుంటున్నాం. ఇది కచ్చితంగా కోర్టు ధిక్కారమే. కోర్టు ఆదేశాలతో మీరు ఆటలాడుకుంటున్నారు. మిమ్మల్నింకా ఎందుకు ఉపేక్షించాలి? ఇక ఆ దేవుడే కాపాడాలి. కోర్టు ఆదేశాలతో ఇంకెప్పుడూ ఇలా ఆడుకోకండి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆయనకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. ఈ నెల 12న హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. శర్మ ట్రాన్స్‌ఫర్‌విషయంలో సుప్రీం ఆదేశాలు ఉల్లంఘించిన మరో సీబీఐ అధికారి ఎస్.బసురామ్‌కు కూడా ధర్మాసనం చురకలంటించింది. ఈ వ్యవహారంలో బాధ్యులైన ఇతర అధికారుల పేర్లివ్వాలని సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లాను ఆదేశించింది. షెల్టర్ హోం కేసును బిహార్ సీబీఐ కోర్టు నుంచి ఢిల్లీలోని పోక్సో కోర్టుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.



- ఉపేక్షించబోం.. మీకిక దేవుడే దిక్కు
- సీబీఐ మాజీ చీఫ్ నాగేశ్వరరావుపై సుప్రీం ఫైర్
- ఢిల్లీ పోక్సో కోర్టుకు కేసు బదిలీ

## రెవెన్యూ డివిజన్లుగా కొల్లాపూర్, కోరుట్ల

- నోటిఫికేషన్ జారీ చేసిన రెవెన్యూ శాఖ

**హైదరా బాద్, వెలుగు:** నాగర్‌కర్నూల్, జగిత్యాల జిల్లాల్లో కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై రెవెన్యూ శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ మేరకు రెవెన్యూ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్, జగిత్యాల జిల్లాలో కోరుట్ల రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు జిల్లాల పరిధిలో భౌగోళిక స్థితిగతులను అధ్యయనం చేసిన తర్వాత కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లాలు ఉండగా, ఇటీవల మరో రెండు కొత్త జిల్లాలు ములుగు, నారాయణపేట ఏర్పాటుకు సర్కారు నోటిఫికేషన్ ఇచ్చి, ప్రజాభిప్రాయసేకరణ పూర్తి చేసిన విషయం తెలిసిందే.



# మీరా మాట్లాడేది?

## వ్యవస్థలను నాశనం చేసినవాళ్లా విమర్శించేది? ▌ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ ఫైర్

**న్యూఢిల్లీ:** లోక్‌సభ సాక్షిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాకూటమిని మహా కల్తీ కూటమి అని విమర్శించారు. 'ఉల్టా చోర్ చౌకీదార్ కో డాంటే' అంటూ మాటల తూటాలు పేల్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా గురువారం సాయంత్రం లోక్‌సభలో ఆయన ప్రసంగించారు. గంటన్నరపాటు మాట్లాడిన మోడీ.. ఒకవైపు నాలుగున్నరేళ్ల కాలంలో తాము చేసిన పనులను వివరిస్తూనే, మరోవైపు ప్రతిపక్షాలపై ఫైర్ అయ్యారు. రాఫెల్, బడ్జెట్, మహాకూటమి, కోల్ కతా ఘటన.. ఇలా ప్రతి అంశాన్ని ప్రస్తావించారు. దీంతో రాబోయే లోక్‌సభ ఎన్నికలకు లోక్‌సభ సాక్షిగా ప్రధాని మోడీ శంఖం పూరించినట్లయింది. దేశాన్ని కాపాడాలని చౌకీదార్ (ప్రధాని) చూస్తుంటే దొంగలు (ప్రతి పక్షాలు) దాడికి దిగుతున్నారని, లేనిపోని ఆరోపణలు చేస్తూ లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన నిప్పులు చెరిగారు. ''నీతి నిజాయితీతో పాలన అందిస్తున్నాం. అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఇదే వాళ్లకు నచ్చడం లేదు. మమ్మల్ని గెలిపించిన దేశ ప్రజలకే సంజాయిషీ ఇచ్చుకుంటాం కానీ అసంబద్ధ ఆరోపణలు చేసేవారికి కాదు'' అని స్పష్టం చేశారు. ''దేశంలో ఎమర్జెన్సీని తెచ్చి వ్యవస్థలను నాశనం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు వ్యవస్థలను మోడీ నాశనం చేస్తున్నారంటోంది. ఆర్మీని కించపరిచి, సాక్షాత్తు ఆర్మీ చీఫ్‌ను పట్టుకొని గూండా అని సంబోధించిన కాంగ్రెస్ వాళ్లు.. ఇప్పుడు మేము వ్యవస్థలను నాశనం చేస్తున్నామని ఏడుస్తోంది. ప్రణాళికా సంఘాన్ని పట్టుకొని జోకర్ల గుంపు అని విమర్శించినవాళ్లు, న్యాయవ్యవస్థను భ్రష్టుపట్టించినవాళ్లు ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నారు. ఇంతకంటే సిగ్గుచేటు ఉంటుందా?. వాళ్ల తీరు ఉల్టా చోర్ చౌకీదార్ కో డాంటేలా తయారైంది'' అని మోడీ దుయ్యబట్టారు. మజ్బూర్‌సర్కార్ (బలహీనమైన సర్కార్)ను ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, అలాంటి ప్రభుత్వమైతేనే ఆట లు సాగుతాయని భావిస్తున్నాయని విమర్శించారు. తాము మజ్బూత్ సర్కార్ (బలమైన సర్కార్)ను కోరుకుంటున్నామని, దేశ ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారని అన్నారు. ఎందరు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయేది మళ్లీ బలమైన సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు.

**అది మహామిలావట్**

ప్రతిపక్షాల కలయికను మోడీ ఎద్దేవా చేశారు. అది మహాఘట్‌బంధన్ (మహాకూటమి) కాదని, మహామిలావట్ (మహా కల్తీకూటమి) అని వ్యాఖ్యానించారు. 'మొన్న కోల్‌కతా వేదికగా మహామిలావట్ ఏం చేసిందో అందరికీ తెలుసు. అలాంటి ప్రభుత్వాన్ని ఎవరూ కోరుకోరు. ప్రజల కోసం పనిచేసేవాళ్లు కావాలి. అదే మేం చేస్తున్నాం. అవినీతికి తావులేకుండా చేశాం. మేము నిజాయితీగా మాట్లాడుతాం. నిజాయితీగానే పనిచేస్తాం. వాటిని వినే.. చూసే ధైర్యం ప్రతిపక్షాలకు లేదు' అని అన్నారు.

**దేశ రక్షణ వాళ్లకు నచ్చదు**

రాఫెల్‌పై కాంగ్రెస్‌చీఫ్ రాహుల్ గాంధీ ఆరోపణలను మోడీ తిప్పికొట్టారు. కాంగ్రెస్ పార్టీకి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ శక్తిమంతంగా ఉండటం ఇష్టం లేదని, అందుకే తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ''రాఫెల్‌పై మంత్రి నిర్మలా సీతారామన్ క్లారిటీ ఇచ్చారు. అయినా వాళ్లు లొల్లిపెడుతూనే ఉన్నారు. దాని వెనుక కారణం ఏమిటి? ఎయిర్‌ఫోర్స్‌ను నిర్వీర్యం చేయడమే వారి ఉద్దేశం. 30ఏళ్లలో కాంగ్రెస్ ఎందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు నెక్స్ట్ జనరేషన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు అందించలేకపోయింది? యావత్ దేశాన్ని పక్కదారి పట్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. చౌకీదార్ ఎవరికీ భయపడడు. దేశ ప్రజల కోసం, దేశ రక్షణ కోసం ముందుకు వెళ్తాం'' అని స్పష్టం చేశారు. డిమానిటైజేషన్ ఫలితంగా దేశంలో మూడు లక్షల నకిలీ కంపెనీలు, 20వేల ఫ్రాడ్ ఎన్జీవోలు మూతపడ్డాయని ప్రధాని తెలిపారు.

**మహాత్ముడి కల సాకారం చేస్తున్నాం**

కాంగ్రెస్ ముక్త్ భారత్ మహాత్మాగాంధీ కల అని, దాన్ని తాము సాకారం చేస్తున్నామని ప్రధాని మోడీ అన్నారు. కాంగ్రెస్‌లో చేరడమంటే ఆత్మహత్య సదృశ్యమేనని అంబేద్కర్ కూడా అనేవారు అని తెలిపారు. కాంగ్రెస్, ద్రవ్యోల్బణానికి అవినాభావ సంబంధం ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా దానంతట అదే ద్రవ్యోల్బణం రేటు పెరిగిపోతుందని, ఫలితంగా ధరలు ఆకాశాన్ని అంటుతాయని ఎద్దేవా చేశారు. 'ఉపాధి కల్పనపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. నాలుగేళ్లలో ఆరు లక్షల మంది కొత్త గా ప్రొఫెషన్స్‌లోకి వచ్చారని, వారి వల్ల ఎందరో ఉపాధి పొందుతున్నారని వివరించారు.

**రుణమాఫీ ఓ డ్రామా**

ప్రతిఎన్నికలకు ముందు రైతు రుణమాఫీ అంటూ కాంగ్రెస్ నాటకం ఆడుతోందని ప్రధాని విమర్శించారు. రుణమాఫీతో రైతులకు ఎలాంటి లాభం ఉండదని, ఎంత మంది రైతులకు కాంగ్రెస్ రుణమాఫీ చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. చిన్న, సన్నకారు రైతులు బాగుపడాలనే పీఎం కిసాన్ పథకం తీసుకువచ్చామని, పంటలకు కనీస మద్దతు ధరను పెంచామని, రైతు ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు.

''కాంగ్రెస్‌కు నిజాలు ఒప్పుకునే అలవాటు లేదు. రాష్ట్రాల హక్కులను కాలరాసిన చరిత్ర దానిది. నెహ్రూ, ఇందిర హయాంలోనే కేరళ, బెంగాల్‌లో హక్కులను కాలరాశారు. ఆర్టికల్ 352ను ఎన్నోసార్లు ప్రయోగించారు. కేరళలో 1959లో తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోసింది కాంగ్రెస్సే. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్నీ కూలదోశారు. మోడీని, బీజేపీని తిట్టడమే ప్రతిపక్షాల పని. అలా తిడుతూ తిడుతూ దేశాన్ని కూడా ద్వేషిస్తున్నాయి''



### బీసీ: బిఫోర్ కాంగ్రెస్
### ఏడీ: ఆఫ్టర్ డైనాస్టీ

**మోడీ కొత్త భాష్యం**

బీసీ, ఏడీ అంటూ గత కాంగ్రెస్ పాలనకు మోడీ కొత్త అర్థం చెప్పారు. బీసీ అంటే బిఫోర్ కాంగ్రెస్ (కాంగ్రెస్‌కు ముందు), ఏడీ ఆఫ్టర్ డైనాస్టీ (వంశపాలన తర్వాత) అని విమర్శించారు. కాంగ్రెస్ పాలనకు ముందు, తర్వాత దేశం ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారని, 2004నుంచి 2014 వరకు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ఆ పార్టీ పాలనలో అడుగడుగునా బ్రోకర్లు కనిపించేవారని, వాళ్లు లేకుండా ఏ పనిజరిగేది కాదన్నారు. వంశపాలనకు మోడీలాంటి ఓ సామాన్యుడు ఎదురుగా నిలబడటాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని అన్నారు.



గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ ఆఫీస్ నుంచి అన్న రాహుల్‌తో కలసి బయటకు వస్తున్న ప్రియాంక

# మోడీ పిరికిపంద: రాహుల్

**న్యూఢిల్లీ/లక్నో:** ప్రధాని నరేంద్ర మోడీ పిరికిపంద అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాఫెల్, జాతీయ భద్రత అంశాలపై తనతో చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరారు. ''ఆయన కేరక్టర్ ఏంటో ఐదేళ్లుగా తెలుసు నాకు. అజెండా లేకుండానే చైనాతో శిఖరాగ్రానికి వెళ్లారు. అదే సమయంలో డోక్లామ్‌కు చైనా తన ఆర్మీని పంపింది. అయినా చైనా ముందు చేతులు కట్టుకు కూర్చున్నారు. మోడీకి కనీసం నాలుగంగుళాల ఛాతీ కూడా లేదని చైనాకు అర్థమైపోయింది. రాఫెల్ సహా ఏ అశం మీదైనా నాతో 5 నిమిషాలు మోడీని చర్చించమనండి చూద్దాం. తనను ఢీకొట్టే వాళ్లకు వీపు చూపిస్తారాయన'' అని ఎద్దేవా చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ నుంచి ఎలక్షన్ సంఘం దాకా అన్ని రాజ్యాంగ వ్యవస్థలనూ తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ''జ్యుడీషియరీలో, ఎలక్షన్ సంఘంలోనూ ఆర్ఎస్ఎస్ తన మనుషుల్ని పెట్టింది. మోడీపై విచారణ చేయాలని సీబీఐ చీఫ్ అనుకుంటే ఆయననూ తొలగించి ఆ స్థానంలో ఆర్ఎస్ఎస్ వ్యక్తిని నియమిస్తారు'' అని దుయ్యబట్టారు. తమ పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో ఆర్ఎస్ఎస్ పప్పులుడకవన్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ హయాంలో ప్రత్యేక శాఖ పెట్టి రూ.800 కోట్లు కేటాయించి మరీ ఆర్ఎస్ఎస్ మనుషుల్ని నింపారని, అలాంటి ఆర్ఎస్ఎస్ సానుభూతిపరుల్ని ఏరేస్తామన్నారు.

**అన్నతో కలిసి ప్రియాంక యూపీ టూర్**


కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టాక ప్రియాంక గాంధీ తొలిసారి ఉత్తర్‌ప్రదేశ్‌లో పర్యటించనున్నారు. అన్న రాహుల్ గాంధీతో కలిసి 11న సోమవారం లక్నో వెళ్లనున్నారు. విమానాశ్రయం నుంచి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం దాకా రోడ్ షోకు పార్టీ కార్యకర్తలు ప్లాన్ చేస్తున్నారు.

# స్పీకర్‌కు సీఎం కేసీఆర్ పరామర్శ



స్పీకర్ పోచారం తల్లి పాపవ్వకు నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్

**కామారెడ్డి/బాన్సువాడ, వెలుగు:** మాతృవియోగంతో బాధపడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సీఎం కేసీఆర్ పరామర్శించారు. గురువారం హెలికాప్టర్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడ చేరుకున్న సీఎం.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో స్పీకర్ స్వగ్రామం పోచారం వెళ్లారు. పాపవ్వ చిత్ర పటానికి సీఎం కేసీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు . పోచారంతో పాటు, ఆయన సోదరుడు శంబురెడ్డిని ఓదార్చారు. మంగళవారం అర్ధరాత్రి స్పీకర్ తల్లి పాపవ్వ కన్నుమూశారు.



## లోక్ సభకు ఒంటరి పోరు

**కమల్ హాసన్ ప్రకటన**

**కోయంబత్తూర్ :** లోక్ సభ ఎన్నికల్లో తమిళనాట మక్కల్ నీధి మయ్యం(ఎంఎన్ఎమ్) ఒంటరిగా బరిలో దిగబోతోంది. రాష్ట్రంలోని 39 స్థానాల్లో, పుదుచ్చేరిలోని ఒక లోక్ సభ స్థానానికి పోటీ చేస్తున్నట్లు పార్టీ ప్రెసిడెంట్ కమల్‌హాసన్ గురువారం ప్రకటించారు. ''ప్రజలకు మంచి చేయాలనుకుంటున్నాం. మా చేతులకు అవినీతి అంటకుండా జాగ్రత్త పడుతున్నాం. అందుకే ద్రవిడ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం లేదు'' అని కమల్ చెప్పారు.

## మోడీ సర్కారులో రాష్ట్ర భాగస్వామ్యం ఉండాలి

**తెలంగాణ నేతలతో బీజేపీ చీఫ్ షా**

**హైదరాబాద్, వెలుగు:** లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏర్పడే మోడీ ప్రభుత్వంలో తెలంగాణ భాగస్వామ్యం ఉండాలని రాష్ట్ర నేతలతో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. ఇందుకోసం ఎక్కువ సీట్లు గెలిచేలా కృషి చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు సన్నాహక సమావేశాలు, కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ నెలఖరులో తెలంగాణకు వస్తానని షా చెప్పారు.

## ఏపీ మండలి చైర్మన్ ఎం.ఎ. షరీఫ్

**విజయవాడ, వెలుగు:** ఏపీ శాసనమండలి చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత, ప్రభుత్వ విప్ ఎం.ఎ. షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదవికి ఒకే నామినేషన్ దాఖలవడంతో షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండలి ఇన్‌చార్జి చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రకటించారు. షరీఫ్ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం. ఎన్టీఆర్ టీడీపీని ప్రారంభించిన తొలినాళ్లలోనే పార్టీలో చేరారు.

# 31 డీసీసీలకు కొత్త అధ్యక్షులు

## బీసీలకు 12, రెడ్లకు 10 ● ఇద్దరు ఎమ్మెల్యేల భార్యలకూ చాన్స్


**హైదరాబాద్, వెలుగు:** ఎట్టకేలకు కాంగ్రెస్ 31 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ జాబితాలో 12 మంది బీసీలకు స్థానం దక్కింది. 10 మంది రెడ్లకు, ఎస్సీ, ఎస్టీ, బ్రాహ్మణ, కమ్మ, ముస్లిం సామాజిక వర్గాలకు రెండు చొప్పున పదవులు దక్కాయి. డీసీసీ అధ్యక్షుల జాబితాలో ముగ్గురు శాసన సభ్యులు, ఇద్దరు ఎమ్మెల్యేల సతీమణులు కూడా ఉన్నారు. సంగారెడ్డి బాధ్యతలు ఎమ్మెల్యే జగ్గారెడ్డి భార్య నిర్మలా గౌడ్‌కు, భూపాలపల్లి బాధ్యతలు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భార్య గండ్ర జ్యోతికి అప్పగించారు. ఖమ్మం సిటీకి జావెద్, గ్రేటర్ హైదరాబాద్‌కు అంజన్ కుమార్ యాదవ్‌లను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దీపక్ చౌదరిని నియమించారు.

**ఇదీ జాబితా..**

| | | | |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | భార్గవ్ దేశ్ పాండే | మెదక్ | తిరుపతి రెడ్డి |
| మంచిర్యాల | కొక్కిరాల సురేఖ | సిద్దిపేట | టి.నర్సారెడ్డి |
| నిర్మల్ | రామారావు పటేల్ | వికారాబాద్ | పైలెట్ రోహిత్ రెడ్డి (తాండూరు ఎమ్మెల్యే) |
| ఆసిఫాబాద్ | ఆత్రం సక్కు (ఆసిఫాబాద్ ఎమ్మెల్యే) | మేడ్చల్ | కూన శ్రీశైలం గౌడ్ |
| కరీంనగర్ | కె. మృత్యుంజయం | రంగారెడ్డి | చల్లా నర్సింహారెడ్డి |
| జగిత్యాల | అడ్లూరి లక్ష్మణ్ కుమార్ | మహబూబ్‌నగర్ | ఒబేదుల్లా కొత్వాల్ |
| పెద్దపల్లి | ఈర్ల కొమురయ్య | వనపర్తి | శంకర్ ప్రసాద్ |
| సిరిసిల్ల | ఎన్.సత్యనారాయణ గౌడ్ | గద్వాల | పటేల్ ప్రభాకర్ రెడ్డి |
| నిజామాబాద్ | ఎం.మోహన్ రెడ్డి | నాగర్ కర్నూల్ | చల్లా వంశీ కృష్ణ |
| నిజామాబాద్ సిటీ | కె.వేణు | సూర్యాపేట | వెంకన్న యాదవ్ |
| కామారెడ్డి | కైలాస్ శ్రీనివాసరావు | యాదాద్రి | బి. భిక్షమయ్య గౌడ్ |
| వరంగల్ | నాయిని రాజేందర్ రెడ్డి | మహబూబాబాద్ | భరత్ చంద్రారెడ్డి |
| వరంగల్ సిటీ | కట్ల శ్రీనివాసరావు | నల్గొండ | శంకర్ నాయక్ |
| భూపాలపల్లి | గండ్ర జ్యోతి | కొత్తగూడెం | వి. వెంకటేశ్వర్ రావు (కొత్తగూడెం ఎమ్మెల్యే) |
| జనగామ | జంగా రాఘవరెడ్డి | | |
| సంగారెడ్డి | నిర్మలా గౌడ్ | ఖమ్మం | పువ్వాడ దుర్గాప్రసాద్ |

# 'పీఎం కిసాన్'ను తక్కువ చేసి చూపిస్తోంది

● **టీఆర్ఎస్‌పై లక్ష్మణ్ ఫైర్**



**హైదరాబాద్, వెలుగు:** రైతులకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని టీఆర్ఎస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి చూపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అర్హులైన రైతులకు కూడా ఈ పథకం వర్తించదని దుష్ప్రచారం చేస్తోందని చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను కుదించి రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇటీవల ఎన్నికైన ప్రతిపక్ష పార్టీల సర్పంచ్‌లను బెదిరించేలా సీఎం కేసీఆర్ వ్యవహరించారని ఆరోపించారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రానికి రూ.1.15 లక్షల కోట్లను కేంద్రం విడుదల చేసిందని, ఆ నిధులను ఏం చేశారో చెప్పాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందన్నారు. చిన్న, సన్నకారు రైతుకు హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.6 లక్షలకు ఆర్బీఐ పెంచడంపై బీజేపీ రాష్ట్ర శాఖ హర్షం తెలిపింది.

## తలనీలాల వేలంతో టీటీడీకి 11.17 కోట్లు

**తిరుమల, వెలుగు:** తలనీలాల విక్రయం ద్వారా టీటీడీకి రూ.11.17 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రతినెల మొదటి గురువారం టీటీడీ తలనీలాల వేలం వేస్తున్న విషయం తెలిసిందే. గురువారం టీటీడీ తిరుమల జేఈవో కె.ఎస్. శ్రీనివాసరాజు పర్యవేక్షణలో తలనీలాల ఈ వేలం జరిగింది. మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు రకాల తలనీలాలు, తెల్లవెంట్రుకల ఈ వేలం జరిగింది. మొత్తం 1,43,900 కిలోల తలనీలాలు అమ్ముడైనట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

## కాశ్మీర్‌లో టన్నెల్‌ను ముంచెత్తిన అవలాంచ్

### చిక్కుకున్న పది మంది పోలీసులు

**శ్రీనగర్:** జమ్ము-శ్రీనగర్ నేషనల్ హైవేలోని ఓ టన్నెల్‌ను అవలాంచ్ ముంచెత్తడంతో పది మంది పోలీసులు అందులో చిక్కుకున్నారు. టన్నెల్ దగ్గర్లోని పోలీస్ ఔట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కొంతమంది క్షేమంగా బయటపడగా కనీసం పదిమంది ఇరుక్కుపోయి ఉంటారని పోలీసులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా జమ్ము,శ్రీనగర్‌లో మంచు భారీగా కురుస్తోంది. దీంతో పూంచ్, రాజౌరి, రాంబన్, డోడా, కిష్టావర్, ఉద్దంపూర్, లేహ్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అధికారులు అవలాంచ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో కుల్గాం జిల్లాలోని జవహర్ టన్నెల్ ప్రాంతాన్ని గురువారం అవలాంచ్ విరుచుకుపడింది. టన్నెల్‌లో చిక్కుకుపోయిన పోలీసులను రక్షించేందుకు రెస్క్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.



గురువారం ఆర్మూర్‌లో రోడ్డుపై బైఠాయించిన పసుపు రైతులు

# రోడ్డెక్కిన పసుపు రైతు

### మద్దతు ధర కోసం నిజామాబాద్ రైతుల ధర్నా

**నిజామాబాద్, వెలుగు:** నిజామాబాద్ జిల్లా పసుపు రైతులు రోడ్డెక్కారు. మద్దతు ధర కోసం ఆర్మూర్ రోడ్లు దద్దరిల్లేలా నినదించారు. ప్రభుత్వం హామీ ఇస్తేగానీ ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. గిట్టుబాటు ధర కోసం ఆర్మూర్ పట్టణంలో రైతులు గురువారం ధర్నాకు దిగారు. మద్దతు ధర కల్పించాలని సర్కారును ఎన్నిసార్లు వేడుకున్నా స్పందించలేదని విమర్శించారు. పంటకు ధర లేక అప్పులపాలవుతున్నామని ఆవేదన చెందారు. రైతుల ధర్నాతో దిగొచ్చిన అధికారులు విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి ఈ నెల 11 లోపు నిర్ణయం తీసుకుంటామన్నారు. వారి హామీతో ధర్నా విరమించిన రైతులు.. 11 నాటికి సరైన నిర్ణయం వెలువడకపోతే 12న కుటుంబాలతో సహా రోడ్డెక్కుతామని హెచ్చరించారు. 12న ధర్నాకు సిద్ధంగా ఉండాలని రైతులకు ఉద్యమనాయకులు సూచించారు.

**సీఎం వాకబు**

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించేందుకు సీఎం కేసీఆర్ గురువారం బాన్సువాడ వచ్చారు. రైతుల ఆందోళన గురించి తెలుసుకున్న ఆయన ఆర్మూర్, బాల్కొండ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలను వివరాలు అడిగినట్లు తెలిసింది. పసుపుకు మద్దతు ధర లేకపోవడం నిజమేనని వారు సీఎంకు చెప్పినట్లు సమాచారం.

# ఆఫీస్ సామాను జప్తు చేస్కోండి

### రైతుల పరిహారం కేసులో కోర్టు ఆదేశం ■ ఆర్డీవో కార్యాలయంలో కంప్యూటర్లు బయటేసిన అన్నదాతలు

**వరంగల్ రూరల్, వెలుగు:** వాళ్లంతా రైతులు. 30 ఏళ్ల కింద చెక్‌డ్యాం కోసం సర్కారు వాళ్ల భూమి తీసుకుంది. రూ.27.81 లక్షల పరిహారానికిగాను కేవలం రూ.1.20 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంది. మిగతా పైసల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరిగారు. లాభం లేకపోవడంతో అప్పుడే కోర్టు తలుపు తట్టారు. చివరికి ఇన్నేళ్ల తర్వాత ఆర్డీవో ఆఫీసులోని ఫర్నీచర్, ఇతర సామాను జప్తు చేసుకోవాలని కోర్టు ఆదేశించింది. రైతులు ఆఫీసులోని కంప్యూటర్లను, ఇతర సామాను ఒక్కొక్కటిగా బయటపడేయడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా జఫర్‌గఢ్ మండలం రఘునాథపల్లికి చెందిన గోపు వెంకటరెడ్డి, చంద్రారెడ్డి, యాదవరెడ్డి కుటుంబానికి చెందిన 5.5 ఎకరాల భూమిని అధికారులు 1990లో చెక్‌డ్యాం నిర్మాణం కోసం తీసుకున్నారు. రూ.27.81 లక్షలకు రూ.1.20 లక్షలు మాత్రమే ఇవ్వడంతో రైతులు కోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం ఎన్నోసార్లు మొట్టికాయలు వేసినా అధికారులు వినలేదు. దీంతో ఆర్డీవో ఆఫీసులోని ఫర్నీచర్, ఇతర సామాను జప్తు చేసుకోవాలంటూ గురువారం జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాలిచ్చారు. ఆ వెంటనే రైతులు తమ లాయర్‌తో కలిసి హన్మకొండలోని ఆర్డీవో ఆఫీసుకు చేరుకున్నారు. ఆర్డీవో సెలవులో ఉండడంతో విషయాన్ని అక్కడి అధికారులకు చెప్పారు. తర్వాత కంప్యూటర్లు, స్కానర్లు, ఇతర సామాను తీసి బయటపెట్టారు. రైతులను సముదాయించడానికి అధికారులు పెద్దోళ్లతో మాట్లాడించే ప్రయత్నం చేశారు. బాధితుల తరపు లాయర్‌తో ఆర్డీవో ఫోన్‌లో మాట్లాడే ప్రయత్నం చేసినా విన్లేదు. మధ్యాహ్నం వరకు ఆర్డీవో ఆఫీస్‌లో ఈ హడావుడి జరిగింది. చివరికి అర్బన్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ రైతుల తరఫున లాయర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వారంలో కొంత డబ్బు ఇస్తామని, పూర్తి న్యాయం చేయడానికి నెల గడువు కావాలని అడిగారు. దీనికి బాధితులు సరే అనడంతో.. బయట పడేసిన కంప్యూటర్లు, స్కానర్లన్నీ మళ్లీ ఆఫీసులోకి వెళ్లాయి.



హన్మకొండ ఆర్డీవో ఆఫీస్‌లో సామాను తీసుకెళ్లేందుకు వచ్చిన బాధిత రైతులు

**30 ఏండ్ల నుంచి మాతో ఆడుకున్నరు**

చెక్‌డ్యాం పేరుతో బలవంతంగా 5.5 ఎకరాల భూమిని తీసుకున్నరు. మేమంతా రోడ్డున పడ్డం. 30 ఏళ్ల నుంచి అధికారులు మాతో ఆడుకున్నరు. తిరిగి తిరిగి కాళ్లు అరిగినయ్. ఏడ్చి ఏడ్చి కళ్లల్లో నీళ్లు ఇంకినయ్. మా భూములు మాకుంటే ఇలా ఉండేటోళ్లం కాదు. ఏదో ఇంత పంట వేసుకుని మంచిగా బతికేటోళ్లం. మా జీవితమంతా ఆఫీసులు, కోర్టుల చుట్టూ తిరగడానికే గడిచింది. కోర్టు తీర్పుతో మాకు న్యాయం జరుగుతుందనే ఆశ ఉంది.

- బాధిత రైతు వెంకటరెడ్డి

# బెంగాల్ కోటలో ఓట్ల వార్

### సై అంటే సై అంటున్న తృణమూల్, బీజేపీ ■ నామ్‌కే వాస్తేగా కాంగ్రెస్, వామపక్షాలు

**వెలుగు బ్యూరో:**

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తర్వాత దేశంలో అత్యధిక లోక్‌సభ సీట్లు ఉన్న రాష్ట్రం పశ్చిమ బెంగాల్. 42 లోక్‌సభ సీట్లున్న బెంగాల్ లో రాజకీయ చైతన్యం ఎక్కువ. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇక్కడ 2014 వరకు నామ మాత్రపు పార్టీలే. కాంగ్రెస్ నుంచి విడిపోయి మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన తర్వాత పోటీ ప్రధానంగా సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, తృణమూల్ మధ్యనే జరిగింది. ఇప్పుడు తృణమూల్ వర్సెస్ బీజేపీలా మలుపుతీసుకుంది. తృణమూల్‌కు ఇప్పటికిప్పుడు వచ్చిన ముప్పేమీలేదు. కానీ బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా అవతరిస్తున్న తీరు.. తృణమూల్ క్యాడర్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. సంప్రదాయ ప్రతిపక్ష పార్టీలైన సీపీఎం, కాంగ్రెస్‌ను పక్కకుతోసి కమలం తన పరిధి విస్తరించుకుంటోంది. గత సంవత్సరం జరిగిన ఉలుబేరియా లోక్‌సభ బై ఎలక్షన్ లో తృణమూల్ కాంగ్రెస్ భారీ ఆధిక్యంతో గెలిచింది. మైనారిటీ వర్గానికి చెందిన ఆ పార్టీ అభ్యర్థి అహ్మద్.. నాలుగు లక్షలకు పైగా మెజారిటీతో గెలిచారు. బీజేపీ అభ్యర్థి అనుపమ్ మాలిక్ సెకండ్ ప్లేస్‌లో నిలిచారు. సీపీఎం, కాంగ్రెస్ మూడు నాల్గో స్థానాలకే పరిమితమయ్యాయి. 2014 లోక్ సభ ఎన్నికల్లోకన్నా ఈసారి తృణమూల్ మెజారిటీని పెంచుకుంది. కాని బీజేపీ రెండో స్థానాన్ని చేజిక్కించుకోవడం ఇటు తృణమూల్‌కు, అటు సీపీఎం, కాంగ్రెస్ లను కలవరపరుస్తోంది. ఇక నేపర అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ సేమ్ సీన్. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాన్ని టీఎంసీ తన ఖాతాలో వేసుకుంది. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థి రెండో స్థానంలో ఉండటం విశేషం. ఈ ఉప ఎన్నికల ఫలితాలు.. తృణమూల్ కు ప్రధాన ప్రత్యర్థి బీజేపీనేనని స్పష్టం చేస్తున్నాయి. సీపీఎం, కాంగ్రెస్ నామ్ కే వాస్తేగా మారడం.. రెండో స్థానానికి బీజేపీ రావడం.. బెంగాల్ పార్టీలను సవాల్ చేసినట్లైంది. ఇదే తృణమూల్ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఆందోళన కలిగిస్తున్న పరిణామం. కాంగ్రెస్, సీపీఎం కన్నా కమలం పార్టీని ఎదుర్కోవడం కష్టమన్నది ఆమెకు బాగా అర్థమైంది. కాషాయ పార్టీ రాకతో ఓట్ల పునరేకీకరణ జరగదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కాంగ్రెస్, సీపీఎం నుంచి ముస్లిం ఓటు బ్యాంకును మమత గుప్పిటపెట్టుకున్నారు. బెంగాల్ లో ముస్లిం ఓటర్ల ప్రభావమెక్కువ. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన ముస్లింలు మొదట్లో కాంగ్రెస్, తర్వాత సీపీఎం పక్షాన నిలిచారు. క్రమంగా ఆ రెండు పార్టీలు బలహీనపడటంతో.. తృణమూల్ వైపు వచ్చారు. ఇప్పుడు వాళ్లే తృణమూల్ కి ప్రధాన ఓటు బ్యాంక్. అయితే.. హిందుత్వ నినాదంతో హిందువుల ఓట్లతో బీజేపీ బలపడతోందని తృణమూల్ కలవరపడుతోంది.


**బెంగాల్ పై మోడీ, షా ప్రత్యేక దృష్టి**

2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 281 సీట్లు సాధించి సొంతంగా అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం హిందీ హార్ట్ ల్యాండ్ లో ఆ పార్టీ క్లీన్ స్వీప్ చేయడం. యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, రాజస్థాన్, గుజరాత్ , హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీ 90 నుంచి 100 శాతం సీట్లను గెలుచుకుంది. అయితే ఈ సారి ఆ పరిస్థితి లేదు కాబట్టి తూర్పు వైపు కన్నేసింది. 42 సీట్లున్న బెంగాల్ పై అమిత్ షా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు . నెలకోసారి బెంగాల్ లో పర్యటిస్తూ కార్యకర్తల్లో ఉత్తేజం పెంచుతున్నారు. 2019 ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఏకైక లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు. బెంగాల్‌లో ఎదురులేని శక్తిగా నిలవాలంటే హిందువుల ఓట్లను మొత్తం తమవైపు తిప్పుకోవడమే మార్గమని బీజేపీ చూస్తోంది. బెంగాల్‌లో గత ఏడాది దుర్గామాత నిమజ్జన కార్యక్రమం.. ఎన్నడూ లేనివిధంగా రాజకీయ రంగు పులుముకుంది. ఇతర పండుగలకు అనుమతిచ్చిన మమతా సర్కార్ దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి మాత్రం కొన్ని ఆంక్షలు పెట్టింది. వీహెచ్‌పీ నేతలు హైకోర్టుకు వెళ్లి మరీ నిమజ్జనం ఆర్డర్స్ తెచ్చుకున్నారు. దుర్గామాత విగ్రహాల నిమజ్జనం శాంపిల్ మాత్రమేనని, అసలు సినిమా ఇంకా ముందుందని అప్పుడే టీఎంసీకి రాజకీయంగా బీజేపీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో రెండు లోక్ సభ స్థానాలను గెలుచుకున్న బీజేపీ.. ఈసారి 20కిపైగా సీట్లు సాధించాలని వ్యూహం రచిస్తోంది. అయితే.. బెంగాల్ లో బీజేపీ క్యాడర్ జోరుమీదున్నా.. పార్టీని నడిపించే నేతలు కంటికి కనిపించడం లేదు. కేంద్రమంత్రి బాబుల్ సుప్రియో, రాజ్యసభ ఎంపీ రూపా గంగూలీ మాత్రమే.. కాస్త పేరున్న లీడర్లు. మమతను ఢీకొట్టే దమ్ము వీళ్లకు లేదు. ఆ స్థాయి నేతలు లేకపోవడం మైనస్. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వరుసబెట్టి ఆందోళనలు చేస్తున్నా..ఆ టెంపోని ఓట్లుగా మలిచే నేత ప్రస్తుతం బీజేపీకి చాలా అవసరం. అయితే బెంగాల్ లో బలపడాలని చూస్తోన్న బీజేపీకి.. సొంత పార్టీ నుంచే షాక్ తగిలింది. ఆ పార్టీ నుంచి రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైన చందన్ మిత్రా.. బీజేపీకి రాజీనామా చేసి తృణమూల్ కాంగ్రెస్ లో చేరారు. బీజేపీ సీనియర్ నేత అద్వానీకి సన్నిహితుడిగా మిత్రాకు గుర్తింపు ఉంది.





**ఎన్నిక ఏదైనా దీదీ పార్టీదే లీడ్**



35 సంవత్సరాల వామపక్షాల పాలనను అంతం చేస్తూ మమతా బెనర్జీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆమెకు తిరుగే లేకుండా పోయింది. 2009 లోక్ సభ ఎన్నికల నుంచి ప్రతి ఎన్నికలోనూ దీదీదే పైచేయి. 2011 అసెంబ్లీ, 2014 లోక్ సభ, 2016 అసెంబ్లీ ఇలా ఎన్నిక ఏదైనా మమతనే అధిపత్యం చెలాయిస్తూ వస్తున్నారు. 2009 లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి 25 సీట్లు, సొంతంగా 19 సీట్లు సాధించిన దీదీ.. 2014 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి 34 సీట్లు సాధించారు. ఈ సారి 40 సీట్లు తమ టార్గెట్ అంటున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 45శాతం ఓట్లు సాధించిన మమత ఇప్పుడు కూడా ఆ ఓట్ల శాతాన్ని నిలబెట్టుకుంటామన్న కాన్ఫిడెన్స్ తో ఉన్నారు. 2014 తరువాత జరిగిన ప్రతి లోక్‌సభ, అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ దీదీయే గెలుస్తూ వస్తున్నారు. గత సంవత్సరం జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ టీఎంసీదే పైచేయి. 31వేలకుపైగా స్థానాల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తృణమూల్ దే లీడ్. దాదాపు 20వేల స్థానాల్ని ఖాతాలో వేసుకుంది. ఆరు వేల వరకు స్థానాల్ని బీజేపీ గెలిచి సెకండ్ పొజిషన్ లో నిలిచింది. సీఎం మమతా బెనర్జీ ప్రతి విషయంలోనూ కేంద్రంతో సై అంటే సై అంటున్నారు. మోడీ సర్కార్ ను ఆమె విమర్శిస్తున్నట్టుగా దేశంలోని ఇతర ఏ పార్టీ విమర్శించడం లేదు. ఎన్ఆర్‌సీ విషయంలో మమత ఫైరయినట్లు ఎవరూ కాలేదు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, పెట్రో ధరల పెంపు, ఆధార్.. ఇలా ప్రతి విషయంలో కేంద్రంతో దూకుడుగా ఉంటున్నారు. తాజాగా కోల్ కతా పోలీస్ కమిషనర్ ను సీబీఐ అధికారులు విచారించేందుకు వచ్చినప్పుడు మమత చేపట్టిన ఆందోళన చర్చనీయాంశమైంది. మోడీకి దీటైన ప్రత్యర్థి దీదీయేనని ప్రతిపక్షాల్లోని కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటించారు. ప్రతిపక్ష కూటమిలోని కాంగ్రెస్ కు 100 కుమించి సీట్లు రాని పక్షంలో ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతుతో ప్రధాని పదవి అధిరోహించాలన్నది మమత బెనర్జీ కలగా తెలుస్తోంది.





**వామపక్షాలు, కాంగ్రెస్ పరిస్థితి ఏంది?**

ఒకప్పుడు బెంగాల్ అంటే లెఫ్ట్ ,లెఫ్ట్ అంటే బెంగాల్ లా నాటుకుపోయిన కమ్యూనిస్టుల ప్రాభవం క్రమంగా తగ్గూతు వస్తోంది. 35 సంవత్సరాల పాటు ఏకబిగిన అధికారాన్ని అనుభవించి దేశంలో రికార్డు సృష్టించిన సీపీఎం ఓటు బ్యాంక్ చెదిరిపోతోంది. 2011లో అధికారం కోల్పోయిన తరువాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ కమ్యూనిస్టుల ఓట్లు తగ్గుతూ వస్తున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 2 సీట్లు గెలుచుకున్న సీపీఎం, 2016 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయింది. నిజానికి 2016 ఎన్నికల్లో కాంగ్రెస్ , లెఫ్ట్ పార్టీలు కలిసి పోటీ చేశాయి. కాంగ్రెస్ కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేసినా సీపీఎంకు కేవలం 26 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ 44 సీట్లు సాధించి ప్రధాన ప్రతిపక్ష హోదా కొట్టేసింది. కమ్యూనిస్టులకు ప్రధాన ఓటు బ్యాంక్ అయిన హిందువులను బీజేపీ తన వైపు కు మళ్లించుకుంటోంది. బెంగాల్ లో గత వైభవాన్ని నిలబెట్టుకోవడం ఎలా అన్నదే కమ్యూనిస్టులను ఇప్పుడు వేధిస్తున్న ప్రశ్న. ఇక, 2009 లోక్‌సభ ఎన్నికల్లో టీఎంసీతో పొత్తుతో 6 సీట్లు సాధించిన కాంగ్రెస్, 2014 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి 4 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం మమత తో దోస్తీ చేస్తుండగా.. రాష్ట్ర నాయకత్వం మాత్రం ఆమెతో కుస్తీ పడుతోంది. మొత్తానికి రాష్ట్రంలో వేగంగా ఎదుగుతున్న బీజేపీని, ఇటు అధికార టీఎంసీని ఎదుర్కొనేందుకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం తంటాలు పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరి వామపక్షాలతో కాంగ్రెస్ పొత్తు చివరి నిమిషంలో కుదిరినా ఆశ్చర్యపోనక్కర్లేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ ల మధ్య పొత్తు కుదరకుంటే రాష్ట్రంలో చతుర్ముఖ పోటీ తప్పదు. అదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి టీఎంసీనే లాభపడే అవకాశముంది.

# కిష్టాపూర్..100% ఓడీఎఫ్ విలేజ్

- సర్పంచ్ కృషిని గుర్తించిన కేంద్రం
- గ్రామీణ సమ్మేళనానికి రావాలని ఆహ్వానం

**భైంసా, వెలుగు:**

వంద శాతం ఓడీఎఫ్ (బహిరంగ విసర్జన లేని) గ్రామంగా జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్. ఈ గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండడమే కాకుండా అందరూ ఉపయోగిస్తున్నారు. సంపూర్ణ పారిశుధ్యం, పరిశుభ్రతకు సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు చేసిన కృషిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గుర్తించింది. ఈ నెల 12న హర్యానాలోని కురుక్షేత్రలో జరగనున్న గ్రామీణ సమ్మేళనానికి సర్పంచ్ శైలజను కేంద్రం ఆహ్వానించింది. ఆమె వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులూ వెళ్లనున్నారు. 201718లో మరుగుదొడ్ల నిర్మాణాల్లో కిష్టాపూర్ గ్రామం జిల్లాలో తొలిస్థానంలో నిలిచింది. జిల్లా, రాష్ట్రస్థాయి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి ఇక్కడి ప్రగతిని వివరిస్తూ జాతీయ స్థాయి సమ్మేళనానికి సిఫారస్ చేశారు. కిష్టాపూర్‌కు జాతీయస్థాయి గుర్తింపు రావడంపై ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

## అధికారంలోకి వస్తే ట్రిపుల్ తలాక్ చట్టం రద్దు

### జాతీయ మహిళా కాంగ్రెస్ చీఫ్ సుస్మితా దేవ్

**న్యూఢిల్లీ:** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ట్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దుచేస్తామని జాతీయ మహిళా కాంగ్రెస్ చీఫ్ సుస్మితా దేవ్ చెప్పారు. ట్రిపుల్ తలాక్ పేరుతో ముస్లిం మహిళలు, ముస్లిం మగాళ్లను చూసి జాలిపడే వాతావరణాన్ని ప్రధాని నరేంద్రమోడీ సృష్టించారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ''ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందితే మహిళలకు అధికారం వస్తుందని చాలామంది మాకు చెప్పారు. అయితే ముస్లిం పురుషుల్ని జైల్లో పెట్టి, వారిని పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగేలా బిల్లును రూపొందించిన మోడీ దీన్ని తమ స్వార్థానికి వాడుకుంటారన్న ఉద్దేశంతోనే బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించింది'' అని ఆమె అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దుచేస్తామని ఆమె చెప్పారు.

## సర్కారు చెంతకు ఏకీకృత సర్వీస్ రూల్స్ ఫైల్

### ఆర్థిక శాఖ ఆమోదానికి పంపిన విద్యా శాఖ

**హైదరాబాద్, వెలుగు:** టీచర్ల ఏకీకృత సర్వీస్ రూల్స్ సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి సర్వీస్‌రూల్స్ కొట్టివేత తీర్పుపై సుప్రీంకోర్టు స్టే నేపథ్యంలో విద్యాశాఖ వేగంగా స్పందించింది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఒకే సర్వీస్‌రూల్స్ రూపొందించి గురువారం ఆర్థిక శాఖకు పంపింది. ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే న్యాయశాఖ, పరిపాలన విభాగం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదానికి పంపుతారు. అక్కడ ఓకే అయిన అనంతరం ఆ ఫైల్ సీఎం చెంతకు చేరనుంది. సీఎం కేసీఆర్ వాటిని ఆమోదిస్తూ సంతకం చేస్తే సర్వీస్‌రూల్స్ అమల్లోకి వస్తాయి. ఈ ప్రక్రియను వేగంగా నిర్వహిస్తేనే వచ్చేనెలలో టీచర్ల ప్రమోషన్లకు అవకాశముందని లేకుంటే వేసవిలోనే పదోన్నతులు ఉంటాయని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

# ఏ ఒక్కరినీ వదలం

- జయరాం హత్యపై హైదరాబాద్ సీపీ
- హత్య వెనక శిఖా చౌదరి హస్తం ఉందన్న జయరాం భార్య పద్మశ్రీ

**హైదరాబాద్, వెలుగు:**

కోస్టల్ బ్యాంకు ఎండీ చిగురుపాటి జయరాం హత్య కేసు కీలక మలుపులు తిరుగుతోంది. తన భర్త హత్యతో శిఖా చౌదరికి సంబంధముందని జయరాం భార్య పద్మశ్రీ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏపీ పోలీసులు స్పెషల్ మెసెంజర్ ద్వారా కేసును హైదరాబాద్ పోలీసులకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గురువారం కేసుకు సంబంధించి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ మాట్లాడారు. ఏపీ కృష్ణా జిల్లా నందిగామ పోలీసుల దర్యాప్తు కాపీలు, పద్మశ్రీ ఫిర్యాదును పరిశీలించి మళ్లీ కేసు నమోదు చేస్తామన్నారు. కేసు దర్యాప్తును బంజారా హిల్స్ ఏసీపీకి అప్పగించామన్నారు. హత్యతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తామని, ఎవరినీ వదలబోమని అన్నారు. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీ మల్లారెడ్డితో పాటు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును విచారించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. జయరాం హత్యలో ఆయన మేన కోడలు శిఖా చౌదరి హస్తముందని, కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలని పద్మశ్రీ కోరారు. ఆమె గురువారం తన ఇంట్లో మీడియాతో మాట్లాడారు. ఎన్ఆర్ఐ అయిన తన భర్తకు రాకేశ్‌రెడ్డి దగ్గర అప్పు చేసే అవసరం లేదన్నారు. జూబ్లీహిల్స్‌లోని తమ ఇంట్లో శిఖా చౌదరితో పాటు ఆమె చెల్లి, తల్లి ఉండేవారన్నారు. 2014లో ఇండియాకు వచ్చిన తమకు శిఖా చౌదరి ప్రవర్తనపై అనుమానం వచ్చిందన్నారు. అందరం కలిసి ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లినప్పుడు ఆ అనుమానం మరింత బలపడిందన్నారు. ఎంతో పేదరికంలో ఉన్న శిఖా చౌదరి కుటుంబాన్ని తాము ఆదుకున్నామని, ఖరీదైన కార్లలో తిరిగే స్తోమత ఆమెకు లేనే లేదని అన్నారు. ఎక్స్‌ప్రెస్ టీవీ వైస్ చైర్మన్‌గా నియమించినప్పుడే జయరాంతో ఆమెకు గొడవ లొచ్చాయన్నారు. జయరాం చనిపోయాక శిఖా తమ ఇంట్లోకి చొరబడి షేర్ డాక్యుమెంట్లతో పాటు విలువైన పత్రాలన్నీ ఎత్తుకెళ్లిందని, ఆ హత్యతో ఆమెకు సంబంధం ఉందని పద్మశ్రీ ఆరోపించారు.

# దళిత స్కాలర్ తేల్‌తుంబ్డేకి 600 మంది మేధావుల మద్దతు

- దాడులు ఆపాలంటూ ఇండియన్ సివిల్ వాచ్ డిమాండ్



**వాషింగ్టన్:** దళిత మేధావి ఆనంద్ తేల్‌తుంబ్డే కు అమెరికా, యూరప్ విశ్వవిద్యాలయాలకు చెందిన 600 మంది మేధావులు మద్దతు ప్రకటించారు. " 2018 ఆగస్టు 28న మహారాష్ట్ర పోలీసులు తేల్‌తుంబ్డే ఇంట్లో అక్రమంగా సోదాలు చేశారు. ఆయనను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాం. తప్పుడు ఆరోపణలతో ఆయనపై దాడులను వెంటనే ఆపాలని భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని ఇండియన్ సివిల్ వాచ్ (ఐసీడబ్ల్యూ) పేరుతో ప్రకటన విడుదల చేశారు. ఐసీడబ్ల్యూలో ప్రిన్స్ టన్, హార్వర్డ్, యాలె, ఆక్స్ ఫర్డ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ తోపాటు పలు వర్సిటీల మేధావులు సభ్యులుగా ఉన్నారు. " తేల్‌తుంబ్డేపై మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిరాధార ఆరోపణలతో చర్యలకు దిగాయి. పౌరుల హక్కులను కాలరాసే యూఏపీఏ (అన్ లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) కింద అరెస్టు చేసి ఆయనపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఇది ప్రజాస్వామ్యం, పౌరహక్కులపై దాడి. వెంటనే దీన్ని ఆపాలి" అని ప్రకటనలో పేర్కొన్నారు. సంయుక్త ప్రకటనపై 600 మంది మేధావులు సంతకాలు చేసినట్టు ఐసీడబ్ల్యూ అధికార ప్రతినిధి రాజాస్వామి అన్నారు.






ఢిల్లీలో గురువారం విద్యార్థి సంఘాలు, యూత్ గ్రూప్‌ల ప్రదర్శన, నిరసనకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న స్వరాజ్ ఇండియా ప్రెసిడెంట్ యోగేంద్ర యాదవ్

# మోడీజీ! మాటలొద్దు, ఉద్యోగాలివ్వండి

- యంగ్ ఇండియా అధికార్ మార్చ్

**న్యూఢిల్లీ:** దేశంలోని యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని గురువారం 'యంగ్ఇండియా' డిమాండ్‌చేసింది. యువతకు కావాల్సింది ఉద్యోగాలు తప్ప మాటలు కాదని స్పష్టంచేసింది. దేశంలోని 50కి పైగా వర్సిటీల విద్యార్థి సంఘాలు, యూత్‌గ్రూపులు కలిసి నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నాయి. ఈ కమిటీ సూచన మేరకు వేలాదిగా విద్యార్థులు, నిరుద్యోగులు ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేశారు. యంగ్ ఇండియా అధికార్‌మార్చ్‌పేరుతో ఎర్రకోట నుంచి పార్లమెంట్ దా కా ర్యాలీ తీశారు. దీనికి డీఎంకే ఎంపీ కనిమొళి, జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేత కన్నయ్య కుమార్, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్‌మేవాని హాజరయ్యారు.



ప్రసంగిస్తున్న గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్‌మేవాని

# స్వైన్‌ఫ్లూతో సెంటర్ షేక్

రాష్ట్రాలకు ప్రత్యేక బృందాల తరలింపు | రోజువారీగా వీడియో కాన్ఫరెన్స్ | ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు | కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి వెల్లడి

**న్యూఢిల్లీ, హైదరాబాద్, వెలుగు:**

దేశంలో స్వైన్‌ఫ్లూ మరణాల సంఖ్య పెరిగిపోతుండడంతో కేంద్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. పదకొండు రాష్ట్రాలకు ప్రత్యేక వైద్యాధికారులను పంపించింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న స్వైన్‌ఫ్లూ నివారణ చర్యల్లో వేగం పెంచేందుకు వీరు సాయపడతారని చెప్పింది. స్వైన్‌ఫ్లూ మరణాలు ఎక్కువగా నమోదైన రాజస్థాన్, గుజరాత్, పంజాబ్ లలో వ్యాధి తీవ్రతను, ఇతర పరిస్థితులను అంచనా వేసి కేంద్రానికి నివేదిక పంపిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. గుజరాత్, పంజాబ్‌రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలను పంపించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రీతి సుదాన్‌చెప్పారు. దీంతోపాటు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించామన్నారు. ఇన్ ఫ్లూయెంజా వ్యాక్సినేషన్‌కు సంబంధించిన గైడ్‌లైన్స్‌తో పాటు తయారీదారుల వివరాలను అన్ని రాష్ట్రాలకు పంపించినట్లు చెప్పారు. వ్యాధి నిరోధక చర్యల వివరాలనూ రాష్ట్రాలతో పంచుకున్నట్లు వివరించారు. ఈమేరకు గురువారం ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో స్వైన్‌ఫ్లూపై పోరాటంలో రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలను సుదాన్ పరిశీలించారు.






**పదకొండు రాష్ట్రాల్లో బాధితులు**

ప్రధానంగా పదకొండు రాష్ట్రాల్లో స్వైన్‌ఫ్లూ బాధితులను గుర్తించినట్లు ప్రీతి చెప్పారు. రాజస్థాన్, గుజరాత్, పంజాబ్‌లలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. తెలంగాణలో ఇద్దరు చనిపోయారని చెప్పారు. స్వైన్‌ఫ్లూతో మరణించిన వారిలో ఎక్కువగా డయాబెటిస్, హైపర్‌టెన్షన్‌బాధితులే ఉన్నారని ఆరోగ్యశాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా రోజువారీగా ఆయా రాష్ట్రాలతో వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించనున్నట్లు తెలిపింది. ఐడీఎస్ పీ, ఐసీఎంఆర్‌ఆధ్వర్యంలోని 53 లేబరేటరీలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని పేర్కొంది. చికిత్సలో ఉపయోగించే ఒసెల్టామివిర్ మందును ప్రజారోగ్య వ్యవస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపింది. వారంలో 1176 మంది జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 మధ్య వారం వ్యవధిలో ఈ 4 రాష్ట్రాల్లో 2101 మందిని పరీక్షించగా.. 1176 మంది స్వైన్‌ఫ్లూ బారిన పడ్డారని తేలింది.

| | |
|---|---|
| స్వైన్‌ఫ్లూతో ఈ ఏడాది చనిపోయిన వారి సంఖ్య (దేశవ్యాప్తంగా) | 226 |
| వ్యాధి బాధితులు | 6886 |
| హెచ్1ఎన్1తో మరణించిన వారు | 31 |

| రాష్ట్రం | మరణాల సంఖ్య | బాధితులు |
|---|---|---|
| రాజస్థాన్ | 85 | 2263 |
| గుజరాత్ | 43 | 898 |
| పంజాబ్ | 30 | 250 |

**బాధితుల్లో మరణాల రేటు 1%**

స్వైన్‌ఫ్లూ బాధితుల్లో మరణాల రేటు ఒక్క శాతమేనని, ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఇండియాలో మరణాలరేటు తక్కువేనని నిపుణులు చెబుతున్నారు. సమయానికి తగిన చికిత్స అందకపోవడం, బాధితుల రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్లే మరణాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు.

### స్వైన్‌ఫ్లూ సోకేదిలా..

స్వైన్‌ఫ్లూ వ్యాప్తికి రెండు రకాల కారణాలు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. ఇన్ ఫ్లూయెంజా(ఏ) హెచ్1ఎన్1, హెచ్3, ఎన్2 లేదా ఇన్ ఫ్లూయెంజా(బీ) వల్ల స్వైన్‌ఫ్లూ సోకుతుందన్నారు. సాధారణ ఆరోగ్యవంతులకు ఈ వైరస్‌తో ముప్పు తక్కువేనని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి సోకడం వల్ల వైరస్‌విజృంభిస్తుందని చెప్పారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం కూడా వైరస్‌విజృంభించేందుకు కారణమైందని నిపుణులు చెప్పారు.

### జాగ్రత్తగా ఉండాలె

వాతావరణం చల్లగా ఉంటే, స్వైన్ ఫ్లూ వైరస్ ఎక్కువ సేపు బతికి ఉంటుంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశాలు ఎక్కువ. కాబట్టి బయటకు వెళ్లేవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వైరస్‌ను అడ్డుకునే మాస్క్‌లను ముఖానికి పెట్టుకుంటే కొంతవరకు దీన్ని నివారించవచ్చు. జ్వరం రావడంతోపాటు గొంతునొప్పి, ఒళ్లునొప్పులు, దగ్గు కూడా ఉంటే వెంటనే డాక్టర్‌ను కలవాలి.

**- డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, కరీంనగర్**

# పొలిటికల్ యాడ్స్‌కు ఎఫ్‌బీ కొత్త రూల్స్


**న్యూఢిల్లీ:** లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖ సోషల్‌మీడియా సంస్థ ఫేస్ బుక్ గురువారం కీలక ప్రకటన చేసింది. దేశంలో రాజకీయ ప్రకటనలకు సంబంధించి కొత్త రూల్స్ తీసుకొచ్చినట్లు తెలిపింది. తమ ప్లాట్ ఫాంపై కనిపించే యాడ్స్ విషయంలో పలు మార్పులు చేసినట్లు వెల్లడించింది. రాజకీయాలకు సంబంధించిన ప్రకటనల్లో 'పబ్లిష్డ్ బై', 'పెయిడ్ ఫర్‌బై' వంటి డిస్ క్లైమర్లను ఇకపై అందరూ చూడొచ్చని చెప్పింది. ప్రకటనదారుల సమాచారం కూడా తెలుసుకోవచ్చని తెలిపింది. తాము 'యాడ్ లైబ్రరీ'పై కూడా పని చేస్తున్నట్లు తెలిపింది. రాజకీయ ప్రకటనలకు సంబంధించిన అన్ని అంశాలను యూజర్లు అందులో పొందవచ్చని వెల్లడించింది. ఓ యాడ్ పై ఎంత ఖర్చు చేశారు, దాన్ని ఎంత మంది చూశారు? వంటి వివరాలను తెలుసుకోవచ్చని చెప్పింది. ఫేస్‌బుక్‌లోకి లాగిన్ కాకుండానే దీని సమాచారం తెలుసుకోవచ్చని చెప్పింది. వచ్చే మార్చి నాటికల్లా ఈ లైబ్రరీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

**ఏడేళ్లు అందుబాటులో..**

డిస్ క్లైమర్ గురించిన సమాచారం లేకుండా న్యూస్ ఫీడ్ లో ఉన్న రాజకీయ ప్రకటనలను యాడ్స్ లైబ్రరీలో ఉంచుతామని ఎఫ్‌బీ తెలిపింది. ''ఫేస్‌బుక్‌లో రన్ అయ్యే ప్రతి రాజకీయ ప్రకటనను మా సిస్టమ్ గుర్తించలేదు. ఎవరైనా గుర్తించి రిపోర్ట్ చేస్తే చర్యలు తీసుకుంటాం. ఏదైనా యాడ్ కు డిస్‌క్లైమర్ సమాచారం ఉండాలని యూజర్లు భావిస్తే.. ప్రకటనకు కుడి వైపున పై భాగంలో మూడు చుక్కలు ఉంటాయి. అక్కడ క్లిక్ చేసి, 'రిపోర్ట్ యాడ్' అని సెలెక్ట్ చేస్తే చాలు. దాన్ని మేం పరీక్షిస్తాం. తర్వాత అది పొలిటిక్స్ కు సంబంధించిన యాడ్ అని తేలితే, వెంటనే అక్కడి నుంచి తొలగించి, లైబ్రరీలో భద్రపరుస్తాం. ఏడేళ్ల వరకు ఎవరైనా దానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు'' అని ఎఫ్‌బీ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ (ఇండియా) శివ్‌నాథ్ ఠుక్రాల్, ప్రొడక్ట్ మేనేజర్ సారా స్కీఫ్‌తెలిపారు.

**పేజీల సమాచారమూ..**

పొలిటికల్ యాడ్స్ ను రన్‌చేస్తున్న పేజీలకు సంబంధించిన సమాచారాన్ని యూజర్లకు అందుబాటులో ఉంచాలని ఫేస్‌బుక్ ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం పొలిటికల్ యాడ్స్ ను నిర్వహిస్తున్న, లేదా ఆ యాడ్స్ కు డబ్బు చెల్లిస్తున్న సంస్థల లొకేషన్‌ను యూజర్లు చూసే వెసులుబాటును అందుబాటులోకి తెచ్చింది. 'ఇన్ఫో, యాడ్స్' సెక్షన్లో ఈ సమాచారం దొరుకుతుందని చెప్పింది. ఇండియాలో నకిలీ అకౌంట్ ద్వారా పేజీ నిర్వహించకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఫేస్ బుక్ చెప్పింది. ఎఫ్ బీలో పేజీలు నిర్వహించే ప్రతి ఒక్కరూ తమ అకౌంట్ ను సెక్యూర్ చేసుకోవాలని స్పష్టం చేసింది. తమ పేజీల్లో పోస్టులు కొనసాగించేందుకు, వారి ప్రైమరీ కంట్రీ లొకేషన్‌ను నిర్ధారించాలని సూచించింది. అమెరికా, బ్రిటన్, బ్రెజిల్ తర్వాత ఫేస్ బుక్ పారదర్శకత నియమాలు తీసుకొస్తున్నది ఇండియాలోనే. ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది యూజర్ల డేటాను ఫేస్‌బుక్ విక్రయించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం పనిచేసిన కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థకు దాదాపు 5 కోట్ల మంది ఖాతాల సమాచారం అందించిందన్న ఆరోపణలు ఉన్నాయి.




- నకిలీ అకౌంట్లతో పేజీలు నిర్వహించకుండా చెక్
- రాజకీయ ప్రకటనలను భద్రపరిచేందుకు లైబ్రరీ
- ఏడేళ్లపాటు అందుబాటులో యాడ్స్ డేటా
- లాగిన్ కాకుండానే చూడొచ్చు

"ఎన్నికల ఇంటెగ్రిటీని కాపాడటమే ఫేస్‌బుక్ తొలి ప్రాధాన్యం. రాజకీయ ప్రకటనలు, పేజీల విషయంలో మరింత పారదర్శకత తీసుకురావడం ద్వారా దీన్ని సాధిస్తాం. ప్రకటనదారుల్లో మరింత జవాబుదారీతనం తీసుకొస్తామని ఆశిస్తున్నాం"

**- శివ్ నాథ్ ఠుక్రాల్,** పబ్లిక్ పాలసీ డైరెక్టర్

# కొత్త ఓటర్లకు మస్తు క్లారిటీ

**న్యూఢిల్లీ :**


మాయమాటలకు ఈజీగా పడిపోమంటున్నరు. పాలిటిక్స్‌పై మస్తు క్లారిటీ పెంచుకున్నరు. పొలిటీషియన్స్‌ని అణువణువూ చదివేస్తున్నరు. ఎవరికి, ఎందుకు ఓటేయాలో ఇప్పటికే డిసైడైన్రు. అవును. ఈ దఫా సార్వత్రిక ఎన్నికలు ఇండియాకి చాలా స్పెషల్ . ఎందుకంటే దేశం ఫేట్‌ని డిసైడ్ చేయబోయేది ఫస్ట్ టైమ్ ఓటర్లే మరి. 2019 లోక్‌సభ ఎలక్షన్స్‌లో ఓటేయబోతున్న 90కోట్ల మందిలో కొత్త ఓటర్ల సంఖ్య 13 కోట్లు. అంటే, జనాభాలో 10 శాతం అన్నమాట. కుల, మత, ప్రాంతీయ సమీకరణలకు దీటుగా ప్రభావం చూపనున్న ఈ 'నయా' సెక్షన్ ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లదే ఢిల్లీ పీఠం. డిసైండింగ్ ఫ్యాక్టర్స్‌గా ఫస్ట్‌టైమ్ ఓటర్ల డిమాండ్స్ ఏమిటో సర్వేలో వెల్లడైంది. అభిప్రాయం చెప్పినవాళ్లలో 72 శాతం మందికి ఉద్యోగమే తొలి ప్రాధాన్యం. క్వాలిటీ ఎడ్యుకేషన్, విమెన్ సేఫ్టీ, కరప్షన్ ఫ్రీ కంట్రీ తదితర అంశాలు తర్వాతి ప్రియారిటీలు. ప్రఖ్యాత రీసెర్చ్, డేటా అనలిటిక్స్ సంస్థ యువర్ గవర్నమెంట్ (యూ గవ్), ఫస్ట్‌పోస్ట్ అనే న్యూస్‌వెబ్ సైట్‌తో కలిసి నిర్వహించిన సర్వేలో ఇలాంటి ఆసక్తికర విషయాలెన్నో వెల్లడయ్యాయి.

'మూడ్ ఆఫ్ ఫస్ట్ టైమ్ ఓటర్' పేరుతో విడుదలైన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా మొత్తం 40వేల శాంపిల్స్ సేకరించారు. 18 నుంచి 21 ఏండ్ల మధ్య వయసున్నవాళ్లను మాత్రమే అభిప్రాయాలు అడిగారు. 2019 జనవరి 3 నుంచి 9 వరకు ఆన్‌లైన్‌లో ప్రశ్నోత్తరాలు సాగాయి. ఒపీనియన్స్ వెల్లడించిన యువతరం నివసించే ప్రదేశాన్ని బట్టి వాళ్లను మూడు కేటగిరీలుగా విభజించారు. అవి టైర్ 1 సిటీలు (లక్ష మంది కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు), టైర్ 2 సిటీ (50 వేలు- లక్షలోపు జనాభా), టైర్ 3 సిటీ(జనాభా 20 వేల నుంచి 50 వేల లోపు ఉన్న పట్టణాలు). ఇక యువతరం చెప్పిన సమాధానాలను బట్టి సర్వే ఫలితాలను కూడా నాలుగు సెక్షన్లుగా నిర్వాహకులు విడుదల చేశారు. అవి 1. రాజకీయాలు, సిద్ధాంతాలు, 2. ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ, 3.కులం, మతం, 4. వార్తలు, సమాచారం. పెద్ద నగరాతో పోల్చుకుంటే తక్కువ జనాభా ఉన్న టైర్ 3 సిటీల్లోని యువతే రాజకీయాల పట్ల అమితాసక్తిని చూపించడం విశేషం. అయితే పెద్ద నగరాల్లోని వాళ్లలో చాలా మంది రాజకీయాలను కొత్త కోణంలో చూస్తుంటే, చిన్న పట్టణాల్లోని యూత్‌లో ఎక్కువ శాతం మంది పాత మైండ్ సెట్ తోనే ఆలోచిస్తున్నారని సర్వే చెబుతోంది. లిబరల్ ఆలోచనలున్నవాళ్లు టైర్ 1 సిటీల్లో 23 శాతం మందైతే, టైర్ 2 సిటీల్లో 22 శాతం. టైర్ 3ల్లో పాలిటిక్స్‌ను ఓపెన్‌మైండ్‌తో చూసేవాళ్లు 14 శాతం మంది మాత్రమే. మిగతా డిమాండ్ల ప్రియారిటీల్లో తేడాలున్నా ఉద్యోగాలు కావాలనే ఆకాంక్ష మూడు ప్రాంతాల్లోనూ బలంగా వ్యక్తమైంది. టైర్ 1 సిటీల్లో 71 శాతం మంది ఉద్యోగావకాశానికి మొదటి ప్రాధాన్యమిచ్చారు. ఇది టైర్ 2లో 71 శాతంగా(సెకండ్ ప్రియారిటీ), టైర్ 3ల్లో 61 శాతం(సెకండ్ ప్రియారిటీ)గా ఉంది. టైర్ 2 సిటీల్లో మహిళల రక్షణే ఫస్ట్ ప్రియారిటీ అని 71 శాతం మంది చెప్పారు.


- ఈసారి 13 కోట్ల మంది నయా ఓటర్లు
- 72 శాతం మందికి ఉద్యోగమే తొలి ప్రాధాన్యం
- అర్బన్, రూరల్ యూత్ ఆలోచనల్లో చాలా తేడా
- యూ గవ్– ఫస్ట్‌పోస్ట్ సర్వేలో ఆసక్తికర ఫలితాలు



## ఓటేయడానికి ప్రేరేపించే పాయింటేంటి?




## కొత్త ఓటర్లను ప్రభావితం చేసేవేంటి?




### ఓటేయడానికి విచిత్ర కారణాలు!

అసలు ఓటెందుకు వేయాలనుకుంటున్నారన్న ప్రశ్నకు నయా ఓటర్లు చెప్పిన సమాధానాలు మిలీనియల్ల మైండ్‌సెట్‌కు అద్దంపట్టేలా ఉన్నాయనొచ్చు. సర్వేలో పాల్గొన్నవాళ్లలో 32 శాతం మంది ఫస్ట్ టైమ్ ఎక్సైట్‌మెంట్ కోసం ఓటేస్తామన్నారు. 24 శాతం మందేమో ఓటును 'అడల్టరీకి అర్హత'గా భావిస్తున్నామన్నారు. వ్యవస్థలో మార్పు కోసమే ఓటు వేస్తామంటున్న వాళ్లు 19 శాతమైతే, ఉన్న వ్యవస్థను కాపాడుకోడానికి మీట నొక్కుతామన్నదీ 19 శాతం మందే. దోస్తులు వెళతారు కాబట్టి కూడా వెళ్లి ఓటేస్తానని 3 శాతం మంది చెబితే, అసలు కారణాలేవీ లేకుండా బటన్ నొక్కుతామన్నవాళ్లు 3 శాతం మంది ఉన్నారు. టైర్ 2 సిటీల్లో 52 శాతం మంది ఖచ్చితంగా ఓటేస్తామని చెప్పారు.

### ఓటు వేయకపోవడానికీ అంతే!

లిస్టులో పేరు లేదు కాబట్టే ఓటు వేయలేకపోతున్నామని 26 శాతం మంది చెప్పారు. ఎన్నికలు సజావుగా జరగడంలేదని 14 శాతం మంది ఫిర్యాదుచేస్తున్నారు. పార్టీలు, క్యాండేట్లు నచ్చని కారణంగా దూరంగా ఉంటోన్నవాళ్లు 13 శాతం. రాజకీయాల పట్ల ఆసక్తిలేదంటున్నవాళ్లు 9 శాతమైతే, అసలీ రాజకీయాలు ఎంతకీ అర్థంకావడంలేదని తలపట్టుకుంటోన్న యువత 8 శాతం. ఇక, 'నేనొక్కణ్ని ఓటేయకుంటే ఏం ఫరక్ పడదులే' అనుకునేవాళ్లు 6 శాతం మంది ఉన్నారు. ఏదో ఒక అభిప్రాయంతో ఎన్నికలను ప్రభావితం చేయబోతున్నారు కొత్త ఓటర్లు.

## కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



చెన్నూరులో వివేక్ వెంకటస్వామితో సర్పంచులు

- ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల, వెలుగు:** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం ఆయన మంచిర్యాల జిల్లా చెన్నూరు, లక్షెట్ పేటలో పర్యటించారు. టీఆర్ఎస్ మద్దతుపై గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని నూతన ప్రజాప్రతినిధులకు వివేక్ సూచించారు. లక్షెట్ పేట మండలం మిట్టపెల్లి సర్పంచిగా ఎన్నికైన కొడి రాణిశంకర్ దంపతులను సన్మానించారు. అంతకు ముందు ఆయన చెన్నూరు సాయిరాం ఫంక్షన్ హాల్‌లో టీఆర్ఎస్ నాయకుడు బండారి శంకర్ కూతురు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కరుణాసాగర్‌రావు, మద్ది శంకర్, ఫయాజ్, రాజాగౌడ్, హిమవంత్‌రెడ్డి, తనుగుల రవి , తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్మ రాజశేఖర్, వివేక్ యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి దమ్మ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడు




- ఏసీబీకి చిక్కిన వేములవాడ పంచాయతీ రాజ్ డీఈ
- మూడు లక్షల బిల్లు కోసం రూ. 70 వేలు డిమాండ్
- రూ. 60 వేలు తీసుకుంటూ పట్టుబడిన మహేందర్‌రెడ్డి

**వేములవాడ, వెలుగు:** రూ. 60 వేలు లంచం తీసుకుంటూ వేములవాడ పంచాయతీ రాజ్ డీఈ మహేందర్‌రెడ్డి గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. బోయినపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కట్ట కనుకమ్మ భర్త లచ్చయ్య ఈజీఎస్ గ్రాంట్ కింద మంజూరైన రూ. 13 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాడు. పనులు మిగిలి ఉండగా మరో రూ. 3 లక్షలు మంజూరు అయ్యాయి. అయితే ఈ బిల్లు మంజూరు చేయాలని లచ్చయ్య కొన్ని రోజులుగా డీఈ మహేందర్‌రెడ్డి చుట్టూ తిరుగుతున్నాడు. బిల్లు మంజూరు కావాలంటే రూ. 70 వేలు ఇవ్వాలని డీఈ డిమాండ్ చేయడంతో కొద్ది రోజుల క్రితం రూ. 10 వేలు చెల్లించాడు. మిగతా డబ్బులు ఇస్తేనే బిల్లు మంజూరు చేస్తానని చెప్పడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు గురువారం కార్యాలయంలో డబ్బులు తీసుకుంటున్న డీఈని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## నాసా సైన్స్‌ఫేర్‌కు బొల్లారం స్టూడెంట్స్



**పటాన్‌చెరు, వెలుగు:** నాసాలో నిర్వహించబోయే ఇంటర్నేషనల్ సైన్స్‌ఫేర్‌కు జిన్నారం మండలం బొల్లారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. డిసెంబర్ అమెరికాకు చెందిన ఆస్ట్రోనాట్ మెమోరియల్ ఫౌండేషన్, ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బొల్లారం పాఠశాల పదో తరగతి విద్యార్థి వెన్నెల, తొమ్మిదో తరగతి విద్యార్థులు మీనాక్షి, నవ్య, అనిత, లావణ్య, గౌతమి, ఫణిదర్‌లు ప్రతిభ చూపారు. మే నెలలో విద్యార్థులకు నాసా పర్యటన ఉంటుందని ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు తెలిపారు. నాసా సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన విద్యార్థులను గురువారం హెచ్ఎం ప్రతిభా రాణి, ఉపాధ్యాయులు అభినందించారు.



# మట్టి కట్టలు.. మస్తు నీళ్లు

- పెరిగిన భూగర్భ జలాలు
- నీటి సంరక్షణలో గూడుగారిపల్లి రైతుల స్ఫూర్తి

**సంగారెడ్డి, వెలుగు**

రైతుల ఒక్క ఆలోచన 14 సంవత్సరాలుగా వారికి నీటి కష్టాలన్నవే లేకుండా చేసింది. 20 ఏళ్ల క్రితం 38 మీటర్ల లోతులో ఉన్న పాతాళగంగ రైతుల కృషితో పైపైకి చేరుకుంది. ఇటీవలి కాలంలో వేసవిలో అన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పని చేయక అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ ఊర్లో మాత్రం 15 అడుగుల లోతులోనే భూగర్భ జలాలు ఉండడం విశేషం. నీటి నిల్వతో కష్టాలను దూరం చేసుకున్న ఆ ఊరే గూడుగారిపల్లి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలంలోని గూడుగారిపల్లి రైతులు వర్షపు నీటిని ఒడిసిపట్టి గ్రౌండ్ వాటర్ పెంచడంలో ప్రత్యేకతను చాటుతున్నారు. వీరి కష్టం భావితరాలకు లాభం చేకూరుస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లోనూ ఇక్కడి రైతులు చక్కగా పంటలు పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ ఊళ్లో పడ్డ ప్రతి చినుకును అక్కడే ఇంకిపోయేలా చేస్తున్నారు. ఊరి పక్కనే ఉన్న పెద్దచెరువు చుట్టుపక్కల 11 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. దీంతో నీటి కష్టం తెలియకుండా గూడుగారిపల్లి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం ఈ గ్రామంలో భూగర్భ జలమట్టం 15 అడుగుల లోతులోనే ఉంది. గ్రౌండ్‌వాటర్ పెంచేందుకు గ్రామానికి చెందిన 30 మంది రైతులు కర్నాటక, మహారాష్ట్రలో శిక్షణ పొందారు. అక్కడ నేర్చుకున్న మెలకువలు ఇక్కడ పాటించి సక్సెస్ అయ్యారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న 400 వ్యవసాయ బోర్లలో నీరు పుష్కలంగా



ఉన్నాయి. ఇక్కడ ప్రధానంగా సోయా, చెరకు, మొక్కజొన్న , ఆలుగడ్డ, అల్లం తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల నీరు లేక పంటలు ఎండుముఖం పడుతుంటే ఇక్కడ మాత్రం పొలాలన్నీ పచ్చగా కనిపిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో నీటిమట్టాలు పరిశీలిస్తే 2014లో 15 అడుగులు, 2015లో 14.5, 2016లో 15, 2017లో 15 అడుగుల లోతులో నీటిమట్టం నమోదైంది. 2018లో వర్షాభావం కారణంగా నీటి మట్టం 18 అడుగుల లోతుకు చేరింది.

### ఐదేళ్లు.. 150 కట్టలు

20 ఏళ్ల క్రితం గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. అప్పట్లో భూగర్భ జలాలు 38.5 మీటర్ల లోతుకు పడిపోయాయి. సమస్య పరిష్కారానికి గ్రామంలో మొత్తం 150 మట్టి కట్టలు కట్టారు. 2000 సంవత్సరంలో మొదలుపెట్టి దశలవారీగా ఐదేళ్లపాటు వీటిని నిర్మించారు. ఒక్కో మట్టికట్ట 50 మీటర్ల పొడవు, 10 మీటర్ల లోతులో ఉండేలా గుంతలు తీసి వర్షం నీటిని నిల్వ చేశారు. ఆ నీటిని భూమిలోకి ఇంకించారు.

వర్షాలు పడని సమయంలో బోర్ల సహాయంతో పంటలు పండించేవారు. వారి కృషి ఫలించి ప్రస్తుతం 5 మీటర్ల లోతులోనే నీరు లభిస్తోంది. ఇక్కడ చేపట్టిన భూగర్భ జలాల పెంపు ప్రక్రియను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది వచ్చివెళ్లారు. ఇక్కడి రైతులను మెచ్చుకున్నారు. గూడుగారిపల్లి పక్కనే పెద్దవాగు ప్రాజెక్టు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ పెద్దచెరువు కింద 11 వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. కుడికాలువ 6 కి.మీ. , ఎడమ కాలువ 7 కి.మీ. పొడవున మొత్తం 8 గ్రామాలకు సాగునీరు అందుతోంది. ఈ చెరువు అలుగు నుంచి 8 గ్రామాలకు కాలువలు తీయడంలోనూ గ్రామస్తులు కలిసికట్టుగా కష్టపడ్డారు. వర్షాలు లేక ప్రస్తుతం చెరువు డెడ్ స్టోరేజీకి చేరింది. అయినప్పటికీ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండిస్తున్నారు. అయితే ఆనాటి మట్టికట్టల్లో నేడు పూడిక పేరుకుపోయింది. ఇప్పుడు మరమ్మతులు చేస్తే మరో పదిహేనేళ్ల వరకు భూగర్భ జలాలకు డోకా ఉండదని రైతులు అంటున్నారు.



### పూడిక తీయాలి

ఇప్పుడు మళ్లీ ఆ గుంతల్లో పూడిక తీస్తే మరో 15 ఏళ్లు గ్రౌండ్ వాటర్‌కు డోకా ఉండదు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్నాం. నిధులు ఇస్తే పని చేసేందుకు గ్రామస్తులు ముందుకు వస్తారు. వ్యవసాయం చేసేందుకు యువకులు కూడా ఆసక్తిగా ఉన్నారు.

**- ఎల్లారెడ్డి, ఆయకట్టు చైర్మన్**

### వర్షా కాలంలోపు పనులు

వచ్చే వర్షా కాలంలోపు పేరుకుపోయిన మట్టి తీయించి కట్టలు కట్టిస్తాం. గ్రామస్తుల కృషిని ఇతర రాష్ట్రాల రైతు ప్రతినిధులు అభినందించారు. పెద్ద చెరువు ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ. రెండు కోట్లు మంజూరయ్యాయి. త్వరలో వాటి పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందిస్తాం. ఒకవైపు మట్టికట్టలు, మరో వైపు పెద్ద చెరువు మరమ్మతులు చేపట్టి 11 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తాం.

**- ఉదయ్‌భాస్కర్, డిప్యూటీ ఈఈ**



### రెండేళ్ల వరకు పర్వాలేదు

పదిహేను ఏళ్ల క్రితం చేసిన మట్టికట్టలు చెదిరిపోయినా భూమిలో అప్పట్లో ఇంకిన నీళ్లు ఇప్పటికీ మంచిగున్నయి. ఇంకా రెండేళ్ల వరకు వ్యవసాయానికి ఇబ్బంది లేదు. కాని వానలొచ్చే వరకు మళ్లీ గుంతలు తీస్తే పదిహేను ఏళ్లు పంటలు బాగా పండుతాయి.

**- అనసూయమ్మ, సర్పంచ్**

## ఎన్‌హెచ్ 167కు టెండర్లు పూర్తి

- ఎంపీ జితేందర్ రెడ్డి

**మహబూబ్‌నగర్, వెలుగు :** జడ్చర్ల నుంచి మహబూబ్ నగర్ వరకు జాతీయ రోడ్డు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని ఎంపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోదాడ నుంచి రాయచూర్‌కు నిర్మాణమవుతున్న 167వ జాతీయ రహదారిలో జడ్చర్ల మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డుకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లను రెండు రోజుల్లో ఖరారు చేసి, నిర్మాణ పనులు స్టార్ట్ చేస్తామన్నారు. అయితే జాతీయ రహదారి నాణ్యతగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పనుల్లో కాంట్రాక్టర్ జాప్యం చేస్తే జాతీయ రహదారుల సంస్థ అధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా 50 మీటర్ల చొప్పున విస్తరణ జరుగుతుందని ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. రైల్వే డబ్లింగ్ ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తయిందని దివిటిపల్లి గ్రామం వద్ద కొంతమంది భూ నష్టపరిహారం కింద కేసు వేయడంతో పనుల్లో కొంత లేట్ అవుతోందన్నారు. 50 ఏళ్లుగా డబ్లింగ్ కోసం నిరీక్షిస్తున్న పాలమూరు ప్రజల కల సాకారమయ్యే దిశలో అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ దేవర మల్లప్ప,నాయకుడుసురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## చనిపోయిందని ఇంట్లోకి రానివ్వలే

- కిరాయిదారులకు తప్పని కష్టాలు

**యాదాద్రి, వెలుగు:** అద్దె ఇంట్లో శవాన్ని ఉంచడానికి యజమాని ఒప్పుకోకపోవడంతో చెట్టు కింద పెట్టి అంత్యక్రియలు జరిపించిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. భువనగిరికి చెందిన కనికరం శంకరయ్య, గంగమ్మ(70) దంపతులకు ఒక్కతే కూతురు. వీరిది మేదరి వృత్తి. చాటలు, వెదురు తడకలు తయారు చేసి జీవనం సాగించేవారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. అద్దె ఇంట్లో ఉండేవారు. కూతురు ఉమను భువనగిరికి చెందిన నరేందర్‌కు ఇచ్చి 28 ఏళ్ల క్రితం పెళ్లి చేశారు. శంకరయ్య 1995లో చనిపోవడంతో అప్పటి నుంచి గంగమ్మ కూతురు, అల్లుడి వద్దే తాతానగర్‌లో వారుండే అద్దె ఇంట్లోనే ఉంటోంది. బుధవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో గంగమ్మ వృద్ధాప్యంతో చనిపోయింది. ఓనర్ ఇంట్లో శవాన్ని ఉంచేందుకు ససేమిరా అన్నాడు. దీంతో భువనగిరిలోని జగదేవ్‌పూర్ రోడ్డు పక్కన వేపచెట్టు కింద చిన్న టెంటు వేసి గంగమ్మ శవాన్ని ఉంచి అంత్యక్రియలు జరిపించారు. గంగమ్మ దీన స్థితిని చూసిన వారంతా అయ్యో అంటూ ఆవేదన వెలిబుచ్చారు.

## ఓటు పవిత్రతను కాపాడుకోవాలి

**భద్రాచలం, వెలుగు:** ప్రతి వ్యక్తి ఓటు విలువ తెలుసుకుని, దాని పవిత్రతను కాపాడాలని ఉత్తరప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎల్. వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకుముందు ఆయన సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు వరివట్టం కట్టి ఆలయంలోకి స్వాగతం పలికారు. గర్భగుడిలో పూజలు చేసిన అనంతరం ఆయన ఆశీర్వచనం చేశారు.

## కొత్తగూడెంలో భూ ప్రకంపనలు

**భద్రాద్రికొత్తగూడెం, వెలుగు:** భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో గురువారం రాత్రి స్వల్ప భూప్రకంపనలు రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఇల్లెందు, టేకులపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో రాత్రి 11.15 గంటల నుంచి 11.23 గంటల మధ్య కొన్ని సెకన్ల పాటు భూమి కంపించినట్లు పలువురు తెలిపారు.

## నేటి నుంచి భద్రాద్రిలో వాగ్గేయకారోత్సవాలు



- చిత్రకూట మండపంలో ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఐదు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు
- దేశం నలుమూలల నుంచి రానున్న కళాకారులు

**భద్రాచలం, వెలుగు:** భక్తరామదాజు జయంతిని పురస్కరించుకుని భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి వాగ్గేయకారోత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి సంగీత కళాకారులు తరలిరానున్నారు. 1972లో మొదటగా స్థానిక రంగనాయకుల గుట్టపై ఉన్న రామదాసు ధ్యానమందిరంలో వాగ్గేయకారోత్సవాలను ప్రారంభించారు. ఈ మందిరం గుట్టపై ఉండటం, ప్రేక్షకులు రాలేకపోవడంతో ఉత్సవాలను చిత్రకూట మండపానికి మార్చారు. ఉత్సవాల కోసం వాగ్గేయకారులు ఇప్పటికే భద్రాచలానికి చేరుకున్నారు. వాగ్గేయకారోత్సవాల ప్రారంభం రోజున దేశం నలుమూలల నుంచి వచ్చిన సంగీత కళాకారులు సంగీత గోష్ఠి నిర్వహించి నవరత్న కీర్తనలను ఆలపించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల కోసం అధికారులు మండపాన్ని ముస్తాబు చేశారు.

# వసంతోత్సవాలకు ముస్తాబు



- నేటి నుంచి వసంత పంచమి
- ఏటా ఒక్క రోజే.. ఈ సారి మూడు రోజులు
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు

**బాసర, వెలుగు :**

చదువుల తల్లి సరస్వతి అమ్మవారికి ఏటా మాఘ మాసం ఐదో రోజున వసంత పంచమి (శ్రీ పంచమి) వేడుకలు బాసర క్షేత్రంలో వైభవంగా జరుగుతాయి. ఏటా ఒక్క రోజు మాత్రమే వేడుకలు నిర్వహిస్తుండగా, ఈ సారి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. నేడు, రేపు అమ్మవారికి అభిషేకాలు, ఆదివారం పంచమి వేడుకలు జరగనున్నాయి. పంచమి రోజున పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తే చదువులో బాగా రాణిస్తారని, అమ్మవారిని దర్శనం చేసుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. అమ్మవారి జన్మదినోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 10న జరిగే వేడుకలకు బాసరలోని అమ్మవారి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

**నేటి నుంచే ఉత్సవాలు**

ఈ రోజు ఉదయం 4 గంటలకు అమ్మవారికి నిత్యాభిషేకంతో ఉత్సవాలు మొదలవుతాయి. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. ఉత్సవాల్లో అమ్మవారికి వేకువజామున మంగళ వాయిద్యాల సేవ, సుప్రభాత సేవ, మహాభిషేకం, అలంకరణ నివేదన, మంత్రపుష్పం తదితర పూజలు చేపట్టనున్నారు. నేడు, రేపు అమ్మవారికి ఉదయం 4 గంటలకు అభిషేకం నిర్వహించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆదివారం ఉదయం 2 గంటలకే అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారికి ఉదయం 9 గంటలకు పట్టువస్త్రాల సమర్పణ, 11 గంటలకు చండీ హవనము, మహా విద్య, ఆశీర్వచనము వంటి పూజలు జరిపి, వేదస్వస్తి పూర్ణాహుతితో ఆలయ అర్చకులు ఉత్సవాలను ముగిస్తారు.

**పట్టు వస్త్రాలు సమర్పించనున్న ప్రభుత్వం**

ఆదివారం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించనుంది. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వఅధికార ప్రతినిధి సముద్రాల వేణుగోపాలచారి, ముథోల్ ఎమ్మెల్యే గడ్డి వారి విట్టల్ రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. అక్షరాభ్యాసాల నిమిత్తం అధిక సంఖ్యలో భక్తులు రానుండడంతో ఆలయ వసతి గృహాల ఎదుట నుంచి టీటీడీ సత్రం వరకు తాత్కాలిక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అక్షరాభ్యాసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు, చిన్నారులకు పండ్లు, పాలు, బిస్కెట్లు పంపిణీ చేయనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ఆవరణలో పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

# ఆర్టీసీలో ఎన్నికలెప్పుడు?

- పాత యూనియన్ గడువు ముగిసి ఆరు నెలలు
- త్వరగా నిర్వహించాలంటున్న యూనియన్లు

**హైదరాబాద్, వెలుగు:**

ఆర్టీసీలో యూనియన్ ఎలక్షన్లకు మోక్షం కలగడం లేదు. గుర్తింపు సంఘం గడువు ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికల ఊసేలేదు. సంస్థలో రెండేళ్లకోసారి ఎన్నికలు జరుపుతారు. గత ఎన్నికల్లో తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) గెలిచింది. 2018 ఆగస్టు 7తో టీఎంయూ గుర్తింపు ముగిసింది. నవంబర్‌లో ఎలక్షన్లు నిర్వహించాలని అధికారులు భావించారు. లేబర్ జాయింట్ కమిషనర్ గంగాధర్‌ను ఎలక్షన్ ప్రిసైడింగ్ అధికారిగా నియమించారు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలైంది. ఆ వెంటనే పంచాయతీ ఎన్నికలు. దీంతో యూనియన్ ఎలక్షన్లను వాయిదా వేస్తూ వచ్చారు. నిబంధనల ప్రకారం కొత్త యూనియన్ ఎన్నికయ్యే వరకు పాత యూనియనే ఆపద్ధర్మంగా కొనసాగుతుంది. కానీ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదు. ఇప్పటికే పీఆర్సీ అంశం



కొలిక్కిరాలేదని, జీతాలు పెంచలేదని కార్మికులు అంటున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మూడు నాలుగు నెలల వరకు యూనియన్ ఎలక్షన్లు లేనట్టే.

### వీలైనంత త్వరగా నిర్వహించాలి

ఎన్నికలకు ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను కూడా నియమించారు. నిర్వహణకు నాలుగైదు వారాలే పడుతుంది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు వీటిని పూర్తి చేయవచ్చు.

**- కె.హనుమంతు, టీజేఎంయూ**

### త్వరలోనే నిర్వహిస్తం

జిల్లాల్లో రిజిస్టర్ అయిన యూనియన్ల సమాచారం రావాల్సి ఉంది. త్వరలోనే ఆర్టీసీ ఎన్నికలు నిర్వహిస్తాం. దీనికి సంబంధించి ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది.

**- గంగాధర్, ప్రిసైడింగ్ ఆఫీసర్**



# బాబోయ్ మేం నడపలేం

**హైదరాబాద్, వెలుగు:**

రాష్ట్రంలో మరిన్ని ఇంజనీరింగ్ కాలేజీల మూసివేతకు రంగం సిద్ధమవుతోంది. ఐదేళ్ల నుంచి ఏటా కాలేజీల సంఖ్య తగ్గుతూనే ఉంది. ప్రమాణాలు లేకపోవడం, ప్రభుత్వం ఫీజును తక్కువగా నిర్ణయించడం, రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందకపోవడం, సీట్లు నిండకపోతుండటం వంటివి దీనికి కారణమవుతున్నాయి. కాలేజీల నిర్వహణ భారంగా మారుతుండటంతో యాజమాన్యాలే స్వచ్ఛందంగా మూసివేసేందుకు దరఖాస్తు చేసుకుంటున్నాయి. కాలేజీల సంఖ్య తగ్గుతుండటంతో మిగిలే వాటిలో సీట్లకు డిమాండ్ పెరుగుతుందని అంటున్నారు.

**విచ్చలవిడిగా అనుమతులు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్ కాలేజీలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చారు. పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో పుట్టగొడుగుల్లా కాలేజీలు వెలిశాయి. ప్రమాణాలు లేకున్నా అడ్మిషన్లు చేసుకుని, ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2014-15 విద్యాసంవత్సరంలో 17

**రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల లెక్క ఇదీ..**

| ఏడాది | కాలేజీల సంఖ్య |
|---|---|
| 2014-15 | 337 |
| 2015-16 | 249 |
| 2016-17 | 206 |
| 2017-18 | 198 |
| 2018-19 | 188 |

- ఐదేండ్లలో 132 ఇంజనీరింగ్ కాలేజీల మూత
- మూసివేతకు మరో 13 కాలేజీల దరఖాస్తు
- నిర్వహణ భారంతో చేతులెత్తేస్తున్న మేనేజ్‌మెంట్లు
- ప్రమాణాలు లేక ఫీజు తక్కువగా నిర్ధారిస్తున్న సర్కారు

సర్కారు కాలేజీలతో పాటు 337 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు ఉండేవి. వాటిలో వివిధ కోర్సుల్లో కలిపి 96,225 సీట్లు అందుబాటులో ఉండేవి. ఆ ఏడాది 61,909 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. రాష్ట్ర సర్కారు కొత్తగా కాలేజీలకు అనుమతివ్వకపోయినా సీట్ల సంఖ్య పెంపునకు ఓకే చెప్పింది. దాంతో 2015-16 నాటికి సీట్ల సంఖ్య 1,15,912కు చేరగా.. 70,792 మంది అడ్మిషన్లు తీసుకున్నాయి. మిగతా సీట్లు ఖాళీగానే ఉండిపోయాయి.

**నిబంధనలు కఠినం చేయడంతో..**

అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇంజనీరింగ్ కాలేజీలపై టీఆర్ఎస్ దృష్టి సారించింది. అవసరం కంటే ఎక్కువ కాలేజీ లు ఉండటం, ప్రమాణాలు లేకపోవడంతో చర్యలు ప్రారంభించింది. ఉన్నత విద్యామండలి, జేఎన్టీయూతో కలిసి పలుమార్లు తనిఖీలు చేయించింది. అధికారులు కాలేజీల్లో విస్తృతంగా తనిఖీలు చేసి.. లోపాలను గుర్తించారు. ఫ్యాకల్టీ నియామకం, వసతులు వంటివి వెంటనే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. దీంతో కొన్ని కాలేజీలు దిద్దుబాటు చర్యలు ప్రారంభించాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కాలేజీలు చేతులేత్తేయడం మొదలుపెట్టాయి. దాంతో 2018-19 నాటికి ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల సంఖ్య 188కి తగ్గింది. అంటే ఐదేండ్లలో 132 కాలేజీలు మూతపడ్డాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాలేజీలను కొనసాగించలేమని, మూసివేతకు అనుమతించాలని కోరుతూ మరో 13 కాలేజీలు జేఎన్టీయూకు దరఖాస్తు చేసుకున్నాయి.



### నిబంధనలు కఠినం చేశాం

వృత్తి విద్య కాలేజీల నిబంధనలు కఠినతరం చేశాం. స్టేట్‌లో అవసరానికి మించి ఎక్కువ ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. దీంతో ప్రమాణాల పెంపునకు ఫ్యాకల్టీ, నిబంధనల అమలు తదితర వాటిపై తనిఖీలు నిర్వహించాం. ఏఐసీటీఈ నిబంధనలు అమలుకు చర్యలు తీసుకున్నాం. తెలంగాణ వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క ఇంజినీరింగ్ కాలేజీకి కూడా అనుమతివ్వలేదు.

**– తుమ్మల పాపిరెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్**

## జల వనరుల వివరాలకు 'హైడ్రో నెట్‌వర్క్'

**హైదరాబాద్, వెలుగు:** దేశవ్యాప్తంగా ఉన్న రిజర్వాయర్లు, భూగర్భ జలాల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా 'హైడ్రో నెట్‌వర్క్'ను ఏర్పాటు చేయాలని కేంద్ర జల వనరులశాఖ నిర్ణయించింది. రెండ్రోజుల కిందట హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు మూడో దశపై సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర భూగర్భ జల వనరుల శాఖ డైరెక్టర్ పండిట్ మధునూరె గురువారం చెప్పారు. దేశంలోని అన్ని నదీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రో నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసి, నీటి లభ్యత వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, అన్ని రాష్ట్రాల జనవరులశాఖల అధికారులు పాల్గొన్నారన్నారు.

## ఈ నెల 14 నుంచి డీఎల్, జేఎల్ పరీక్షలు

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్ర సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో జూనియర్ లెక్చరర్ల(జేఎల్), డిగ్రీ లెక్చరర్ల(డీఎల్) పోస్టుల భర్తీకి రాత పరీక్షలు ఈ నెల 14నుంచి 20వరకు నిర్వహిస్తామని గురుకులాల చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బోర్డు వెబ్‌సైట్ (treirb.telangana.gov.in)ద్వారా అభ్యర్థులు హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు. పరీక్షకు 24 గంటల ముందే హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ నిలిపివేస్తామని చెప్పారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే 04023317140 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఇఫ్లూలో అడ్మిషన్లు

**హైదరాబాద్, వెలుగు:** ద ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ) రానున్న విద్యా సంవత్సరం201920లో హైదరాబాద్ క్యాంపస్ తోపాటు లక్నో, షిల్లాంగ్ ఇఫ్లూ సెంటర్లలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ, పీజీడీటీఈ, పీజీడీటీఏ, బీఈడీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు మార్చి9,10తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఫిబ్రవరి 26 చివరితేది. జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.500, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.250 ఎంట్రన్స్ ఫీజుగా నిర్ణయించారు. ఆబ్జెక్టివ్ టైపులో 100 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ ఎంట్రన్స్ టెస్ట్ ఉంటుంది. పీహెచ్‌డీకి మాత్రం రాత పరీక్ష 70 మార్కులకు, 30 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 040-27689733/27689647/27689447 లేదా వెబ్‌సైట్ www.efluniversity.ac.in ద్వారా తెలుసుకోవచ్చు.

## జల పరిరక్షణ మనందరి బాధ్యత

- సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ హుస్సేన్

**హైదరాబాద్, వెలుగు:**

ప్రాణాధారమైన నీటిని వృధా చేయొద్దని, జల పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యమని సీడబ్ల్యూసీ చైర్మన్ ఎస్. మసూద్‌హుస్సేన్‌చెప్పారు. నీటి వనరులను కాపాడుకోవడంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గురువారం ఎర్రమంజిల్ కాలనీలోని జలసౌధలో నిర్వహించిన... గురువారం ఎస్సార్ నగర్‌జెన్‌కో ఆడిటోరియంలో ఆయన 'జల పరిరక్షణ మన బాధ్యత' టెక్నికల్ సెమినార్‌ను ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ తరహాలో జల పరిరక్షణ కోసం ఉద్యమించాలని, నీటిని రీసైకిల్ చేయాలని అన్నారు. ప్రపంచంలో 18 శాతం జనాభా ఉన్న ఇండియాలో నీటి వనరులు కేవలం 4 శాతమే ఉన్నాయని చెప్పారు. నదీజలాల వినియోగంతో దేశ ఆర్థిక ప్రగతి ముడిపడి ఉందని, రాష్ట్రాలు జల పరిరక్షణకు ప్రయత్నించాలని సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే డ్రిప్ ఇరిగేషన్ లాంటి సాగు పద్ధతులను ప్రోత్సహించాలని కోరారు. కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్(కేజీబీవో) చీఫ్ ఇంజినీర్ డి.రంగారెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరానికి కిలో లీటర్ నీటిని తరలించడానికి కిలో వాట్ విద్యుత్ వినియోగమవుతుందని తెలిపారు. నగరానికి 300 కి.మీ.ల దూరంలోని ఎల్లంపల్లి నుంచి 500 మీటర్ల ఎత్తుకు నీటిని పంపింగ్ చేస్తుంటే, 200 కి.మీ. దూరం నుంచి కృష్ణా జలాలను వెయ్యి మీటర్ల ఎత్తుకు పంపింగ్ చేయాల్సి వస్తోందని అన్నారు. ఈ లెక్కన ఆ నీరు ఎంత విలువైనదో గుర్తించాలని కోరారు. దేశంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే చిరంపుంజిలో ఇప్పుడు నీటి ఎద్దడి నెలకొందని గోదావరి నదీ యాజమాన్య బోర్డ్ చైర్మన్ ఆర్‌కే జైన్ చెప్పారు.

## రాష్ట్ర సర్కారు 'రైల్వే' కోచింగ్

- పాత జిల్లా కేంద్రాల్లో శిక్షణ సెంటర్లు

**హైదరాబాద్, వెలుగు:**

రైల్వే ఉద్యోగాల్లో రాష్ట్ర యువత సత్తా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. హైదరాబాద్, కాజీపేట, కరీంనగర్, మహబూబ్‌నగర్‌తో పాటు పాత జిల్లా కేంద్రాల్లో కోచింగ్ సెంటర్లు ప్రారంభం కానున్నాయి. దాదాపు 100 రోజుల పాటు తరగతులు నిర్వహించనున్నారు. రైల్వే ఈ మధ్యే 64 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మరో రెండున్నర లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. రాష్ట్ర విద్యార్థులకు సరైన శిక్షణనిస్తే రైల్వేలో మన వారి సంఖ్య పెరుగుతుందని ఎంపీ వినోద్‌కు మజ్దూర్ యూనియన్ నేతలు రవీందర్, కర్ర యాదవ్ రెడ్డి వివరించారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ప్రతిపాదనపై కేసీఆర్ కూడా ఆసక్తి చూపినట్లు సమాచారం. ఆయన చొరవతోనే తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లతో పాటు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

## జనసేన కమిటీలు

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్లమెంటరీ కమిటీలు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, ఖమ్మం లోక్‌సభ స్థానాల్లో ఎగ్జిక్యూటివ్, వర్కింగ్ కమిటీలు ఏర్పాటు చేస్తూ గురువారం ఆదేశాలిచ్చారు. ఎగ్జిక్యూటివ్ కమిటీల్లో 11 మంది, వర్కింగ్ కమిటీల్లో 32 మంది నేతలకు స్థానం కల్పించారు.

## వారంలోపు 220 కేవీ లైన్ల పనులు పూర్తి

అధికారులకు ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావు ఆదేశం

**హైదరాబాద్, వెలుగు:**

220 కేవీ లైన్ల పనులను ఈ నెల 14లోపు పూర్తి చేయాలని ట్రాన్స్ కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ శివరాంపల్లిలో విద్యుత్ లైన్ల నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైదరాబాద్‌లో విద్యుత్ సరఫరాను పెరుగు పరిచేందుకు మామిడిపల్లి, శివరాంపల్లి, షాపూర్‌నగర్, మల్కారం, గచ్చిబౌలి, శంకర్‌పల్లిలో సబ్‌స్టేషన్లను ప్రభుత్వం ఇప్పటికే నిర్మించింది. వీటిని అనుసంధానం చేస్తూ లోడ్ సమస్య తలెత్తకుండా రూ.100 కోట్లతో 136 సర్క్యూట్ కిలోమీటర్లలో 7 మార్గాల్లో 220కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పవర్ సిస్టమ్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఎస్‌డీఎఫ్)లో భాగంగా చేపట్టిన ఈ పనుల్లో ఇప్పటికే రూ.59 కోట్ల గ్రాంట్లు విడుదలయ్యాయి. ట్రాన్స్ కో సీఎండీతోపాటు తనిఖీల్లో డైరెక్టర్లు జగత్‌రెడ్డి, జె. సూర్యప్రకాశ్, సీఈ వివేకానంద, ఎస్ఈ రామరాజు పాల్గొన్నారు.

**హైఓల్టేజ్ సదస్సును ప్రారంభం**

హైదరాబాద్ లో కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైఓల్టేజ్ సదస్సు'ను ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావు గురువారం ప్రారంభించారు. విద్యుత్‌రంగంలో సంస్కరణలు, రాష్ట్రం సాధించిన విజయాలను వివరించారు. ఎలక్ట్రికల్ ఇంజినీర్లు రూపొందించిన పుస్తకాన్ని అవిష్కరించారు.

## 'వేగంగా పీఎం కిసాన్'

**హైదరాబాద్, వెలుగు:** పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలో వేగంపెంచాలని కేంద్ర కేబినెట్ సెక్రెటరీ ప్రదీప్‌కుమార్ సిన్హా అన్నారు. అన్నిరాష్ట్రాల వ్యవసాయాధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రం తరఫున వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు. పథకం అమలుపై మార్గదర్శకాలు రాష్ట్రాల అధికారులకు సిన్హా వివరించారు.

## 'అన్ని కేడర్లకు న్యాయం'

**హైదరాబాద్, వెలుగు:** విద్యాశాఖలో అన్ని కేడర్లలో పనిచేస్తున్న అర్హులైన టీచర్లకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని ఎస్టీయూ రాష్ట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. చాలా ఏళ్లుగా సర్వీసులో ఉన్న ఎస్జీటీలకు ఎస్ఏ, ఎల్ఎఫ్ఎల్‌గా పదోన్నతులు కల్పించాలని కోరారు.

# ఓల్డేజ్ హోంలకు తప్పనిసరిగా పర్మిషన్ ఉండాలె

**హైదరాబాద్, వెలుగు:**

రాష్ట్రంలో ఓల్డేజ్ హోంల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. వందలాదిగా వృద్ధాశ్రమాలు ఉన్నా, రిజిస్టర్ అయినవి కేవలం 23 మాత్రమే. వీటిలో 18 కేంద్ర ప్రభుత్వం సాయంతో నడుస్తుండగా, మిగతా ఐదు రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ తో నడుస్తున్నాయి. మిగిలిన ఆశ్రమాలకు ఎలాంటి అనుమతులు లేవు. మొదట సేవా దృక్పథంతో ప్రారంభిస్తున్న ఆశ్రమాల్లో కొన్నాళ్లకు వ్యాపార దృక్పథం పెరుగుతోందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, వీటి నిర్వహణను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఓల్డేజ్ హోంలను తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశించింది.

**ఇన్నాళ్లు తనిఖీల్లేవు**

కేంద్రం తెచ్చిన సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ చట్టం-2007 ప్రకారం వంద నుంచి 150 మందికి ఆశ్రయమిచ్చేలా జిల్లాకో వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. మంచిర్యాల, ఖమ్మం జిల్లా కేంద్రాల్లో మాత్రమే డే కేర్ సెంటర్లున్నాయి. మిగతా ఏ జిల్లాల్లోనూ ఇలాంటివి లేవు. అధికారులు జిల్లాల్లో ఓల్డేజ్ హోంలు ఏర్పాటు చేయకపోగా, ప్రైవేటు వృద్ధాశ్రమాలను పర్యవేక్షించడం మానేశారు. ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదనే భావనతో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఆశ్రమాల వైపు కన్నెత్తి చూడడం లేదు. వృద్ధ, అనాథాశ్రమాల్లో ఫైర్ సేఫ్టీ, ఫుడ్డూ, బెడ్లు, బాత్రూమ్ లు, టాయిలెట్లు ఎలా ఉన్నాయనే దానిపై ఏడాదిలో ఒక్కసారైనా తనిఖీ చేయడం లేదు.

**హైదరాబాద్‌లోనే వెయ్యి**

హైదరాబాద్ నగరంలోనే సుమారు వెయ్యికిపైగా వృద్ధాశ్రమాలున్నాయి. కొందరు ఒకే పేరుతో నగరంలో పలుచోట్ల బ్రాంచ్ లు ఏర్పాటు చేశారు. వాటిలో రిటైర్డ్ ఎంప్లాయిస్, ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రుల తోపాటు ఎక్కువగా ఎన్ఆర్ఐల పేరెంట్స్ ఉంటున్నారు. ఒక్కొక్కరి నుంచి ప్రతినెల రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు వసూలు చేస్తున్నారు. అడ్వాన్స్ డిపాజిట్‌గా రూ.20 వేల నుంచి రూ.40 వేలు, మెడికల్ డిపాజిట్ గా రూ.5 వేల నుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. ఏసీ, డాక్టర్, నర్సింగ్ సౌకర్యాలు వినియోగించుకుంటే అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇకపై అన్ని సౌకర్యాలు ఉంటేనే వృద్ధాశ్రమాలకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే దాతలు, ఆశ్రయం పొందుతున్న వారి వివరాలను వెల్లడించాలని స్పష్టం చేసింది.



- రిజిస్ట్రేషన్ దరఖాస్తుకు 28 వరకు గడువు
- రాష్ట్రంలో అనుమతి ఉన్న వృద్ధాశ్రమాలు 23 మాత్రమే
- అనుమతులు లేనివి వందల్లో.. హైదరాబాద్‌లోనే వెయ్యి!

### రిజిస్టర్ చేయించుకోవాల్సిందే

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓల్డేజ్ హోమ్ లను తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. http://www.wdsc.telangana.gov.in వెబ్ సైట్ నుంచి ఫామ్–ఎం డౌన్ లోడ్ చేసుకుని ఈ నెల 28లోగా జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో నమోదు చేయించి, గుర్తింపు పత్రం తీసుకోవాలి. నమోదు చేయని సంస్థలపై కఠిన చర్యలతో పాటు, రూ.25,000 జరిమానా విధిస్తాం.

**-శైలజ, కమిషనర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ**

## పీజీ ఈసెట్ షెడ్యూల్

**మార్చి 13 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు**

**హైదరాబాద్, వెలుగు** : ఎంటెక్, ఎంఈ, ఎంఫార్మసీ తదితర కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించే పీజీ ఈసెట్ 2019 షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి గురువారం విడుదల చేశారు. మార్చి13 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. రిజిస్ట్రేషన్‌కు జనరల్ విద్యార్థులు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీలు రూ.500 చెల్లించాలి. మే 22 నుంచి 27 వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 28 నుంచి 31వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఉంటుంది. ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ రెండు విడతల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. కార్యక్రమంలో పీజీఈసెట్ కన్వీనర్ ఎం.కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ లింబాద్రి, కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## గ్రామ కార్యదర్శుల నియామకం ముందుకు సాగేనా?

కొనసాగుతున్న హైకోర్టు స్టే • గ్రామ పాలనకు ఇబ్బందులు

**హైదరాబాద్, వెలుగు:**

గ్రామ పంచాయతీలకు కార్యదర్శుల కొరత సమస్యగా మారింది. సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు గ్రామ పాలనలో కీలకం. కొత్త సర్పంచ్‌లు బాధ్యతలు చేపట్టినప్పటికీ.. చాలా చోట్ల కార్యదర్శుల కొరత వెంటాడుతోంది. గత ఏడాది ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 4380 కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయగా, మొత్తం 12,751 ఉన్నాయి. వివిధ శాఖల అధికారులను గత ఏడాది ఆగస్టులో గ్రామాల్లో ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది. కార్యదర్శుల కొరత ఉన్న దృష్ట్యా ప్రభుత్వం 9355 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకం కోసం గత ఆగస్టు 31 న నోటిఫికేషన్ విడుదల చేసింది. అక్టోబర్ 10న పరీక్ష జరుగగా.. డిసెంబర్ 19న ఫలితాలు విడుదలయ్యాయి. షెడ్యూలు ప్రకారం డిసెంబర్ 25న నియామక పత్రాలు ఇచ్చి, అదే నెల 27న శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో నియామకాలు పెండింగ్‌లో పడ్డాయి. ఒకే అభ్యర్థి హాల్ టికెట్ నంబర్ రెండు సార్లు వచ్చిందని, క్రీడల కోటా, వికలాంగుల కోటా కింద ఎంపిక జరగలేదని, జిల్లాల్లో కేటగిరీల వారీగా మార్కులు, కటాఫ్ మార్కులను అధికారులు వెల్లడించలేదని చాలా మంది అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పిటిషన్లను విచారించిన హైకోర్టు తాము చెప్పే వరకు నియామక పత్రాలు ఇవ్వొద్దని స్పష్టం చేసింది. డిసెంబర్ 25 నుంచి హైకోర్టులో కేసు అపరిష్కృతంగానే ఉంది. అది పరిష్కారం అయితేగానీ కొత్త కార్యదర్శులు గ్రామాల్లోకి చేరే పరిస్థితి లేదు.



### దీపికారెడ్డికి సంగీత్‌నాటక్ అవార్డు

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కూచిపూడి నర్తకి దీపికారెడ్డికి సంగీత్‌నాటక్ అకాడమీ అవార్డును రాష్ట్రపతి కోవింద్ బుధవారం అందజేశారు. మొత్తం ఐదు కేటగిరీల్లో 42 మంది కళాకారులు ఈ పురస్కారాలు అందుకున్నారు.

**- న్యూఢిల్లీ**

**కర్నాటక రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియనంతగా అసమ్మతి రాజకీయాలు చాపకింద నీరులా సాగుతున్నాయి. సీఎల్పీ నేత సిద్దరామయ్య జారీ చేసిన విప్ ను కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఖాతరు చేయడం లేదు. ఫైనాన్స్ బిల్లు రూపంలో కుమారస్వామి సర్కార్ మెడ మీద కత్తి వేలాడుతోంది.**



# దిన దిన గండం! ఎన్నాళ్ల ఆయుష్షు?

## డేంజర్ జోన్‌లో కర్నాటక సర్కార్

కర్నాటక రాజకీయాలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. సంక్షోభం సమసిపోయిందనుకున్న టైంలో బుధవారం నాటి పరిణామాలు మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచాయి. కుమారస్వామి ప్రభుత్వం ప్రమాదపు అంచున ఉందన్న సంకేతాలు అందాయి. ఫిబ్రవరి 6 నుంచి 15 వరకు జరిగే బడ్జెట్ సమావేశాలకు అందరు ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని కాంగ్రెస్ నేత సిద్దరామయ్య తన పార్టీ సభ్యులందరికీ ఇదివరకు విప్ జారీ చేశారు. అయితే బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజునే కాంగ్రెస్, జేడీ(ఎస్) ఎమ్మెల్యేలు ఎనిమిది మంది అసెంబ్లీకి డుమ్మా కొట్టారు. ఇందులో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాగా ఒకరు సాక్షాత్తూ ముఖ్యమంత్రి కుమారస్వామి సొంత పార్టీ ఎమ్మెల్యే నారాయణ గౌడ కూడా ఉండటం గమనార్హం. గైర్హాజరైన ఏడుగురు కాంగ్రెస్ శాసనసభ్యుల్లో సహచర ఎమ్మెల్యే ఆనంద్ సింగ్‌పై దాడి ఆరోపణలు ఎదుర్కొన్న బళ్లారి జిల్లా ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ కూడా ఉన్నారు. ఈ ఏడుగురిలో నలుగురు శాసన సభ్యులు ముంబైలో ఉన్నట్లు సమాచారం.

### రెండు నెలలుగా ముసలం

కర్నాటక రాజకీయాల్లో ముసలం ప్రారంభమై రెండు నెలలకు పైగా అయింది. ముఖ్యమంత్రి కుమారస్వామి తన కేబినెట్‌లో మార్పులు చేర్పులు చేయడంతో గొడవలు ప్రారంభమయ్యాయి. కేబినెట్ విస్తరణలో కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రి పదవులు ఆశించారు. అయితే అనేక కారణాల వల్ల వారికి పదవులు దక్కలేదు. దీంతో కాంగ్రెస్‌లో అసమ్మతి రాజకీయాలకు బీజం పడింది. కుమారస్వామి సర్కార్‌పై అసంతృప్తితో ఉన్న కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముంబైకు తీసుకెళ్లి ఓ స్టార్ హోటల్‌లో ఉంచి బీజేపీ నాయకులు రాజకీయ బేరసారాలు చేశారన్న వార్తలు గుప్పుమన్నాయి.

సంకీర్ణ సర్కార్‌ను పడగొట్టడానికి 'ఆపరేషన్ కమల్'ను ప్రారంభించినట్లు బీజేపీని టార్గెట్ చేసింది కాంగ్రెస్. ఓ వైపు ఈ పరిణామాలు ఇలా ఉంటే ఇద్దరు ఇండిపెండెట్ ఎమ్మెల్యేలు సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. తర్వాత జనవరి 18న జరిగిన సీఎల్పీ సమావేశానికి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. కుమారస్వామి ప్రభుత్వం డేంజర్ జోన్‌లో పడే అవకాశం ఉందన్న సంకేతాలు రావడంతో కాంగ్రెస్ హైకమాండ్ అలర్ట్ అయింది. తమ ఎమ్మెల్యేలను బెంగళూరుకి దగ్గరలో ఓ రిసార్ట్స్‌కు తరలించింది.

### ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం లభిస్తుందా?

కుమారస్వామి ప్రభుత్వ తక్షణ కర్తవ్యం ఫైనాన్స్ బిల్లును ఆమోదింపచేసుకోవడం. సంకీర్ణ సర్కార్‌కు ఇది అంత సులువు కాదు. 224 మంది సభ్యులున్న కర్నాటక అసెంబ్లీలో స్పీకర్‌ను మినహాయిస్తే కాంగ్రెస్, జేడీ(ఎస్)కు మొత్తం 117 మంది ఎమ్మెల్యేలున్నారు. బీజేపీకి 104 మంది శాసనసభ్యులున్నారు. కనీసం ఓ డజను మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి గైర్హాజరైతే ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం లభించడం కష్టమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### తొలిరోజునే సీఎం రాజీనామాకు డిమాండ్

బడ్జెట్ సమావేశాల తొలిరోజునే సంకీర్ణ సర్కార్‌ను ప్రధాన ప్రతిపక్షం బీజేపీ టార్గెట్ చేసింది. కుమారస్వామి ప్రభుత్వానికి సభలో మెజారిటీ లేదని విరుచుకుపడింది. ముఖ్యమంత్రి పదవికి ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

### సర్కార్‌కు ఢోకా లేదు

డుమ్మా కొట్టిన కాంగ్రెస్, జేడీ(ఎస్) ఎమ్మెల్యేలు త్వరలోనే సభకు హాజరవుతారన్న ఆశాభావాన్ని ఆయా పార్టీల నాయకులు వ్యక్తం చేశారు. కుమారస్వామి ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదని కర్నాటక పీసీసీ ప్రెసిడెంట్ దినేశ్ గుండూరావు అన్నారు. సంకీర్ణ సర్కార్ ఫుల్ టర్మ్ అధికారంలో కొనసాగుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నయానో భయానో బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేలా చేసి ఫైనాన్స్ బిల్లును ఆమోదింపచేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

### మెడపై కత్తి

బీజేపీ 'ఆపరేషన్ కమల్' సంగతి ఎలాగున్నా అటు కాంగ్రెస్ ఇటు జేడీ(ఎస్)లో మంత్రి పదవులు రానందుకు చాలా మంది అసంతృప్తితో ఉన్న విషయం కాదనలేని వాస్తవం. ఫైనాన్స్ బిల్లు రూపంలో కుమారస్వామి సర్కార్ మెడపై కత్తి వేలాడుతోంది. ఈ గండం నుంచి సంకీర్ణ ప్రభుత్వం ఎలా బయటపడుతుందో చూడాల్సిందే.

- 'ది వైర్' సౌజన్యంతో

### నేడు తేల్చేస్తారా..?

ఈ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని సిద్దరామయ్య ఏర్పాటుచేశారు. ఇందుకు సంబంధించి సభ్యులకు విప్ కూడా జారీ చేశారు. డుమ్మా కొడితే వేటు తప్పదని హెచ్చరించారు. అయితే, వేటుకు భయపడి అసంతృప్తితో ఉన్న శాసన సభ్యులు బడ్జెట్ సమావేశాలకు హాజరవుతారా లేదా అనేది ప్రశ్నార్థకమే.

### ముగ్గురు ఎమ్మెల్యేలు డుమ్మా

తొలి రోజు బడ్జెట్ సమావేశాలకు డుమ్మా కొట్టినవారిలో బీజేపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా ఉండటం విశేషం. బీజేపీ ఎమ్మెల్యేల్లో ప్రముఖుడిగా గుర్తింపు పొందిన జి.కరుణాకర్‌రెడ్డి కూడా సమావేశాలకు గైర్హాజరయ్యారు.

# బడ్జెట్‌కి అప్పులే ఆసరా

**ఒక్కోసారి అవసరానికి అప్పుచేయక తప్పదు. చేయి తిరిగాక వాటిని తిరిగి ఇచ్చేస్తాం. ఇది సహజమే. కానీ.. చేసిన అప్పు తీర్చకుండా దానికి వడ్డీ కట్టడం కోసం మరోసారి అప్పు చేస్తే.. అది పొరపాటు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి తప్పిదాలే చేస్తోంది. ఓట్ల మీద ఆశతో కోట్లు కోట్లు రుణాలు తీసుకుంటోంది. ఈ పద్ధతికి ఫుల్‌స్టాప్‌లు, కామాలు పెట్టకపోతే ఆర్థిక క్రమశిక్షణ అదుపు తప్పుతుంది. ఖర్చులు తగ్గించుకోవటమే కరెక్ట్ సొల్యూషన్.**




వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ అప్పులపై వడ్డీల భారం భారీగా పెరగనుంది. ఇంట్రస్ట్‌ల పేమెంట్ కోసం గతేడాది రూ.52 వేల కోట్లు కేటాయించగా ఈసారి రూ.90 వేల కోట్లు పక్కనపెట్టాల్సి వచ్చింది. అంటే కిందటి సారితో పోల్చితే ఇప్పుడు రూ.38 వేల కోట్ల అదనపు బరువు మోయాల్సి ఉంది. రుణాల చెల్లింపులు 2018-19 పద్దులో రూ.5 లక్షల 75 వేల కోట్లు. ఇది 2019-20 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.6 లక్షల 65 వేల కోట్లకు చేరింది. అంటే పెరుగుదల శాతం 15.65.

ఈ నేపథ్యంలో రూ.5 లక్షల 50 వేల కోట్లు ఎక్స్‌ట్రా అప్పుచేయాలి. దీనికి వడ్డీ రేటు ఏడు శాతం. ఇప్పటికే ఉన్న అప్పులను దీన్నుంచి మినహాయించటం గమనార్హం. రుణాలు ఇలా దారుణంగా పెరుగుతుంటే సర్కారు లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా రీసెంట్ బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించటం ఎంత వరకు కరెక్ట్?. ఇది అప్పు చేసి పప్పు కూడు పెట్టడం కాదా?. ఇలాంటి పరిస్థితుల్లో వివిధ వర్గాలకు రాయితీలు ఇవ్వటం వల్ల ఆర్థిక వ్యవస్థపై పడే తీవ్ర ప్రభావాన్ని తలచుకుంటేనే భయమేస్తోంది.

ఖజానాపై పడుతున్న ఈ అదనపు భారాన్ని ప్రభుత్వం ఎలా భర్తీ చేస్తుంది?. రెవెన్యూ జనరేషన్‌కి ప్రత్యేక ప్రణాళికలేమైనా ఉన్నాయా?. జీఎస్టీ వసూళ్లు అనుకున్న స్థాయిలో లేకపోవటంతో దాన్ని కవర్ చేయటానికి ట్రిక్స్ ప్లే చేస్తున్నారు. 2019-20 బడ్జెట్ అంచనాల్లో జీఎస్టీ కలెక్షన్స్‌ని రూ.7 లక్షల 61 వేల కోట్లుగా వెల్లడించారు. ఇది 2018-19 బడ్జెట్ ఎస్టిమేషన్స్‌తో పోల్చితే 2.28 శాతం ఎక్కువ. కార్పొరేట్ పన్నుల రాబడి వ్యవహారం మరోలా ఉంది. ఈ ట్యాక్స్‌ల వసూళ్లూ దాదాపు జీఎస్టీ కలెక్షన్స్ రేంజ్‌లోనే ఉంటాయని గవర్నమెంట్ చెప్పింది.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ ట్యాక్స్ కలెక్షన్ 22.38 శాతం (రూ.లక్షా 39 వేల కోట్లు) పెరుగుతుందని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో తెలిపారు. జీఎస్టీ వసూళ్లు కిందా మీదా పడుతుండటంతో ఆ లోటు భర్తీకి కార్పొరేట్ రంగాన్ని టార్గెట్ చేశారు. ప్రత్యక్ష పన్నుల రాబడిని పెంచడం ద్వారా నష్టనివారణ చేపట్టాలని చూస్తున్నారు. ఇంతకుమించిన పక్షపాతం మరొకటి ఉంటుందా?. జీఎస్టీ సమస్యల నుంచి గట్టెక్కటానికే కార్పొరేట్ రంగం సతమతమవుతుంటే రూ.లక్షా 39 వేల కోట్లను అడిషనల్‌గా చెల్లించగలదా?.

వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 2019-20లో రూ.6 లక్షల 20 వేల కోట్లు ఉంటాయని ఎస్టిమేట్ చేశారు. ఇది గత ఏడాది అంచనాల ప్రకారం రూ.5 లక్షల 29 వేల కోట్లు మాత్రమే. అంటే ఈసారి రూ.91 వేల కోట్లు ఎక్కువ కలెక్షన్ వస్తుందని అనుకుంటున్నారు. బహుశా ఈ రాబడిపై ఆశతోనే టెంపరరీ బడ్జెట్‌ని టెంప్టింగ్ బడ్జెట్‌గా (ఓట్లు కురిపించే పద్దుగా) రూపొందించి ఉంటారని భావిస్తున్నారు. ఎలక్షన్స్‌లో ఏ పార్టీ గెలిచినా రానున్న రోజుల్లో దేశ ఆర్థిక పరిస్థితి వరస్ట్‌గా మారటం తథ్యమనిపిస్తోంది. బడ్జెట్‌లో వరాలు కురిపించటం ద్వారా జన రంజక పాలన అందించాలనుకోవటంలో తప్పులేదు. కానీ.. ఆదాయాన్ని, ఖర్చులను వాస్తవానికి విరుద్ధంగా చూపటమే ఆందోళన కలిగిస్తోంది. నిజం చెప్పాలంటే తాజా బడ్జెట్‌లో చాలా లెక్కలు నమ్మశక్యంగా లేవు. అర చేతిలో స్వర్గం చూపించినట్లు ఉన్నాయి. ద్రవ్య లోటును రూ.7 లక్షల 4 వేల కోట్ల వద్ద ఉంచాలంటే దాన్ని జీడీపీలో 3.35 శాతానికే (రూ.210 ట్రిలియన్లకు) పరిమితం చేయాలి. ఇది అంత పెద్ద మొత్తానికి చేరుతుందా? లేదా? అనేది అంతు చిక్కని ప్రశ్న. మొత్తం మీద ఈ తాత్కాలిక బడ్జెట్ పూర్తిగా రుణాలపైనే ఆధారపడ్డట్లు కనిపిస్తోంది. ఓట్ల కోసం ఇలా లక్షల కోట్లు అప్పు చేయటం సరికాదు. వడ్డీల భారాన్ని, వ్యవస్థాపక ఖర్చులను తగ్గించుకోవటమే సమస్యకు సరైన పరిష్కారం.

- బిశ్వజిత్ భట్టాచార్య
ఎక్స్- అడిషనల్ సొలిసిటర్ జనరల్




### వచ్చేది తక్కువ.. పోయేది ఎక్కువ..

ఈ ఏడాది ఎండాకాలంలో కేంద్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ అనుకున్నంత ఈజీ కాదు. పట్ట పగలే చుక్కలు కనపడటం ఖాయం. సబ్సిడీలు, పెన్షన్లు, గ్రాంట్లలో కోత పెట్టడం కష్టం కాబట్టి దీర్ఘకాలిక అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఖర్చులను, పెట్టుబడులను తగ్గించుకోవటం ఉత్తమం. రెవెన్యూ వసూళ్లు రూ.20 లక్షల 80 వేల కోట్లే ఉండి, అభివృద్ధేతర ఖర్చులు అంతకన్నా ఎక్కువ(రూ.21 లక్షల 48 వేల కోట్లు)గా ఉన్నప్పుడు డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ కోసం, ప్రజాకర్షక పథకాల కోసం అప్పుచేయటం తప్ప మరో మార్గం ఉండదు.

# అతి సామాన్యులపైనా సిన్మాలు

**చిత్ర కథలో భాగంగా చేనేత మగ్గాలపై ఒకటీ అరా సీన్లు తీసిన సినిమాలు... 'జననీ జన్మభూమి'లాంటివి చాలానే ఉంటాయి. చేనేత కథాంశంతో ఫుల్ లెంగ్త్‌తో వచ్చిన సినిమాలు తక్కువ. సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల తదితర చేనేత గ్రామాలపై, చేనేతకారుల ఆత్మహత్యలపై వచ్చిన డాక్యుమెంటరీల సంఖ్య ఎక్కువగానే ఉంది. . చేనేత కుటుంబంలోని యధార్థ జీవితాలను, సహకార సంఘాల పనితీరుతో వచ్చిన మొదటి సినిమా 'సుస్మన్'. దాదాపు 40 ఏళ్లకు వస్తున్న మరో బయోపిక్ 'మల్లేశం'.**






భారీ బడ్జెట్ సినిమాలకు చిరునామాగా మారిన టాలీవుడ్‌లో సామాజికంగా వెనకబడిన కుల నేపథ్యంతో సినిమాలు తీయడం సాహసోపేతమే.. కూడు, గూడు తర్వాతి స్థానంలో ఉన్నది గుడ్డ. అదే చేనేత వృత్తి ఆధారంగా వివిధ భాషల్లో వచ్చిన చిత్రాలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. తెలంగాణ ప్రాంతం నుంచి ఇప్పటికే 'సుస్మన్' పేరుతో ఓ హిందీ చిత్రం వచ్చింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్లీ తెలుగులో 'మల్లేశం' పేరుతో రావడం ఓ అరుదైన ప్రయత్నంగా చెప్పుకో వచ్చు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత భాష, యాస, కట్టుబాట్లు, సంస్కృతీ సంప్రదాయాలతో గ్రామీణ వాతావరణంలో రూపొందుతున్న చిత్రాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా పద్మశాలీల కులవృత్తి అయిన చేనేతలోని ఎత్తుపల్లాలు, కష్టనష్టాలు, ఆకలి చావులు ఇతివృత్తంగా తీసుకుని 30-40 ఏళ్ల క్రితమే 'కోయిలమ్మ కూసింది', 'సుస్మన్', 'సిల్కు మారియానో'... తదితర చిత్రాలు వచ్చాయి. తెలంగాణకి చెందినవారితో తాజాగా 'మల్లేశం' సినిమా వస్తోంది.

సత్యజిత్ రే సినిమాల స్ఫూర్తితో ఫ్రాన్స్ కి చెందిన మార్సియనో ఫిల్మాలజీపై అధ్యయనం చేసింది. 1973 నుంచి 1985 వరకు ఆమె ఫ్రెంచ్ టెలివిజన్‌కి అనేక చిత్రాలు అందించింది. ఇందులో భాగంగా 'సిల్క్ మారియానో'' పేరుతో తీసిన చిత్రం ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చి పెట్టింది. 1914లో పారిస్‌లో జరిగిన ఓ వాస్తవిక కథ ఆధారంగా తీసిన చిత్రమిది. ఇందులో పట్టు బట్టలు నేసే చేనేతకారుల జీవితం చాలా బాగా చిత్రీకరించారు. ఈ సినిమా పెద్ద సంచలనం సృష్టించి, దర్శకురాలికి కీర్తి తెచ్చి పెట్టింది. పారిస్‌లో 'సిల్క్ మారియన్' పేరుతో ఏర్పాటైన ఫ్యాషన్ షోరూం ప్రపంచ ప్రఖ్యాతి పొందింది.

ఇక తెలుగులో 1976లో వై.ఆర్.బాబు దర్శకత్వంలో 'కోయిలమ్మ కూసింది' పేరుతో ఓ సినిమా రూపొందింది. తెలుగులో వచ్చిన పూర్తి నిడివిగల చేనేతకారుల సినిమాగా దీనిని చెప్పుకోవచ్చు. చితికిపోయిన ఓ చేనేత కుటుంబ నేపథ్యాన్ని తీసుకుని ఈ సినిమా తీశారు. కానీ, ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుని 'కోయిలమ్మ కూసింది' విడుదలకు నోచుకోలేదు. చిత్ర కథలో భాగంగా చేనేత మీద దృశ్యాలను చిత్రీకరించిన సినిమాలు చాలానే వచ్చి నప్పటికీ, పూర్తి నిడివిగల చేనేత కథాంశంతో వచ్చిన సినిమాలు తక్కువగానే ఉన్నాయి. సిరిసిల్ల, పోచంప ల్లి, గద్వాల తదితర చేనేత గ్రామాల పై, చేనేతకారుల ఆత్మహత్యల పై వచ్చిన డాక్యుమెంటరీల సంఖ్య ఎక్కువగానే ఉంది. 'మల్లేశం' సినిమా దగ్గరకొస్తే... తెలంగాణలో చేనేతకు విశిష్ట స్థానముంది. పద్మశ్రీని అందుకున్న కళాకారులున్నారు. పేటెంట్ హక్కుతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ చీరల నేతలున్నాయి. మరోపక్క ఆకలి చావులకు చిరునామాగా మారిన సిరిసిల్ల మరమగ్గాల హబ్ ఉంది. చేనేత పరిశ్రమలోని ఎత్తుపల్లాల మధ్య ఓ సామాన్యుడు అసామాన్యుడుగా మారిన నిజజీవిత కథే 'మల్లేశం'. ఆరు గజాల చీర నేయడానికి ఇంటిల్లిపాది కష్టపడాలి. భర్త మగ్గం నేస్తే, భార్య రాట్నం తిప్పాలి, అచ్చు అతకాలి, ఆసుపోయాలి. ఆసు పోయడం భుజాలకు ఇబ్బంది కలిగే విషయం. తన తల్లి ఆసు పోసి పోసి భుజాలు కుదేలయిన విషయాన్ని గుర్తించిన మల్లేశం, దీనికి ప్రత్యామ్నాయం కనుగొనాలనే ఆలోచనలో పడ్డాడు. కష్టపడి, ఆలోచనలకు పదును పెట్టి, అనేక అవమానాలు, ఇబ్బందులు ఎదు ర్కొని 'ఆసు యంత్రం' సృష్టించి అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. రాష్ట్రపతి ప్రశంసలు అందుకున్నాడు. పద్మశ్రీని చేజిక్కించుకున్నాడు. ఆయన జీవనగాథనే "మల్లేశం' పేరుతో రూపుదిద్దుకున్న బయోపిక్. తెలంగాణ భాష, యాస, దర్శక నిర్మాతలు, కళా దర్శకుడు, పాటల, మాటల రచయితలు, నటీనటులందరూ తెలంగాణకు చెందినవారు. పోచంపల్లికి సమీపంలోని రేవణపల్లిలో ఈ చిత్ర నిర్మాణం జరిగింది. మహామహుల జీవిత గాథలతో వస్తున్న బయోపిక్‌ల సరసన ఓ సామాన్య మానవుడి బయోపిక్ రావడం గొప్ప విషయం.



### యధార్థ జీవితాల 'సుస్మన్'

చేనేత పనివారి జీవితాన్ని, వారు ఎదుర్కొంటున్న వొడిదొడుకులను సుప్రసిద్ధ సినీ దర్శకులు శ్యామ్ బెనగల్ 'సుస్మన్' పేరుతో హిందీలో తీశారు. 1987లో వచ్చిన ఈ చిత్రం పూర్తిగా పోచంపల్లిలో చిత్రీకరించారు. చేనేత కుటుంబంలోని యధార్థ జీవితాలను, సహకార సంఘాల పనితీరును, మాస్టర్ వీవర్, చేనేత కళాకారుల మధ్య జరిగే సంఘర్షణను కళ్లకు కట్టినట్లుగా తెరకెక్కించారు. ప్యారిస్‌లో జరగబోయే అంతర్జాతీయ చీరల ఎగ్జిబిషన్‌కి ప్రత్యేకంగా పట్టు చీర నేయడం అనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. ఈ చిత్రం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు, ప్రశంసలు అందుకున్నది.

### ఇతర భాషల్లోనూ నేతన్నల బతుకు చిత్రాలు


ఇటీవల హిందీలో వచ్చిన 'సూయి ధాగా (సూది-దారం) చిత్రం కూడా నూలు మిల్లు కార్మికుల జీవితాలకు చిత్రిక పట్టింది. తమిళంలో తీసిన 'కాంజీవరం' సినిమా... స్వాతంత్ర్యోద్యమ కాలంలో నేత కార్మికుల దయనీయ స్థితిని కళ్ళకు కట్టించింది. సహకార చేనేతోద్యమం ఎందుకు ప్రారంభమైందో ఈ సినిమాద్వారా తెలిసొస్తుంది. 55వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ఈ సినిమా జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచింది.





కోడం పవన్ కుమార్
సీనియర్ జర్నలిస్ట్

## ఏమన్నారంటే



### పాలిటిక్స్‌పై ఇంట్రస్ట్ లేదు

ఎన్నికల్లో పోటీ ఆలోచన లేదు. లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్ లీడర్లు అడిగారు. కానీ.. పాలిటిక్స్‌కి దూరంగా ఉండాలనుకున్నా.

- జస్టిస్ జోసెఫ్ కురియన్, సుప్రీం మాజీ జడ్జి



### అంత సెల్ఫిష్‌ని కాను

సినిమా సక్సెస్‌కు అందులోని అందరూ కారణమే. నా కోసమే జనం వస్తున్నారనుకునేంత సెల్ఫిష్‌ని కాను.

- రాజేంద్ర ప్రసాద్, నటుడు



### ఓటమి మంచిదే..

మనోళ్లు ఓడిపోతుండటం మంచిదే. అట్లైతేనే ఏదైనా నేర్చుకుంటారు. టీ20 సిరీస్‌ను గెలవకపోయినా బాధపడను.

- గవాస్కర్, టీమిండియా మాజీ ప్లేయర్

### మీరూ రాయొచ్చు!

సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు.
openpage@v6velugu.com

# టాకీస్





# మహర్షి స్పీడు

గత ఏడాది వేసవిలో ‘భరత్ అనే నేను’తో మెప్పించిన మహేష్‌బాబు.. ఈ ఏడు కూడా వేసవిలోనే ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. మహేష్‌ను ఎప్పుడెప్పుడు ‘మహర్షి’గా చూద్దామా అని ఎదురుచూస్తోన్న అభిమానులకు ఇటీవల సినిమా విడుదల తేదీతో చల్లని కబురు చెప్పాడు నిర్మాత దిల్‌రాజు. చిత్రీకరణ చివరిదశకు చేరుకున్న ఈ సినిమా ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా మొదలయ్యాయి. గురువారం డబ్బింగ్ వర్క్‌ను ప్రారంభించారు. దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్‌రాజుతో పాటు అల్లరి నరేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. శ్రీ వేంకటేశ్వర ఫిలింస్, వైజయంతి ఫిలింస్, పీవీపీ సినిమా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. టీజర్‌ను మార్చిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# రిపీట్ కాంబినేషన్

‘దేవ్’ సినిమాతో ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది రకుల్ ప్రీత్ సింగ్. ‘ఖాకి’ తర్వాత కార్తితో రకుల్‌కు ఇది రెండో చిత్రం. రకుల్ తాజా తెలుగు చిత్రం ‘వెంకీ మామ’ కాగా.. చైతూతోనూ రకుల్‌కు ఇది రెండో సినిమానే. ఇదిలా ఉంటే బాలకృష్ణతోనూ రకుల్ మరోసారి కలసి నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొంద బోయే చిత్రంలో రకుల్‌ను కథానాయికగా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. దీంతో సంక్రాంతికి వచ్చిన ‘కథానాయకుడు’లో శ్రీదేవిగా నటించిన రకుల్‌కు బాలయ్యతో ఇది రెండో సినిమా అవుతుంది. బోయపాటి దర్శకత్వంలో వచ్చిన సరైనోడు, జయ జానకి నాయక చిత్రాల్లోనూ రకుల్ నటించింది. దీన్ని బట్టి చూస్తే రకుల్‌తో కలసి నటించిన వారంతా మళ్లీ ఆమెను హీరోయిన్‌గా తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఈ సినిమా విషయంలో మాత్రం ఇంకా అధికారిక ప్రకటనేమీ రాలేదు. ప్రస్తుతం దుబాయ్‌లో బంగీ జంప్‌లు గట్రా చేస్తూ ఎంజాయ్ చేస్తోన్న రకుల్.. ఈ సినిమాకు అంగీకరించినట్టేనా!



రకుల్ ప్రీత్ సింగ్

# పైరసీ ప్రేమకథ

ప్రేమకథాచిత్రాల్లో ఎక్కువ శాతం కథలు ఒకేలా ఉంటాయి. వాటి నేపథ్యాలే మారుతుంటాయి. తాజాగా పైరసీ నేపథ్యంలో ఓ వైవిధ్యమైన ప్రేమకథ వస్తోంది. ‘హీరో హీరోయిన్’ అనే టైటిల్‌తో రూపొందుతోన్న ఈ సినిమాకు ఎ పైరెటెడ్ లవ్‌స్టోరీ అనేది ఉపశీర్షిక. నవీన్‌చంద్ర, గాయత్రి సురేష్, పూజా జవేరి ప్రధానపాత్రలు పోషిస్తుండగా ‘అడ్డా’ ఫేం జి.ఎస్ కార్తీక్ దర్శకుడు. స్వాతి పిక్చర్స్ పతాకంపై భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి కాగా గురువారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ ‘అన్ని ఎమోషన్స్ ఉండే ఈ వెరైటీ లవ్ స్టోరీలో నవీన్‌చంద్ర పాత్ర ఆకట్టుకునేలా వుంటుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ చిత్రం తప్పకుండా నచ్చుతుంది’ అన్నారు. నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయని, అతి త్వరలో సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాత తెలిపారు.




# ఆయన గుండె గట్టిది

::: బన్నీ

హాస్యనటుడు బ్రహ్మానందం ఇటీవల ముంబైలో గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. గత నెల 14న ముంబైలోని ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆయనకు ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న బ్రహ్మానందాన్ని అల్లు అర్జున్ కలిసి పరామర్శించారు. మునుపటిలా ఆయన సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మరింతగా నవ్వించాలని ఆకాంక్షించారు. ‘ధృఢమైన గుండె గల నిజమైన ఉక్కు మనిషి, నిర్భయుడు, సరదా వ్యక్తి.. కిల్ బిల్ పాండేను చూడటం సంతోషంగా ఉంది’ అంటూ ఆయనతో కలిసి దిగిన ఫొటోను బన్నీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఫొటోకు తన మార్క్ స్టైల్‌లో పోజిచ్చారు బ్రహ్మానందం. అల్లు అర్జున్ హీరోగా నటించిన చాలా చిత్రాల్లో బ్రహ్మానందం కామెడీ నవ్వులు పంచింది. ముఖ్యంగా ‘రేసుగుర్రం’లో కిల్ బిల్ పాండేగా బ్రహ్మానందం నటన ఆ సినిమాకు హైలెట్‌గా నిలచింది. వీరిద్దరి కాంబినేషన్‌లో మరిన్ని చిత్రాలు రావాలని బన్నీ ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.



## తెనాలి రామకృష్ణ షూటింగ్ షురూ



‘వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్’ తర్వాత ఆ స్థాయి విజయమేదీ సందీప్ కిషన్ కెరీర్‌లో రాలేదు. మళ్లీ ఇన్నాళ్లకు అదే పంథాలో పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంలో నటిస్తున్నాడు. జి. నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా రూపొందుతోన్న చిత్రం ‘తెనాలి రామకృష్ణ BABL’. హన్సిక కథానాయిక. ఎస్.ఎన్.ఎస్ క్రియేషన్స్ బ్యానర్ పై అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్ రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్‌లో పూజా కార్యక్రమాలతో మొదలైన ఈ చిత్రం గురువారం కర్నూలులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. సందీప్ కిషన్, హన్సిక షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇటీవల తమిళనాట నెగటివ్ రోల్స్‌తో మెప్పిస్తోన్న వరలక్ష్మి శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తోంది. తెలుగులో ఆమెకిదే తొలిచిత్రం.

## ఏజెంట్ ఆత్రేయ రెడీ

నవీన్ పొలిశెట్టి, శృతి శర్మ జంటగా స్వరూప్ ఆర్.ఎస్.జె దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం ‘ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ’. ‘మళ్ళీరావా’ చిత్ర నిర్మాత రాహుల్ యాదవ్ నక్క స్వధర్మ్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పూర్తిస్థాయి క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ‘ఫస్ట్‌లుక్‌కు విశేష స్పందన లభించింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం’ అన్నారు. సన్నీ కురపాటి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీత దర్శకుడు.



## నాయకుడెలా ఉండాలంటే..



దేశభవిష్యత్తులో కీలకపాత్ర విద్యార్థులదే. అలాంటి విద్యార్థులకు తమను పాలించే నాయకుడు ఎలా ఉండాలో, ఎలాంటి వాళ్ళని ఎన్నుకోవాలో కూడా తెలిసుండాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం ‘నేనే ముఖ్యమంత్రి’. మోహన్ రావిపాటి దర్శకుడు. దేవి ప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో నటించారు. అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు నిర్మించారు. ఈ రోజు విడుదల వుతోన్న ఈ సినిమా.. ప్రీ రిలీజ్ వేడుక బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామలో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ‘నిజాయతీపరులను ఎన్నుకోండనే సందేశంతో ఒక మంచి సినిమా చేశాం’ అని చెప్పారు. ‘ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన చిత్రమని’ నటుడు శశి, ‘నా ఈ తొలి సినిమాలో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర చేశాను’ అని మరో నటుడు వాయు తనయ్ అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ‘ప్రస్తుత పరిస్థితుల్లో నిస్వార్థంతో సేవ చేసే నాయకులు మనకు అవసరం. అలాంటి నాయకుణ్ణి ఎన్నుకోవాల్సిన బాధ్యత కూడా మనదే. పదవి కోసం ఆరాటపడే వారిని కాకుండా, బాధ్యతతో పని చేసే వారికే పట్టం కట్టాలని చెప్పే చిత్రమిది’ అన్నారు.



## ‘సైరా’.. మరువలేనిది

‘బాహుబలి’లో కాలకేయుడి తమ్ముడిగా నటించిన చరణ్ దీప్.. వరుస చిత్రాలతో విలన్‌గా మెప్పిస్తున్నాడు. పీఎస్వీ గరుడవేగ, లోఫర్ వంటి తెలుగు చిత్రాలతో పాటు ఇతర భాషల్లోనూ పాతికకు పైగా చిత్రాల్లో నటించిన చరణ్ దీప్.. ప్రస్తుతం 'సైరా నరసింహారెడ్డి'లో నటిస్తున్నాడు. చిరంజీవితో నటించడం తన జీవితంలోనే సంతోషకరమైన విషయమని తన ఆనందాన్ని పంచుకున్నాడు. ఈ సినిమాతో పాటు రాజశేఖర్ ‘కల్కి’లో నటిస్తున్నానని, తమిళ, కన్నడ భాషల్లోనూ అవకాశాలు వస్తున్నాయని తెలిపాడు. ఈరోజు విడుదలవుతోన్న తమిళ అనువాద చిత్రం ‘సీమరాజా’లో నటించిన చరణ్ దీప్ మరో భారీ తమిళ చిత్రంలో నటిస్తున్నాడు. దీంతో పాటు ఇంకో నాలుగు చిత్రాలు, ఓ వెబ్ సిరీస్ చర్చల దశలో ఉన్నాయని చెప్పాడు.

| నెక్ గుడ్ల ధరలు (100కు) | ఫామ్‌గేట్ | రిటెయిల్ |
|---|---|---|
| హైదరాబాద్ | రూ.406 | రూ.4.65 |
| వరంగల్ | రూ.408 | రూ.4.65 |

సెన్సెక్స్ 358 ↑ 36,975

నిఫ్టీ 128 ↑ 11,062



## ఆర్‌బీఐ రేటు కట్.. ఇన్వెస్టర్ల ప్రాఫిట్ బుకింగ్

**ముంబై :** స్టాక్ మార్కెట్‌ను ఆశ్చర్యపరుస్తూ.. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 0.25 శాతం తగ్గించడంతో ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు పాల్పడ్డారు. దీంతో ఆర్‌బీఐ ప్రకటన సమయంలో లాభాలు పండించిన మార్కెట్, చివరికి ఫ్లాట్‌గా ముగిసింది. సుమారు 200 పాయింట్ల మేర లాభపడిన సెన్సెక్స్, చివరిలో 4.14 పాయింట్ల నష్టంతో 36,971 వద్ద క్లోజైంది. నిఫ్టీ 6.95 పాయింట్ల లాభంలో 11,069 వద్ద ముగిసింది. ఆర్‌బీఐ పాలసీ ప్రకటన అనంతరం రేటు కోత ప్రభావిత స్టాక్స్ లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. బీఎస్‌ఈ రియాల్టీ ఇండెక్స్ 0.02 శాతం పడితే, బ్యాంకింగ్ ఇండెక్స్ 0.04 శాతం, ఆటో ఇండెక్స్ 1.77 శాతం లాభపడ్డాయి.

## టాటా మోటార్స్‌కు రూ.27 వేల కోట్ల లాస్

**మూడేళ్లలో తొలిసారి భారీ నష్టాలు**

**న్యూఢిల్లీ :** ఆటో దిగ్గజం టాటా మోటార్స్ డిసెంబర్ క్వార్టర్‌లో భారీ నష్టాలను మూటగట్టుకుంది. గురువారం ప్రకటించిన ఫలితాల్లో భారీగా రూ.26,961 కోట్ల కన్సాలిడేటెడ్ నష్టాలను నమోదు చేసింది. గతేడాది ఇదే క్వార్టర్‌లో టాటా మోటార్స్ రూ.1,214.60 కోట్ల లాభాలను పోస్టు చేసింది. జేఎల్‌ఆర్ దెబ్బ, చైనాలో బలహీనమైన అమ్మకాలు, యూరప్‌లో డీజిల్ కార్లకు తక్కువ డిమాండ్, ఇన్వెంటరీ కరెక్షన్స్, బ్రెగ్జిట్ ఆందోళనలు టాటా మోటార్స్‌ను భారీ నష్టాల్లో పడేసినట్టు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మూడేళ్ల కాలంలో ఇదే తొలి భారీ నష్టమని తెలిపింది. ఈ క్వార్టర్‌లో కంపెనీ కన్సాలిడేటెడ్ రెవెన్యూ 5 శాతం పెరిగి రూ.77,001 కోట్లుగా ఉంది.




## 'ఓలా'లా...

**న్యూఢిల్లీ:** ఓలా క్యాబ్ ప్రవేశపెట్టిన ఇన్ ట్రిప్ మైక్రో ఇన్సూరెన్స్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోంది. ప్రతి నెలా 2 కోట్ల మంది కస్టమర్లు ఈ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకుంటున్నట్టు రైడ్ షేరింగ్ ప్లాట్‌ఫామ్ ఓలా ప్రకటించింది. రైడ్ షేరింగ్ మార్కెట్‌లో ఇదే తొలి ప్రొగ్రామ్. కొత్త ఇన్సూరెన్స్ సంస్థతో కలిసి ఓలా తన ప్రయాణికులకు గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఇన్సూరెన్స్‌ను అందిస్తోంది. కీలక మెట్రో నగరాలు బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, ముంబైలలో ఈ ఇన్సూరెన్స్ పాలసీ వేగవంతమైన వృద్ధి రేటు నమోదు చేస్తోందని, అన్ని వయసుల వారు క్యాబ్ ఎక్కగానే ఈ ఇన్సూరెన్స్‌ను తీసుకుంటున్నారని ఓలా చెప్పింది. హైదరాబాద్ నుంచి కూడా ఈ పాలసీకి ఆదరణ పెరుగుతోందని పేర్కొంది. సిటీల్లోనే అయితే ఒక్క రూపాయికే రూ.5 లక్షల ప్రమాద బీమా అందిస్తోంది. అదే సిటీ వెలుపల ప్రాంతాలకైతే రూ.49కు రూ.7.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ఓలా కల్పిస్తోంది.

**ఓలా రైడ్‌లో ఇన్సూరెన్స్ ఎలా తీసుకోవాలి?**

మెనూ..ప్రొఫైల్...రైడ్ ఇన్సూరెన్స్...ఇన్సూరెన్స్ 'ఆన్'లో పెట్టుకోవాలి

ఒక్కసారి కస్టమర్ దీని ఎంపిక చేసుకున్నాక, ఇన్‌ట్రిప్ ఇన్సూరెన్స్ ప్రయాణికుడి అన్ని రైడ్‌లకు వర్తిస్తుంది.

ప్రభుత్వం కోరుకున్నట్టుగానే కీలకవడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించింది. రెపోరేటుకు కోత పెట్టడం వల్ల వాహన, గృహ రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం కనిపిస్తున్నాయి. రైతులను ఆదుకోవడానికి తనఖా లేని రుణాల పరిమితిని రూ.1.6 లక్షలకు పెంచారు. వాణిజ్య యుద్ధ భయాల వల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందులు ఏర్పడుతాయని, అయితే ఇండియా ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. జీడీపీ వృద్ధిరేటు 7.4 శాతంగా నమోదవుతుందని తెలిపింది.

# వడ్డీరేట్ల తగ్గింపు


విలేకరుల సమావేశానికి ముందు ఎంపీసీ సభ్యులతో కలసి ఫొటోలకు పోజిస్తున్న శక్తికాంత దాస్

**ముంబై:** ఊహించినట్టే ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను తగ్గించింది. సంస్థ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని మానిటరీ పాలసీ కమిటీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మూడు రోజుల పాటు జరిగిన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. రెపోరేటులో 0.25 శాతం కోత పెట్టడంతో 6.25 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉండటంతో కేంద్ర బ్యాంకు ఈ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా గృహ, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఆర్‌బీఐ గవర్నర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్ నేతృత్వంలోని కమిటీ ద్రవ్య విధానాన్ని 'తటస్థంగా' ఖరారు చేసింది. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటే రేట్లు మరింత తగ్గిస్తామనే సంకేతాలను పంపింది. రెపోరేటు (వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాలపై ఆర్బీఐ తీసుకునే వడ్డీరేటు)ను యథాతథంగా ఉంచడానికి ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ)లోని ఇద్దరు సభ్యులు డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, చేతన్ ఘాటే మొగ్గుచూపగా, దాస్ సహా మిగతా సభ్యులు దీనిని 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించాలని సిఫార్సు చేశారు. రివర్స్ రెపోరేటు (వాణిజ్య బ్యాంకుల రుణాలపై ఆర్‌బీఐ చెల్లించే వడ్డీరేటు) 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించాలని ఎంపీసీ తీర్మానించింది.

- ఊహించినట్టే ఆర్‌బీఐ నిర్ణయం
- హౌసింగ్ రుణాల వడ్డీ రేట్లు తగ్గే చాన్స్
- సర్కారుకు రూ.28 వేల కోట్ల డివిడెండ్ ఇచ్చే చాన్స్

**ద్రవ్యోల్బణంపై సానుకూల అంచనాలు**

ద్రవ్యోల్బణం గత డిసెంబరులో 18 నెలల కనిష్టం 2.2 శాతం నమోదైన నేపథ్యంలో మార్చి క్వార్టర్‌లో ఇది 2.8 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ బాగంలో 3.2-3.4 శాతం, మూడో క్వార్టర్‌లో 3.9 శాతం నమోదవుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నందున ఇక నుంచి కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా వేస్తున్నట్టు ఎంపీసీ ప్రకటించింది. కూరగాయలు, వంటనూనెల ధరలు, వాణిజ్య భయాలు, ఆరోగ్యం, విద్య, ద్రవ్యోల్బణం, ఫైనాన్షియల్ మార్కెట్లో అనిశ్చితి, వర్షపాతం, చమురు ధరలు వంటి కీలకాంశాలను జాగ్రత్తగా గమనించడం అవసరమని అభిప్రాయపడింది. ప్రైవేటు పెట్టుబడులను, వ్యక్తిగత వినిమయాన్ని మరింత పెంచాలని పేర్కొంది. రేట్ల తగ్గింపు వల్ల వడ్డీరేట్లు తగ్గడమేగాక పెట్టుబడులకు ప్రోత్సాహక వాతావరణం ఏర్పడుతుందని ఎంపీసీ అభిప్రాయపడింది.

**జీడీపీ వృద్ధి 7.4 శాతం...**

2020 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిశాతం 7.4 శాతం నమోదవుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2019 ఆర్థిక సంవత్సరానికి జీడీపీని 7.2 శాతంగా అంచనా వేసింది. మధ్యంతర బడ్జెట్ ప్రకటించిన చర్యల వల్ల ప్రజల వినిమయ ఆదాయం మరింత పెరుగుతుందని విశ్లేషించింది. చమురు ధరలు డిసెంబరు మాదిరిగానే ఉండొచ్చని అంచనా వేసింది.

### రూ.28 వేల కోట్ల మధ్యంతర డివిడెండ్ ?

ప్రభుత్వానికి చెల్లించాల్సిన మధ్యంతర డివిడెండ్‌పై వచ్చే ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. అయితే ఆర్‌బీఐ రూ.28 వేల కోట్ల వరకు మధ్యంతర డివిడెండ్ చెల్లించవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ విషయమై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ చట్ట ప్రకారం ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్ ఇవ్వాల్సిందేనన్నారు. వచ్చే నెల జరిగే బోర్డు సమావేశంలో దీనిపై ఇర్ణయం తీసుకుంటాం. డివిడెండ్‌ను ఎలా ఖర్చు చేయాలనేది ప్రభుత్వం ఇష్టం అని అన్నారు.




ఆర్‌బీఐ ఆరో ద్వైమాసిక సమీక్ష విధానాలు బాగున్నాయి. ఆర్‌బీఐ తీసుకున్న చర్యలు ఆర్థిక వ్యవస్థకు ఊపును ఇస్తాయి. చిన్న వ్యాపారులకు, ఇళ్ల కొనుగోలుదారులకు సులువుగా అప్పు దొరుతుకుంది. ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

**- కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్**

## ద్వైమాసిక ద్రవ్య సమీక్ష

**ప్రధానాంశాలు:**

1. రెపోరేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. రివర్స్ రెపోరేటును 6 శాతానికి తగ్గించింది. బ్యాంకురేటును 6.5 శాతం. సీఆర్‌ఆర్‌ను యథాతథంగా 4 శాతం. ఈ నిర్ణయాల ఫలితంగా వాహన, గృహ రుణాల రేట్లు తగ్గే చాన్సుంది.
2. 2019-20 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 7.4శాతంగా అంచనా
3. ద్రవ్యోల్బణాన్ని మార్చి క్వార్టర్‌కు 2.8 శాతానికి సవరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి అర్ధబాగంలో 3.2-3.4 శాతం, మూడో క్వార్టర్‌లో 3.9 శాతం నమోదవుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది
4. చమురు ధరల్లో అనిశ్చితి కొనసాగుతోందని ఆర్‌బీఐ పేర్కొంది. వాణిజ్య యుద్ధాలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారుతాయని విశ్లేషించింది.
5. ఈ ఏడాది బడ్జెట్ ప్రతిపాదనల వల్ల ప్రజలకు ఖర్చు పెట్టే సామర్థ్యం పెరుగుతుందని తెలిపింది.
6. ఇక నుంచి రూ.2 కోట్లకు పైబడిన వాటినే బల్క్ డిపాజిట్లుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.కోటి మాత్రమే. డిపాజిట్లు పెంచుకునేలా బ్యాంకులకు ఈ ప్రతిపాదన వెసులుబాటు కలిగిస్తుంది.
7. రూపాయి విలువ స్థిరత్వాన్ని కాపాడేందుకు ఆఫ్‌షోర్ ఫారిన్ మార్కెట్లపై టాస్క్‌ఫోర్స్‌ను నియమించాలని ప్రతిపాదించారు.
8. కార్పొరేట్ డెట్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసే విదేశీ పెట్టుబడిదారులపై ఆంక్షలను ఎత్తివేశారు.
9. పేమెంట్ గేట్‌వే సర్వీస్ ప్రొవైడెర్లు, పేమెంట్ అగ్రిగేటర్లపై త్వరలోనే చర్చాపత్రాన్ని సమర్పిస్తుంది.
10. చిన్న, సన్నకారు రైతులకు ఇక నుంచి రూ.1.6 లక్షల వరకు తనఖాలేని రుణాలు ఇవ్వాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించింది. ప్రస్తుతం రూ.లక్ష వరకు తనఖా లేకుండా అప్పు ఇస్తున్నారు.



"అన్ని రంగాలకు పుష్కలంగా నిధులు అందేలా చూస్తాం. ఇందుకోసం ద్రవ్యలభ్యత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల ద్వారా రూ.2.36 లక్షల కోట్ల నిధులను మార్కెట్‌కు అందించాం. బడ్జెట్ ప్రతిపాదనలు, ఆర్థిక స్లిపేజ్‌లను పరిగణనలోకి తీసుకొని ద్రవ్యోల్బణ అంచనాలను సవరించాం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన మధ్యంతర డివిడెండ్‌పై వచ్చే ఫిబ్రవరి 18న జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం. బడ్జెట్ అంచనాలకు తగ్గట్టే జీఎస్టీ వసూళ్లు ఉంటాయని భావిస్తున్నాం.

**- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్**

# మార్కెట్ లీడర్ సంతూర్?

## లక్స్‌ని వెనక్కి నెట్టింది




**వెలుగు, బిజినెస్‌డెస్క్ :**

'లైఫ్‌బాయ్ ఎక్కడుందో ఆరోగ్యం అక్కడ ఉందీ' ఈ యాడ్ గుర్తుండే ఉంటుంది కదా. నాలుగు దశాబ్దాలకు పైగా ఈ యాడ్‌తోనే కస్టమర్లను తన వైపుకి తిప్పుకుంది లైఫ్‌బాయ్. కానీ ఈ లైఫ్‌బాయ్ సోపు ప్రస్తుతం రారాజు కిరీటం కోల్పోతోంది. దేశంలోనే అత్యధికంగా అమ్ముడయ్యే సోపు బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న లైఫ్‌బాయ్, 2016 నుంచి కంటిన్యూగా మార్కెట్ వాటా కోల్పోతుందని కంతార్ వరల్డ్‌ప్యానల్ డేటాలో వెల్లడైంది. వినియోగదారులు ఎక్కువగా సహజసిద్ధమైన ఉత్పత్తులకే మొగ్గుచూపుతుండటంతో, లైఫ్‌బాయ్‌కి ఈ పరిస్థితి ఎదురవుతోంది. లైఫ్‌బాయ్ కిరీటం పడిపోతుంటే, విప్రో కన్జ్యూమర్ కేర్‌కు చెందిన సంతూర్ రయ్‌మని దూసుకొస్తోంది. సంతూర్ సహజ సిద్ధమైన ప్రొడక్ట్‌గా మార్కెట్ చేసుకుంటూ.. వినియోగదారులను సొంతం చేసుకుంటోంది. హెచ్‌యూఎల్ చెందిన లక్స్ బ్రాండ్‌ను ఎప్పుడో రెండో స్థానం నుంచి కిందకి పడిపడేసి, ఆ స్థానంలో సంతూర్ కూర్చుంది. వినియోగదారులు రసాయన పదార్థాలతో తయారయ్యే వాటిపై ఆందోళన చెందుతూ... సహజ సిద్ధమైన ఉత్పత్తుల వైపుకి మరలుతున్నారని బ్రాండ్ స్ట్రాటజిస్ట్ డీవై వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అల్పన పరిద చెప్పారు. మారుతున్న వినియోగదారుల ఎంపికలకు అనుగుణంగా మల్టినేషనల్ కంపెనీలు పనిచేయట్లేదని, సహజ సిద్ధమైన, ఆయుర్వేద బ్రాండ్లలో వారు ఆఫర్లను విస్తరించడం లేదని పేర్కొన్నారు. సంతూర్ సోపు గంధపు నూనె, ఓలియో రెసిన్ పసుపు కలయికలతో రూపొందింది. లక్స్, లైఫ్‌బాయ్‌లలో ఉన్న ఇతర రసాయన పదార్థాలు సంతూర్‌లో ఉన్నప్పటికీ, దీనిలో ఉన్న పసుపు, గంధపు నూనెలపైన వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నారు.

- సంతూర్‌కు సొంతమవుతున్న కన్జ్యూమర్లు
- సహజ సిద్ధమైన ప్రొడక్ట్‌లకు వైపుకి మొగ్గు
- ఇప్పటికే లక్స్‌ను వెనక్కి నెట్టిన సంతూర్


మార్కెట్ లీడర్‌గా సంతూర్ ఎదుగుతున్నప్పటికీ, వృద్ధి మాత్రం నెమ్మదిగానే ఉంటుందని మార్కెట్ వర్గాలన్నాయి. యూరోమానిటర్ ఇంటర్నేషనల్ అంచనా ప్రకారం ఇండియా సోపు మార్కెట్ 2022 నాటికి కేవలం 2.3 శాతం మాత్రమే పెరిగి రూ.21,130 కోట్లకు చేరుకోనుంది. 201217 మధ్య కాలంలో ఈ వృద్ధి 9.8 శాతంగా ఉంది. కంతార్ వరల్డ్‌ప్యానల్ డేటా ప్రకారం 2016 జూన్ నుంచి లైఫ్‌బాయ్ మార్కెట్ షేరు 340 బేసిస్ పాయింట్లు, లక్స్ షేరు 150 బేసిస్ పాయింట్లు తగ్గింది. సంతూర్ షేరు 140 బేసిస్ పాయింట్లు, గోద్రెజ్ నెంబర్.1 షేరు110 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఇదే కాలంలో పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ షేరు కూడా 3.7 శాతం జంప్ చేసింది. విప్రో కన్జ్యూమర్ కేర్‌కు వచ్చిన రూ.6,682.6 కోట్ల రెవెన్యూల్లో 42 శాతం సోపుల నుంచే వస్తున్నాయి. హెచ్‌యూఎల్ సేల్స్‌లో 30 శాతం సోపులదే.

### ఆధార్‌తో పాన్‌ను లింక్ చేసుకున్నది

# 23 కోట్ల మంది మాత్రమే

- వచ్చే నెల 31.. తుది గడువు
- ఐటీ రిటర్నుల దాఖలుకు ఆధార్, పాన్ లింక్ తప్పనిసరి

**న్యూఢిల్లీ :** పాన్‌తో ఆధార్ కార్డును ఇప్పటి వరకు 23 కోట్ల మందే లింక్ చేసుకున్నారని సీబీడీటీ ప్రకటించింది. వచ్చే నెల 31తో ఆధార్, పాన్ కార్డుల అనుసంధానానికి తుది గడువు ముగుస్తున్నదని తెలిపింది. మొత్తం పాన్ కార్డు హోల్డర్స్‌లో వీరు సగం మంది మాత్రమేనని తెలిపింది. మొత్తంగా 42 కోట్ల మంది పాన్ కార్డు హోల్డర్స్ ఉంటే, వారిలో 23 కోట్ల మంది మాత్రమే ఆధార్‌తో పాన్‌ను లింక్ చేసుకున్నారని సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్ర ప్రకటించారు. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయాలంటే వచ్చే నెల 31 నుంచి ఆధార్‌తో పాన్ లింక్ తప్పనిసరని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. 'ఆధార్‌తో లింక్ చేస్తే, పాన్ కార్డుల్లో డూప్లికేట్ ఎన్ని ఉన్నాయో గుర్తిస్తాం. డూప్లికేట్ ఉన్న వాటిని తొలగిస్తాం. ఒకవేళ ఆధార్‌తో లింక్ చేయకపోయినా.. ఆ పాన్‌ను రద్దు చేస్తాం' అని చంద్ర చెప్పారు. కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన ప్రతిష్టాత్మకమైన ఈ ఆధార్ స్కీమ్ చట్టబద్ధమైనదేనని గతేడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు ప్రకటించింది. ఐటీ రిటర్నులు దాఖలు చేయడానికి, పాన్‌ను జారీ చేయడానికి ఆధార్ తప్పనిసరి అని కూడా పేర్కొంది. అయితే బ్యాంక్ అకౌంట్లకు, మొబైల్ కనెక్షన్లకు మాత్రం ఆధార్ లింక్‌ను అడగవద్దని చెప్పింది. ఒక్కసారి ఆధార్‌తో పాన్, పాన్‌తో బ్యాంక్ అకౌంట్ లింక్ చేస్తే, అసెసీల వ్యయాల వివరాలను తెలుసుకోవచ్చు. పాన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 139ఏఏ(2) ప్రకారం ఆధార్ తీసుకోవాలి. ఆ ఆధార్ నెంబర్‌ను పాన్‌తో లింక్ చేసి టాక్స్ అథారిటీలకు తెలపాలి. ఐటీ రిటర్నులు దాఖలు చేసే సమయంలో ఆ ఆధార్ నెంబర్ తప్పనిసరి. ఈ ఏడాది ఇప్పటి వరకు 6.31 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. గతేడాది దాఖలైన 5.44 కోట్ల కంటే ఎక్కువ. 95 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు కొత్తగా చేరారు. తాము థర్డ్ పార్టీ సమాచారాన్ని కలిగి ఉన్నామని, దీంతో ఐటీ రిటర్నులు దాఖలు చేస్తున్నారో లేదో, సరియైన ఆదాయం చూపిస్తున్నారో లేదో కనుగొంటున్నామని చంద్ర చెప్పారు.






గౌతమ్ సింఘానియా

# రేమండ్స్ సొమ్ము దారి మళ్లిందా?

- ప్రమోటర్ల సొంత కంపెనీతో మతలబీ డీల్స్
- తక్కువ ధరకు అమ్మారు, ఎక్కువ ధరకు కొన్నారు

**ముంబై :** తాజాగా మరో కార్పొరేట్ ఎకౌంటింగ్ గిమ్మిక్కు బైటకొచ్చింది. టెక్స్‌టైల్స్ రంగంలో పేరొందిన రేమండ్ లిమిటెడ్ (లిస్టెడ్ కంపెనీ), దాని ప్రమోటర్ గౌతమ్ సింఘానియాల మధ్య జరిగిన లావాదేవీలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయంటూ బ్లూమ్‌బర్గ్ ఒక పరిశోధనాత్మక కథనం ప్రకటించింది. ఆ లావాదేవీల ప్రకారం ప్రమోటర్‌కే చెందిన మరో సంస్థ జేకే ఇన్వెస్టర్స్ (బాంబే) లిమిటెడ్ కు రేమండ్ అమ్మకాలు సాగిస్తోంది. తిరిగి అదే వస్తువులను అధిక రేటుకు రేమండ్ కొంటోంది. ఇలా ఎందుకు చేస్తోందనే ప్రశ్నకు సమంజసమైన జవాబు లేదు.

**ప్రమోటర్ సంస్థ జేకే ఇన్వెస్టర్స్ గురించి...**

ప్రమోటర్ గౌతమ్ సింఘానియా (సీఎండీ) కు జేకే ఇన్వెస్టర్స్‌లో 91 శాతం వాటా ఉంది. మిగిలిన వాటా ఇతర కుటుంబ సభ్యులది. ఇక రేమండ్‌లో జేకే ఇన్వెస్టర్స్‌కు 30.56 శాతం వాటా సొంతం. రేమండ్‌లో మొత్తం ప్రమోటర్ల వాటా 44.08 శాతంలో జేకే ఇన్వస్టర్స్‌దే సింహభాగం. ఈ రెండు సంస్థలూ...రేమండ్, జేకే ఇన్వెస్టర్స్ రిలేటెడ్ పార్టీలే. అంతేకాదు, యాన్యువల్ రిపోర్టులలో రెండు సంస్థల మధ్యా జరిగిన లావాదేవీలను రిలేటెడ్ పార్టీ లావాదేవీలుగా ప్రకటించారు కూడా. షర్టింగ్ ఫ్యాబ్రిక్ ప్రాసెసింగ్, ట్రేడింగ్ కార్యకలాపాలతోపాటు, ప్రాపర్టీ రెంటల్స్ వంటి పనులను జేకే ఇన్వెస్టర్స్ నిర్వహిస్తోంది. గత నాలుగేళ్లుగా చూస్తే, జేకే ఇన్వెస్టర్స్ రూ. 993 కోట్ల విలువైన వస్తువులను రేమండ్ నుంచి కొనుగోలు చేసింది. ఇదే కాలంలో రేమండ్‌కు రూ. 1,613 కోట్ల విలువైన అమ్మకాలనూ సాగించింది.

ఇక్కడ అర్థం కానిదేమంటే, ఒకవేళ నిజంగానే రేమండ్‌కు సెకండరీ ప్యాకేజింగ్ సర్వీసెస్ అందిస్తుంటే, ఆ సంస్థ నుంచి కొనుగోళ్లు ఎందుకు చేయాలి ? తిరిగి మళ్లీ ఆ సంస్థకే ఎందుకు అమ్మాలి ? సాధారణంగా అలాంటి సర్వీస్ ఇచ్చే వారు ఎంతో కొంత ఫీ కోసం ఆ పని చేస్తారు. జేకే ఇన్వెస్టర్స్‌కు అదే విధంగా రేమండ్ చెల్లిస్తోంది కూడా. గత నాలుగేళ్లలో రేమండ్ రూ. 30.44 కోట్లను జాబ్ వర్క్ ఫీ కింద జేకే ఇన్వెస్టర్స్‌కు చెల్లించింది. ఇంకో గమ్మత్తేమంటే, రేమండ్ సేల్స్ కమీషన్ రూపంలో మరో రూ. 22.85 కోట్లను జేకే ఇన్వెస్టర్స్‌కు చెల్లించడం. ఆ కాలంలో జేకే ఇన్వెస్టర్స్ జరిపిన మొత్తం అమ్మకాలన్నీ రేమండ్‌కే, వేరెవరికీ లేవు. అంటే, రేమండ్‌కు అమ్మినందుకుగాను ప్రమోటర్‌కి చెందిన సంస్థకే రేమండ్ సేల్స్ కమిషన్ చెల్లిస్తున్నట్లు. జేకే ఇన్వెస్టర్స్ వ్యయాలను చూస్తే ఈ లావాదేవీలలో మిస్టరీ మరింత ఎక్కువవుతుంది. ప్యాకేజింగ్ వర్క్ చేస్తుంటే, సంబంధిత మెటీరియల్ కోసం కొంత వ్యయం చేయాల్సి వుంటుంది. ఐతే, ఆసక్తికరంగా, ఫైలింగ్స్‌లో అలాంటి సమాచారమే లేదు. గత నాలుగేళ్లలో సెకండరీ ప్యాకింగ్, ఉద్యోగులు, వేర్‌హౌసింగ్ వ్యయాల కింద రూ. 18.49 కోట్లను చూపిస్తున్నారు. కిందటి నాలుగేళ్లలో జేకే ఇన్వెస్టర్స్ ఏకంగా రూ.183.16 కోట్ల లాభం గడించింది. సగటున ఒక్కో ఏడాదికీ రూ. 45 కోట్లన్నమాట. అదే కాలంలో రేమండ్ సగటు లాభాలలో సగం కంటే జేకే ఇన్వెస్టర్స్ లాభాలు కొంచం తక్కువ. ఈ రిలేటెడ్ పార్టీ లావాదేవీల మీద సరయిన వివరణ ఉంటే, అదేమిటో రేమండ్ వెల్లడించడం లేదు. మార్కెట్ రెగ్యులేటర్ పంపించిన షోకాజ్ నోటీసును తప్ప మరేవిధమైన సమాచారాన్ని రేమండ్ అధికార ప్రతినిధి ఇవ్వలేదు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి కంపెనీ ఈ విధంగా సమాధానం పంపింది. సెబీ నుంచి అందుకున్న నోటీసు సాంకేతికపరమైనది. మా లీగల్ సలహాదారులు పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. అన్ని చట్టాలను కంపెనీ అనుసరిస్తోంది. ఇక మీదట కూడా అదే చేస్తామనేది, కంపెనీ ఎక్స్ఛేంజ్‌కి పంపిన జవాబు సారాంశం.



# విజేత విదర్భ

- విదర్భదే రంజీ ట్రోఫీ
- వరుసగా రెండోసారి టైటిల్ కైవసం
- ఫైనల్లో 78 రన్స్‌తో సౌరాష్ట్రపై గ్రాండ్ విక్టరీ
- 11 వికెట్లు తీసిన ఆదిత్య సర్వాతె

**నాగ్‌పూర్:** డిఫెండింగ్ చాంపియన్ విదర్భ రంజీ ట్రోఫీని నిలబెట్టుకుంది. సౌరాష్ట్రతో జరిగిన రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో 78 రన్స్ తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండో సారి టైటిల్‌ను ముద్దాడి గత సీజన్‌లో సాధించిన విజయం గాలివాటం కాదని నిరూపించింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో విదర్భ స్పిన్నర్ ఆదిత్య సర్వాతె(6/59) ఆరు వికెట్లు తీయడంతో 206 రన్స్ ఛేజింగ్‌లో సౌరాష్ట్ర 127 పరుగులకే ఆలౌటైంది. తొలిసారి టైటిల్ గెలవాలన్న ఆశను నెరవేర్చుకోలేకపోయిన సౌరాష్ట్ర మూడోసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ మ్యాచ్‌లో మొత్తం 11 వికెట్లు తీసిన ఆదిత్య సర్వాతె ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. 206 రన్స్ ఛేజింగ్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 58/5తో ఆఖరి రోజైన గురువారం ఆట కొనసాగించిన సౌరాష్ట్ర మరో 69 పరుగులు మాత్రమే చేయగలిగింది. బుధవారమే టాపార్డర్ బ్యాట్స్‌మెన్ అంతా పెవిలియన్ చేరడం ఆ జట్టు విజయావకాశాలను తీవ్రంగా దెబ్బతీసింది.

ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ విశ్వరాజ్ జడేజా(52), కమలేశ్ మక్వానా(14) వికెట్ ఇవ్వకుండా కాసేపు పోరాడారు. ఇద్దరు కలిసి ఆరో వికెట్‌కు 33 రన్స్ జోడించారు. కానీ, జట్టు స్కోరు 88 వద్ద మక్వానాను ఔట్ చేసిన ఆదిత్య ఈ జంటను విడదీశాడు. ఆ తర్వాత మణికండ్(2), జడేజా, కెప్టెన్ ఉనాద్కట్(7), ధరేంద్ర జడేజా(17) వెంటవెంటనే ఔటవడంతో సౌరాష్ట్రకు ఓటమి తప్పలేదు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి రంజీ టైటిల్ నిలబెట్టుకున్న ఆరో జట్టుగా విదర్భ నిలిచింది. అంతకముందు ముంబై, మహారాష్ట్ర, కర్నాటక, రాజస్థాన్, ఢిల్లీ జట్లు ఈ ఘనత సాధించాయి.

### ఐదు కోట్ల నజరానా

రంజీ ట్రోఫీలో టైటిల్ నిలబెట్టుకున్న విదర్భ జట్టుపై కాసుల వర్షం కురిసింది. బీసీసీఐతోపాటు విదర్భ క్రికెట్ అసోసియేషన్(వీసీఏ).. ఆ జట్టుకు మొత్తం రూ.5 కోట్లు నగదు బహుమతి ప్రకటించాయి. రంజీ ట్రోఫీ విజేతకు బీసీసీఐ రూ.2 కోట్లు అందిస్తుంది. దానికి అదనంగా మరో రూ.3 కోట్లు కలిపి మొత్తం రూ.5 కోట్లు విదర్భకు ఇస్తామని వీసీఏ ప్రెసిడెంట్ ఆనంద్ జైస్వాల్ తెలిపారు.



శిఖర్ ధవన్

గత పది టీ20 సిరీస్‌ల్లో టీమిండియా ఓటమి ఎరుగదు. ధనాధన్ ఫార్మాట్‌లో న్యూజిలాండ్‌లో సిరీసే కాదు.. ఒక్క మ్యాచ్ కూడా నెగ్గలేదు. మొదటి రికార్డును కొనసాగించాలన్నా.. రెండో రికార్డును తుడిచేయాలన్నా.. ఇండియాకు విజయం అత్యవసరం. అది జరగాలంటే వెల్లింగ్టన్‌లో ఎదురైన అతి పెద్ద పరాజయం నుంచి రోహిత్‌సేన వెంటనే కోలుకోవాల్సిందే..! నేడు జరిగే రెండో టీ20లో కివీస్‌ను దెబ్బకు దెబ్బ కొట్టాల్సిందే..! మనోళ్లు ఏం చేస్తారో మరి..!

ఒత్తిడిలో టీమిండియా

నేడు కివీస్‌తో రెండో టీ20

ఉ. 11.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ లో

# గెలిచి.. నిలుస్తారా!

**ఆక్లాండ్:** వన్డేల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన జోష్‌లో న్యూజిలాండ్ గడ్డపై తొలిసారి టీ20 సిరీస్‌పై కన్నేసిన టీమిండియాకు మొదటి మ్యాచ్‌లో దిమ్మతిరిగే షాక్ తగిలింది. బంతితో ప్రత్యర్థిని కట్టడి చేయలేక.. బ్యాట్‌తో ప్రభావం చూపలేక ఈ ఫార్మాట్‌లో పరుగుల పరంగా అతి పెద్ద ఓటమిని మూటగట్టుకున్న రోహిత్‌సేన ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోయింది. సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే గెలుపు అనివార్యం అయిన పరిస్థితుల్లో తీవ్ర ఒత్తిడిలో శుక్రవారం ఇక్కడి ఈడెన్ పార్క్ మైదానంలో జరిగే రెండో టీ20లో బరిలోకి దిగుతోంది. తొలి పోరు చేదు జ్ఞాపకం నుంచి వెంటనే బయటపడి.. మన జట్టు దీటుగా బదులివ్వాలని అందరూ ఆశిస్తున్నారు. వెల్లింగ్టన్ పోరులో ఇండియాకు ఏదీ కలిసిరాలేదు. కివీస్‌కు భారీగా రన్స్ సమర్పించుకున్న రోహిత్‌సేన.. ఛేజింగ్‌లో పోరాడకుండానే ప్రత్యర్థికి తలొగ్గింది. ఈ నేపథ్యంలో గత మ్యాచ్ పొరపాట్లను వెంటనే సరిదిద్దుకొని... ఫ్రెష్‌గా బరిలోకి దిగాల్సి ఉంది. రెండు జట్లలో ప్రధాన తేడా కివీస్ ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ మెరుపు ఇన్నింగ్సే. మన బౌలింగ్‌ను చీల్చిచెండాడిన అతడిని అడ్డుకోకుంటే మూల్యం తప్పదు. సీఫెర్ట్ ధాటికి స్టార్ బౌలర్ భువనేశ్వర్‌తో పాటు హార్దిక్ పాండ్యా, ఖలీల్ అహ్మద్ ఓవర్‌కు 12 రన్స్ చొప్పున ఇచ్చుకున్నారు. ఈ మ్యాచ్‌లో ఖలీల్ ప్లేస్‌లో సిద్ధార్థ్ కౌల్ లేదా మహ్మద్ సిరాజ్‌ను బరిలోకి దింపే చాన్సుంది. తొలి మ్యాచ్‌లో స్పిన్నర్లు క్రునాల్ పాండ్యా, చహల్ బాగానే బౌలింగ్ చేసినా.. చైనామన్ కుల్దీప్‌ను ఆడించే ఆలోచనలో మేనేజ్‌మెంట్ ఉంది. ఇక, ఛేజింగ్‌లో బ్యాట్స్‌మెన్‌లో పోరాడే ప్రయత్నం చేయకపోవడం నిరాశ కలిగించిందని కెప్టెన్ రోహిత్ అంటున్నాడు. ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్ ఉండి కూడా 80 రన్స్ తేడాతో ఓడిపోవడం దురదృష్టకరమే. మరోసారి అలాంటి పరిస్థితి ఎదురుకాకూడదంటే బ్యాట్స్‌మెన్ సమష్టిగా రాణించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వెల్లింగ్టన్‌లో ఒక్క పరుగుకే అవుటైన రోహిత్ జట్టును ముందుండి నడిపించాల్సిన అవసరం ఉంది. వరల్డ్‌కప్ బెర్త్ ఆశిస్తున్న యువ క్రికెటర్ రిషభ్ పంత్ కూడా టీమ్‌కు ఉపయోగపడే ఇన్నింగ్స్ ఆడాలి. మూడో నంబర్‌లో బరిలోకి దిగిన ఆల్‌రౌండర్ శంకర్ ఆకట్టుకున్నప్పటికీ ఈ స్థానంలో మరో యంగ్‌స్టర్ శుభ్‌మన్ గిల్‌ను ఆడించే అవకాశం కనిపిస్తోంది. ఈ మ్యాచ్ ఇండియాకు చావో రేవో కానుండగా.. కివీస్ స్వేచ్ఛగా బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గి వన్డే సిరీస్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని ఆతిథ్య కెప్టెన్ విలియమ్సన్ భావిస్తున్నాడు. మొదటి మ్యాచ్‌లో తమ జట్టు ఆటతో పూర్తి సంతృప్తిగా ఉన్న కేన్ అదే జోరును ఆక్లాండ్‌లోను కొనసాగించాలని ఆశిస్తున్నాడు. కివీస్‌పై పైచేయి సాధించాలంటే ముందుగా ఆ జట్టు ఓపెనర్లు మన్రో, సీఫెర్ట్ జోరును బౌలర్లు అడ్డుకోవాలి. ఈ జోడీని ఎంత త్వరగా విడదీస్తే టీమిండియాకు అంత మంచిది. వన్డేలకు భిన్నంగా కివీస్ మిడిలార్డర్ కూడా మెరుగైన ప్రదర్శన చేసిన నేపథ్యంలో మధ్య ఓవర్లలో స్పిన్నర్లు పరుగులు నియంత్రించాల్సి ఉంటుంది. వెటరన్ టిమ్ సౌథీ తొలి పోరులో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతనితో పాటు స్పిన్నర్లు సోధి, శాంట్నర్‌పై ఒత్తిడి తెస్తే ఇండియా పని సులభం అవుతుంది.



సిరాజ్

### జట్లు (అంచనా)

**ఇండియా:** రోహిత్ (కెప్టెన్), ధవన్, శుభ్‌మన్/శంకర్, రిషభ్, కార్తీక్, ధోనీ (కీపర్), హార్దిక్ క్రునాల్/కుల్దీప్, భువనేశ్వర్, ఖలీల్/సిరాజ్, చహల్.

**న్యూజిలాండ్:** సీఫెర్ట్ (కీపర్), మన్రో, విలియమ్సన్ (కెప్టెన్), టేలర్, మిచెల్, నీషమ్/గ్రాండ్‌హోమ్, శాంట్నర్, కుగ్‌లైన్, టిమ్ సౌథీ, ఇష్ సోధి, ఫెర్గూసన్.



మంచిర్యాలలో క్రీడాకారులతో మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రికెట్ టోర్నీ

- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వివేక్ వెంకటస్వామి
- మంచిర్యాలలో 'వెలుగు' టోర్నీకి సెలెక్షన్లు

**మంచిర్యాల/ వరంగల్, వెలుగు:** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇక నుంచి ప్రతీ యేటా 'వెలుగు, వీ6' ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రకటించారు.'వెలుగు, వీ6' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ఆదిలాబాద్ జిల్లా ఉమ్మడి నియోజకవర్గాల టీమ్స్ సెలెక్షన్స్‌కు వివేక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో పాత పది జిల్లాలకు వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించామని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూరల్ ఏరియాల్లో టోర్నీ నిర్వహించాలని అప్పట్లో చాలా మంది తనను అడిగిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.. గ్రామీణ ప్రాంతాల క్రికెటర్లను ప్రోత్సహించేందుకే 'వెలుగు దినపత్రిక, వీ6' ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'వెలుగు, వీ6' మీడియా గ్రూప్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు ఉన్నతస్థాయికి చేరుకోవడానికి ఈ టోర్నీ మంచి వేదిక అన్నారు. పోటీల ప్రారంభోత్సవంలో మంచిర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, వైస్‌చైర్మన్ నల్ల శంకర్, టీఆర్ఎస్ నేతలు సుదమల్ల హరికృష్ణ, మద్ది శంకర్, బోరిగం వెంకటేశ్, సుదమల్ల అశోక్‌తేజ,రాకం సంతోష్, తోకల సురేష్, హేమలత, బోరిగం రాజారాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల నుంచి రెండేసి జట్లు, ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఒక జట్టును ఎంపిక చేశారు. టోర్నీ కో ఆర్డినేటర్ ప్రదీప్, చందు, తిరుపతి, రాము, చంద్రశేఖర్, డిగ్రీ కళాశాల రిటైర్డ్ పీడీ సాంబయ్య సెలెక్షన్స్‌ను పర్యవేక్షించారు.




### ఫైనల్లో వరంగల్ ఈస్ట్

'వెలుగు, వీ6' రాష్ట్రస్థాయి టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో మహబూబాబాద్‌ను ఓడించి వరంగల్ ఈస్ట్ జట్టు జిల్లా స్థాయి ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన వరంగల్ ఈస్ట్ 20 ఓవర్లలో 138 రన్స్ చేసింది. ఛేజింగ్‌లో మహబూబాబాద్ 16.5 ఓవర్లలో 92కే ఆలౌటైంది. ఈ విజయంతో వరంగల్ ఈస్ట్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. అంతకుముందు ఉదయం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో వరంగల్ వెస్ట్ 105 పరుగుల తేడాతో స్టేషన్ ఘన్‌పూర్‌పై గెలిచింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన వరంగల్ వెస్ట్ 20 ఓవర్లలో 180 రన్స్ చేసింది. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నిర్ణీత ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి కేవలం 75 రన్స్ మాత్రమే చేసింది.

**నేడు గ్రాండ్ ఫైనల్**

'వెలుగు, వీ6' ఆధ్వర్యంలో జరుగుతున్న టీ20 క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఫైనల్ మ్యాచ్ హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో జరగనుంది. ఇప్పటికే వరంగల్ ఈస్ట్ ఫైనల్‌కు చేరుకోగా, శుక్రవారం ఉదయం వరంగల్ వెస్ట్, పరకాల జట్ల మధ్య జరగనున్న రెండో సెమీ ఫైనల్‌లో విజేతగా నిలిచిన జట్టు ఫైనల్ చేరనుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌కు మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎంపీలు సీతారాంనాయక్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్ అతిథులుగా హాజరుకానున్నారు.



గెలిచిన ఆనందంలో వరంగల్ ఈస్ట్ జట్టు



### చాను గోల్డెన్ రిటర్న్

**న్యూఢిల్లీ:** స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను గాయం నుంచి కోలుకొని పాల్గొన్న తొలి అంతర్జాతీయ ఈవెంట్‌లోనే గోల్డ్ మెడల్‌తో సత్తా చాటింది. థాయ్‌లాండ్‌లో జరుగుతోన్న ఈజీఏటీ కప్‌లో వరల్డ్ చాంపియన్ మీరాబాయి 192కేజీల బరువెత్తి స్వర్ణం చేజిక్కించుకుంది. 49 కేజీల విభాగంలో బరిలో దిగిన 24 ఏళ్ల చాను స్నాచ్‌లో 82కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కిలోల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. మియాకే హిరోమి (జపాన్, 183 కేజీలు), లోవా డికా (పపువా న్యూ గినియా, 179 కేజీలు) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. 'గాయం తర్వాత తిరిగి కోలుకొని విజేతగా నిలవడం ఆనందంగా ఉంది. ఇది అత్యుత్తమ పెర్ఫార్మెన్స్ కాదు. కానీ నా కెరీర్ బెస్ట్‌కు 4 కేజీలు మాత్రమే తక్కువ. మొత్తానికి ఈ రిజల్ట్‌తో హ్యాపీగా ఉన్నా' అని చాను పేర్కొంది. గతేడాది గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో 196కేజీల బరువెత్తి కెరీర్ బెస్ట్ వెయిట్‌తో స్వర్ణం చేజిక్కించుకున్న చాను ఆ తర్వాత గాయం కారణంగా పోటీలకు దూరమైంది.

# మిథాలీ రాక తప్పదా !

**ఆక్లాండ్:** వరుస విజయాలతో న్యూజిలాండ్ టూర్‌ను ప్రారంభించిన టీమిండియా మహిళల జట్టు కీలక పోరుకు రెడీ అయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టీ20లో ఓడిపోయి ఒత్తిడిలో ఉన్న హర్మన్‌ప్రీత్ సేన.. కివీస్‌తో చావోరేవో తేల్చుకోవడానికి సిద్ధమైంది. ఇండియా, న్యూజిలాండ్ మధ్య రెండో టీ20 ఆక్లాండ్‌లో శుక్రవారం జరగనుంది. సిరీస్ విజయం ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే టీమిండియాకు ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి. మిడిలార్డర్ వైఫల్యం హర్మన్‌సేనను వేధిస్తున్న నేపథ్యంలో.. తుది జట్టులోకి సీనియర్ బ్యాటర్ మిథాలీ రాజ్ ఎంపిక చర్చనీయాంశమైంది. ఈ విషయంలో మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా మారింది. మిథాలీ లేకుండా గత రెండు టీ20 మ్యాచ్‌ల్లో బరిలోకి దిగిన టీమిండియా రెండింటిలోను ఒకే తరహా భంగపాటుకు గురైంది. ఈ రెండు మ్యాచ్‌ల్లోను మిథాలీ లేని లోటు స్పష్టంగా కనిపించింది. 160 రన్స్ ఛేజింగ్‌లో ఒక దశలో 102/1తో మ్యాచ్‌పై పట్టు బిగించిన ఇండియా.. అనూహ్యంగా 136కి ఆలౌటైంది. అయితే వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్ సన్నాహకాల్లో భాగంగా మిథాలీని పక్కన పెట్టిన మేనేజ్‌మెంట్ యంగ్‌స్టర్స్‌కు అవకాశమిస్తోంది. వారు మాత్రం ఆశించిన స్థాయిలో రాణించడం లేదు.



### ఫెడ్ కప్‌లో ఇండియా బోణీ

**ఆస్టానా (కజకస్తాన్):** ప్రతిష్ఠాత్మక ఫెడ్ కప్‌లో ఇండియా బోణీ కొట్టింది. ఆసియా/ఓసియానియా గ్రూప్-1 జోనల్ క్వాలిఫయర్స్ తొలి మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్ అంకితా రైనా, కర్మన్ కౌర్ చక్కటి ఆటతో జట్టుకు విజయం అందించారు. పూల్-ఎలో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో ఇండియా 2-1తో థాయ్‌లాండ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. తొలి సింగిల్స్‌లో కర్మన్ కౌర్ 2-6, 6-3, 3-6తో నుడ్నినా చేతిలో ఓడిపోయింది. అయితే, రెండో సింగిల్స్‌లో అంకితా 6-7 (3/7), 6-2, 6-4తో పియంగ్‌టర్న్‌పై గెలిచి స్కోరు సమం చేసింది. డబుల్స్‌లో అంకిత-కర్మన్ జంట 6-4, 6-7 (6/8), 7-5తో నుడ్నినా-ఫ్లిపుయెచ్ జోడీని ఓడించారు. చివరి సెట్‌లో 4-5తో వెనుకబడ్డ దశలో అద్భుతంగా పుంజుకున్న అంకిత-కర్మన్ జోడీ వరుసగా రెండు గేమ్‌లు గెలిచి ఇండియాకు విజయం కట్టబెట్టింది. శుక్రవారం జరిగే రెండో మ్యాచ్‌లో కజకస్తాన్‌పై గెలిస్తే ఇండియా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది.

### ఇండియా టూర్‌కు స్టార్క్ దూరం

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా స్పీడ్ స్టార్ మిచెల్ స్టార్క్ ఈ నెల చివరి నుంచి ఇండియాలో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. కండరాల నొప్పితో బాధపడుతున్న అతని స్థానంలో ఆసీస్ గడ్డపై వన్డేల్లో అదరగొట్టిన యువ పేసర్ రిచర్డ్‌సన్‌ను ఎంపిక చేశారు. ఫిబ్రవరి 24 నుంచి ఇండియాతో ప్రారంభమయ్యే 2 టీ20లు, 5 వన్డేల సిరీస్‌ల కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) గురువారం జట్టును ప్రకటించింది. మరో పేసర్ హేజిల్‌వుడ్, పీటర్ సిడిల్‌తో పాటు మిచెల్ మార్ష్, స్టాన్‌లేక్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు.

### హైదరాబాద్ ఓటమి


**కొచ్చి:** ప్రొ వాలీబాల్ లీగ్ ఆరంభ సీజన్‌లో బ్లాక్ హాక్స్ హైదరాబాద్ తొలి ఓటమి చవిచూసింది. చెన్నై స్పార్టన్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో బ్లాక్ హాక్స్ హైదరాబాద్ జట్టు 1-4 తేడాతో ఓటమి పాలైంది. తొలి మ్యాచ్‌లో ఎదురులేని ఆధిపత్యం కొనసాగించిన హైదరాబాద్ ఈ మ్యాచ్‌లో ఆ జోరు కనబర్చలేక పోయింది. గురువారం పోరులో తొలి నాలుగు సెట్లను 12-15, 12-15, 11-15, 10-15తో కోల్పోయిన బ్లాక్ హాక్స్ హైదరాబాద్ జట్టు ఐదో సెట్‌ను 15-13తో గెలిచింది. తర్వాత మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు శుక్రువారం కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో తలపడనుంది.

పరిశ్రమల్లో పని చేసే రోబోలను చూశాం, వైద్యంలో సాయం చేసే మర మనుషుల గురించి విన్నాం, యుద్ధభూమిలో ప్రతాపం చూపించే రోబోలనూ కన్నాం.. మొన్నామధ్య వార్తలు చదివే రోబో (పేరు క్యుహావ్) గురించి కూడా చదివాం. ఇక ఇప్పుడీ రోబోలు జర్నలిజంలోకీ అడుగుపెట్టాయి. రిపోర్టర్లు రాసే వార్తలను తామూ రాస్తామంటున్నాయి. వాళ్లు కూడా అవాక్కయ్యేలా న్యూస్‌ను తీర్చిదిద్దుతామని చెబుతున్నాయి.

# రోబో జర్నలిస్ట్

## వార్తలు రాసే మర మనుషులు

**ఇప్పటికే వాడుతున్న బ్లూమ్‌బర్గ్, ఏపీ, గార్డియన్** | **బ్లూమ్‌బర్గ్ వార్తల్లో మూడో వంతు మెషీన్ జనరేటెడే** | **ట్రాన్స్‌లేషన్‌కు రోబోల కోసం వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రయత్నం**



డిజిటల్ ప్రపంచం నానాటికీ విస్తరిస్తోంది. తాజా వార్తలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో ప్రింట్ మీడియాపై ఒత్తిడి పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రోబోలు జర్నలిజంలోకి వచ్చేస్తున్నాయి. ఇప్పటికే బ్లూమ్‌బర్గ్, వాషింగ్టన్ పోస్ట్, లాస్ ఏంజిలెస్ టైమ్స్, గార్డియన్ లాంటి పెద్ద పెద్ద వార్తా సంస్థలు వార్తలు రాయడంలో రోబోల సాయం తీసుకుంటున్నాయి. వార్తలను క్షణాల్లో పాఠకులకు అందిస్తున్నాయి. భారీగా లాభాలు గడిస్తున్నాయి.

**అన్నింటి చూపూ అటువైపే**

బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ ఇప్పటికే రోబో టెక్నాలజీని వాడుతోంది. అందులో వచ్చే వార్తల్లో మూడో వంతు మెషీన్లు రాసేవే. రిపోర్టర్లు రాసే వేలాది వార్తలకు ఈ 'సైబోర్గ్ (సైబర్నెటిక్ ఆర్గానిజం)' వ్యవస్థ సహకరిస్తోంది. ముఖ్యంగా బిజినెస్ వార్తలు రాయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతోంది. చిన్న బిజినెస్ వార్త వచ్చిందంటే వెంటనే చక్కని వార్తగా మలిచేస్తుంది. బిజినెస్ రిపోర్టులు సైతం రాయడానికి తడబడే వార్తలను అద్భుతంగా గణాంకాలతో సహా అందిస్తుంది. పైగా అలసిపోదు, ఎదురు మాట్లాడదు, ఎప్పుడూ పని.. పని.. పని చేస్తూనే ఉంటుంది. పోటీ వెబ్‌సైట్ రాయిటర్స్‌తో పోటీ పడేందుకు బ్లూమ్‌బర్గ్‌కు ఈ సైబోర్గ్ ఎంతో సహకరిస్తోంది. మరిన్ని వార్తా సంస్థలూ రోబో రిపోర్టర్లను ఇప్పటికే వాడేస్తున్నాయి. ఈమధ్య ఓ చిన్న బేస్‌బాల్ లీగ్‌కు సంబంధించిన వార్తలను కవర్ చేయడంలో అసోసియేటెడ్ ప్రెస్‌కు, ఓ హైస్కూల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ కోసం వాషింగ్టన్ పోస్ట్‌కు, భూకంపాల సమయంలో లాస్ ఏంజిలెస్ టైమ్స్‌కు ఇవి సహకరించాయి. గతేడాది గార్డియన్ కూడా తొలి రోబో ఆర్టికల్‌ను ప్రచురించింది. ఫోర్బ్స్ కూడా ఈ ప్రయత్నాల్లోనే ఉన్నట్టు ఇటీవల ప్రకటించింది.

**తొలిసారి అసోసియేటెడ్ ప్రెస్**

తొలిసారి 2014లో జర్నలిజంలోకి రోబోను అసోసియేటెడ్ ప్రెస్ తీసుకొచ్చింది. దీనికోసం ఆటోమేటెడ్ ఇన్‌సైట్స్ టెక్నాలజీ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ వేలకొద్దీ వార్తలను సృష్టించే లాంగ్వేజ్ జనరేషన్ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి ఏపీకి ఇచ్చింది. కంపెనీల లాభాలకు సంబంధించిన బిజినెస్ వార్తలు రాయడంలో సాఫ్ట్‌వేర్‌ను ఎక్కువగా వాడుతున్నారు. ఒకప్పుడు 300 వార్తలను రాసిన ఏపీ.. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ సాయంతో 3,700 వార్తలు రాస్తోంది. వార్తలు రాసేందుకు ఓ ఇన్‌హౌస్ రోబో (పేరు హెలిగ్రాఫ్)ను కూడా ఏపీ పెట్టేసుకుంది. 2016లో జరిగిన సమ్మర్ ఒలింపిక్ గేమ్స్ వార్తలను ఈ రోబో బాగా రాసింది. 2016 ఎన్నికలను సూపర్‌గా కవర్ చేసింది. పనిలో రోబోలను సమర్థంగా వాడుకున్నందుకు గ్లోబల్ బిగ్గీస్ అవార్డ్స్ 'ఎక్సలెన్స్ ఇన్ యూజ్ ఆఫ్ బోట్స్' కూడా ఏపీ పొందింది. స్థానిక రాజకీయ వార్తలను విడదీసి ప్రాంతాలవారీగా పాఠకులకు అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా వాడుకుంటున్నామని ఏపీ చెబుతోంది. రోబోలు రాసే చిన్న చిన్న వార్తలకు సంబంధించి అలర్ట్ పద్ధతిని కూడా ఏపీ ప్రవేశపెట్టింది. ఆ అలర్ట్‌లను రిపోర్టర్లు చూసి పెద్ద వార్తలు రాసే అవకాశం ఉంటే డెవలప్ చేస్తారు.

### ఉద్యోగాలేం పోవు

ఇంటర్వ్యూలను ఇతర భాషల్లోకి తర్జుమా చేసే పనిని రోబోలకు అప్పగించడంపై ప్రయత్నాలు మొదలెట్టినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్, డోజోన్స్ వెల్లడించాయి. న్యూయార్క్ టైమ్స్ మాత్రం వార్తలు రాయడంలో మెషీన్ల ఉపయోగంపై తామేం నిర్ణయం తీసుకోలేదని చెప్పింది. ఏఐ, రోబోల వల్ల మనుషుల ఉద్యోగాలేం పోవని జర్నలిజం ఎగ్జిక్యూటివ్స్ అంటున్నారు. న్యూస్‌రూమ్ పనిని ఆక్రమించుకోబోవని చెబుతున్నారు. కానీ ఏఐ వల్ల పని మరింత సులువవుతుందని అంటున్నారు. 'జర్నలిజం సృజనాత్మక, ఉత్సుకత కలిగించే ఉద్యోగం. వార్తను చెప్పడం. ప్రభుత్వంలోని లోటుపాట్లను వేలెత్తి చూపడం, మంచి పనులను ప్రశంసించడం. విమర్శనాత్మకంగా ఆలోచించడం' అని చెబుతున్నారు. ఏదేమైనా వార్తల ప్రింటింగ్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్న పత్రికలు.. వార్తలు రాసేందుకు రోబోల వాడకంపై ఇప్పటికిప్పుడు దృష్టి పెట్టే అవకాశమైతే లేనట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఏనుగమ్మమ్మ అమర్ రహే

## 88 ఏళ్ల వయసులో బందీ ఏనుగు దాక్షాయని కన్నుమూత



**తిరువనంతపురం:** ఆసియాలోనే ముసలి ఏనుగది.. దాని పేరు మీద గిన్నిస్ రికార్డు కూడా ఉంది. ఆ ఏనుగు ఇప్పుడు చనిపోయింది. గజ ముథాసి (ఏనుగు అమ్మమ్మ)గా పిలుస్తున్న దాక్షాయని 88 ఏళ్ల వయసులో ప్రాణం విడిచింది. కొన్నేళ్లుగా ట్రావెన్‌కోర్ దేవస్వాం బోర్డు (టీడీబీ) దాక్షాయనిని సాదుతోంది. మంగళవారం నుంచి ఏనుగు ఏమీ తినలేదని, మధ్యాహ్నం 3 గంటలకు అకస్మాత్తుగా అది కుప్పకూలిపోయి చనిపోయిందని అధికారులు తెలిపారు. నిజానికి దాని ఆరోగ్యం బాగుండాలని పైనాపిల్, క్యారెట్లనే ఆహారంగా పెట్టేవాళ్లమని, మూడేళ్లుగా ఎలాంటి కార్యక్రమాల్లోనూ భాగం చేయలేదని చెప్పారు. రెండు నెలల క్రితం తిరువనంతపురంలోని ఏనుగుల శాలకు దాక్షాయనిని తరలించామన్నారు. అయితే, ఏనుగులను బంధించడాన్ని వన్యప్రాణి సంరక్షకులు ఖండిస్తున్నారు. వాటి ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా ఇలా బంధించడం దారుణమంటున్నారు. ఆసియాలో దాదాపు 15 వేల ఏనుగులు బందీగా ఉన్నాయంటున్నారు. అయితే టీడీబీ వాదన మరోలా ఉంది. సంప్రదాయం ప్రకారం గుళ్లోని ఏనుగులను విడిపించలేమని, అందుకే దానికి మెరుగైన జీవితం కోసం ఎన్నో చేశామని బోర్డు మాజీ అధ్యక్షుడు ప్రయర్ గోపాలకృష్ణన్ తెలిపారు. బందీ ఏనుగుల జీవిత కాలం 40 ఏళ్లని చెబుతుంటారు. దేశంలో 2,454 బందీ ఏనుగులున్నాయని ఇటీవలి నివేదికలో వెల్లడైన సంగతి తెలిసిందే. దాక్షాయినికి ముందు చైనాకు చెందిన లిన్ వాంగ్ (86) అనే బందీ ఏనుగు పేరిట అత్యంత ముసలి ఏనుగుగా గిన్నిస్ రికార్డు ఉండేది. 2003లో తైవాన్‌లోని జూలో అది చనిపోవడంతో దాక్షాయనికి ఆ రికార్డు దక్కింది.

# మామిడి మాగింది కార్బైడ్ లేకుండా


## నల్లగొండ దోస్తుల ఎన్‌రైప్



ఆయనో మామిడి రైతు. ఓ సీజన్ దిగుబడినంతా కోల్పోయాడు. తీవ్ర నష్టాలు చవి చూశాడు. కానీ కుంగిపోలేదు. తనలాంటి ఆలోచనే ఉన్న మరో ఇద్దరిని తనతో కలుపుకుని, మామిడి కాయల్ని వేగంగా పండుగా మార్చే దారి కనుక్కున్నాడు. అదే 'ఎన్-రైప్'. కాల్షియం కార్బైడ్ లా ఇది ఆరోగ్యానికి హానికరం కాదు. పర్యావరణ హితం. మాగిన పండు రుచీ కోల్పోదు! నల్లగొండకు చెందిన మాధవ రెడ్డి బ్యాంకు ఉద్యోగ రీత్యా న్యూజిలాండ్ లో స్థిరపడ్డారు. అన్నీ ఉన్నా జీవితంలో ఏదో తెలియని వెలితి ఆయన్ను వ్యవసాయం వైపు మళ్లేలా చేసింది. పూర్వీకుల నుంచి సంక్రమించిన పొలం ఎలానూ ఉంది. ఇంకేం వెంటనే నల్లగొండకు చేరుకుని పండ్ల రారాజు మామిడితో తన సేద్యాన్ని ప్రారంభించారు. మూడేళ్లకు ఊహించిన దిగుబడి వచ్చింది. పంటను అమ్ముదామని కొత్తపేటలోని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కు వెళ్తే పండిన పళ్లనే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కాల్షియం కార్బైడ్ వాడకాన్ని సర్కారు నిషేధించిందన్నారు. పోనీ మార్కెట్లోని ఇథిలీన్ గ్యాస్ చాంబర్లలో భద్రపరచి, పండే దాకా ఆగుదామంటే అవి ఖాళీగా లేవు. దీంతో మాధవ రెడ్డి తీవ్రంగా నష్టపోయారు.

**కూరగాయల్లో పిండి, పీచు కలిపి...**

ఇది జరిగి సరిగ్గా మూడేళ్లు అవుతోంది. ఆ తర్వాత తన దోస్తులు యుగంధర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డిలతో మాట్లాడిన మాధవ రెడ్డికి ఓ ఐడియా తట్టింది. అదే కాల్షియం కార్బైడ్ కు ప్రత్యామ్నాయాన్ని కనుగొనడం. దాన్ని ఆచరణలో పెట్టడం వల్లే 'ఎన్-రైప్' వెలుగులోకి వచ్చింది. కూరగాయల్లోని పిండి పదార్థాలు, కార్బన్, పీచుతో ఎన్ రైప్ ను తయారు చేశారు. ఇది ఇథిలీన్ ను పండ్లపై ప్రభావంతంగా పని చేసేలా చేస్తుందట. ఎన్-రైప్ సక్సెస్ కావడంతో ముగ్గురు మిత్రులు హైటెన్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ అనే కంపెనీని తెరిచారు. దీని వల్ల మనుషుల ఆరోగ్యానికి ఎలాంటి హానీ కలగదని వీళ్లు చెబుతున్నారు. పండ్లను ఓ గదిలో ఉంచి ఎన్-రైప్ ప్యాకెట్ కు రెండు చిల్లులు చేసి, ఇథిలీన్ గ్యాస్ ను వదిలిస్తే చాలని అంటున్నారు. ఒకసారి ప్యాకెట్ లోని పౌడర్ మొత్తం బయటకొచ్చేశాక, దాన్ని తిన్న ఏం కాదని మాధవ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కాల్షియం కార్బైడ్ కు ప్రత్యామ్నాయంగా మన మార్కెట్లు, చైనా నుంచి పెద్ద సంఖ్యలో ఇథిలీన్ శాచెట్స్ దిగుమతి చేసుకుంటున్నాయి. ఒక ప్యాకెట్ ఎన్-రైప్ ను తయారు చేయడానికి ఆరంభంలో 100 రూపాయలు ఖర్చు అయ్యేవని శ్రవణ్ చెప్పారు. ప్రస్తుతం ఒక ప్యాకెట్ తయారీకి రూ.20 అవుతోందని తెలిపారు. ఒక్క ప్యాకెట్ తో 20 కేజీల మామిడి కాయల్ని మాగబెట్టొచ్చని వెల్లడించారు. సంప్రదాయ పద్ధతిలో ఇథిలీన్ వాయువును వదిలి పండించిన పండ్ల కన్నా ఎన్ రైప్ తో మాగిన పండ్ల రుచి చాలా బాగా ఉంటోందని చెప్పారు.



### ఎన్-రైప్ కు సీఎస్ఐఆర్-ఐఐసీటీ సర్టిఫికెట్

ముగ్గురు మిత్రుల ఆవిష్కరణకు హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్ఐఐసీటీ సర్టిఫికెట్ ను అందజేసింది. క్యాన్సర్ కు కారకంగా భావిస్తున్న ఎసిటిలిన్ ఎన్ రైప్ లో లేదని తెలిపింది. ఎన్ రైప్ పౌడర్ లో కెమికల్స్ పాళ్లు, చాలా తక్కువగా ఉన్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ల్యాబ్ పేర్కొంది. ఈ మేరకు ఓ సర్టిఫికెట్ ను జారీ చేసింది. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ ఎన్ రైప్ తో మాగబెట్టిన పళ్ల రుచి చాలా బాగుందని పేర్కొంది.



# కుక్కల మ్యూజియం తెరుచుకుంది

## 32 ఏళ్ల తర్వాత మన్‌హాటన్‌కు ఏకేసీ డాగ్ మ్యూజియం తరలింపు



అప్పట్లో రాజుల ఘనతను చెప్పేందుకు మ్యూజియాలున్నాయి. కత్తులు, కటార్లు, వంట గిన్నెలు, మంచాలు ఒక్కటేంటి.. ఎన్నెన్నో వస్తువుల గురించి మనకు వివరించేది మ్యూజియాలే. అలా మనిషి మెదళ్లకు మ్యూజియం ఉంది. పెయింటింగ్స్, కళలు, సినిమా.. చాలా రంగాల విశిష్టతలను చాటి చెప్పేలా మ్యూజియాలను కట్టారు. మరి, మనిషికి నేస్తంగా చెప్పుకునే కుక్కలకూ ఓ మ్యూజియం ఉంది తెలుసా? 32 ఏళ్ల క్రితం మూతపడిన దానిని మళ్లీ ఇప్పుడు తెరుస్తున్నారు. ఇంతకుముందు అమెరికా సెయింట్ లూయిలో ఉన్న ఆ మ్యూజియాన్ని మన్‌హాటన్‌కు తరలించి పునఃప్రారంభిస్తున్నారు. ద అమెరికన్ కెనెల్ క్లబ్ (ఏకేసీ) మ్యూజియం ఆఫ్ ద డాగ్‌ను శుక్రవారం పున:ప్రారంభించారు. కుక్కల ఫెస్ట్‌ను నిర్వహించే వెస్ట్‌మినిస్టర్ వీక్‌లోనే ఈ కుక్కల మ్యూజియంను మళ్లీ తెరవడం విశేషం. కుక్కలకు సంబంధించిన 2000 పెయింటింగులు, ఫొటోలు, విగ్రహాలు, ఇతర బొమ్మలను ప్రదర్శనకు పెట్టారు. 19వ శతాబ్దం, అంతకుముందు కుక్కలు ఎలా ఉండేవో ఇప్పటి కుక్కల ప్రియులకు పరిచయం చేయనున్నారు. అన్నింటికన్నా 1888లో చనిపోయిన ఫాక్స్ టెర్రియర్ జాతికి చెందిన బెల్‌గ్రేడ్ జో అనే కుక్క అస్థి పంజరం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. తొలిసారిగా ఈ మ్యూజియంను 1982లో న్యూయార్క్‌లో ఏర్పాటు చేశారు. 1987లో సెయింట్ లూయికి తరలించారు. ఇప్పుడు మన్‌హాటన్‌లో ఓపెన్ చేశారు.

# పైలం.. గంపగుత్త మెసేజ్‌లొద్దు

## నెల నెలా 20 లక్షల అకౌంట్లను మూసేస్తున్న వాట్సాప్

వాట్సాప్‌లో అదే పనిగా ఏది పడితే అది పంపుతున్నారా? పెడితే పోలా అని ఎన్ని పడితే అన్ని మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తున్నారా? అయితే, జర జాగ్రత్త. మీ అకౌంట్‌కు తాళం పడొచ్చు. వాట్సాప్ వాడకుండా నిషేధం ఎదురుకావొచ్చు. ఎందుకంటే ఎన్నికలు సమీపిస్తున్న వేళ తప్పుడు సమాచారానికి కళ్లెం వేసేందుకు నెల నెల దాదాపు 20 లక్షల అకౌంట్లను వాట్సాప్ మూసేస్తోందట. గురువారం వాట్సాప్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. "మేం అందిస్తున్న ఉచిత సేవల్ని చాలా మంది తప్పుదోవ పట్టిస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి మా ప్లాట్‌ఫాం భద్రంగా ఉండేలా ముందే ముకుతాడు వేస్తున్నాం" అని తెలిపింది. రిజిస్ట్రేషన్ టైంలోనే అలాంటి అకౌంట్లను గుర్తించి మూసివేస్తున్నామని పేర్కొంది. దాదాపు 20 శాతం అకౌంట్లను అలాగే క్లోజ్ చేశామని వెల్లడించింది. అలాంటి నంబర్లను ముందే పసిగట్టేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపింది. "ఒకే ఫోన్ నంబర్‌తో రెచ్చగొట్టే మెసేజ్‌లు ఏమైనా వెళ్లాయా అన్నది మా వ్యవస్థ గుర్తిస్తుంది. అంతే గాకుండా అనుమానిత కార్యకలాపాలు సాగించిన కంప్యూటర్ నెట్‌వర్క్ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చూసినా మా వ్యవస్థ అడ్డుకుంటుంది" అని పేర్కొంది. ఇండియాలో గ్రీవెన్స్ ఆఫీసర్‌ను నియమించామని, ఏ యూజర్‌కైనా ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఆయన్ను సంప్రదించాలని సూచించింది. 2018లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలకు శిక్షణ ఇచ్చామని చెప్పింది. ఈ ఏడాది కూడా ఎన్నికలు జరగబోతున్నాయి కాబట్టి ఎన్నికల సంఘంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వాట్సాప్ పేర్కొంది.



# స్పేస్ స్టేషన్‌లో టాయిలెట్ లీక్

## టవళ్లతో నీటి సేకరణ

ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో ఓ అమెరికన్ స్పేస్ టాయిలెట్ లీకయిందట. సుమారు 10 లీటర్ల ఆ నీటిని ఆస్ట్రోనాట్‌లు టవళ్లతో సేకరించారట. ఈ విషయాన్ని రష్యన్ మీడియా గురువారం వెల్లడించింది. రూ.135 కోట్ల ఖరీదైన ఆ స్పేస్ టాయిలెట్.. మూత్రాన్ని తాగునీటిగా మారుస్తుంది. 2008 నవంబర్‌లో రష్యన్ ఏరోస్పేస్ కంపెనీ నుంచి నాసా దాన్ని తీసుకుంది. ఐఎస్ఎస్‌లో రష్యన్ క్యాప్సుల్‌లోనూ ఇంకో స్పేస్ టాయిలెట్ ఉంది. ఇంతకుముందు కూడా ఐఎస్ఎస్‌లో ఓసారి టాయిలెట్ సమస్య వచ్చింది. 2009లో లిక్విడ్ సపరేటర్‌లోకి ఎక్కువ నీరు రావడంతో స్పేస్ టాయిలెట్ లీకైంది. రష్యన్ సోయుజ్ కాప్సుల్ గోడకు చిన్న రంధ్రమవడంతో దాన్ని రిపేర్ చేస్తున్నపుడు ఈ ఘటన జరిగింది.

# గరం గరం 2018

**న్యూయార్క్:** 2018.. ముగిసిపోయింది. కానీ, చరిత్రలో నిలిచిపోయింది. నాలుగో అత్యంత వేడి ఏడాదిగా పేరుకెక్కింది. నాసా, నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌వోఏఏ) అధ్యయనంలో తేలిందీ విషయం. సగటు ఉష్ణోగ్రత కన్నా 0.83 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్టు సైంటిస్టులు గుర్తించారు. ఇప్పటిదాకా గరిష్ఠంగా సగటున ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినట్టు చెప్పారు. 2018కి ముందు 2015, 2016, 2017లు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరాలుగా రికార్డులకెక్కాయి. అందులో మొదటి స్థానం 2016ది కాగా 2015 రెండో స్థానంలో నిలిచింది. 2019లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు సైంటిస్టులు చెబుతున్నారు. కాగా, గ్రీన్‌లాండ్, అంటార్కిటిక్‌లోని మంచు కరిగి సముద్రాలు పెరుగుతున్నాయని, దాని వల్ల కొన్ని దశాబ్దాల్లోనే పర్యావరణంలో పెను మార్పులొస్తాయని న్యూజిలాండ్‌లోని విక్టోరియా యూనివర్సిటీ సైంటిస్టులు హెచ్చరించారు. సముద్రాల ప్రవాహ దిశలు మారతాయంటున్నారు. అట్లాంటిక్ మహాసముద్రంలో శీతల జలాలు దక్షిణం వైపు, ఉష్ణ జలాలు ఉత్తరంవైపు వస్తున్నాయని గుర్తించారు.



వాలెంటైన్స్ డే ఆఫర్

# లవర్ లేనోళ్లకు ఫ్రీ చాయ్

వాలెంటైన్స్ డే దగ్గరపడుతోంది. ప్రేమికులకు కంపెనీలు, రెస్టారెంట్లు, కాఫీ షాపులు పసందైన ఆఫర్లు పెడుతుంటాయి. దాదాపు మొదలయ్యాయి కూడా. మరి, లవర్ లేనోళ్ల పరిస్థితేంటి? వాళ్లకు వాలెంటైన్స్ డే అంటే డ్రై డేయేనా? అయ్యో బాధపడొద్దంటోంది ఓ హోటల్. ఫ్రీగా గిన్నెన్ని చాయి నీళ్లిచ్చి వాళ్ల బాధను చల్లబరుస్తామంటోంది. అహ్మదాబాద్‌లోని 'ఎంబీఏ చాయ్ వాలా' అనే హోటల్ ఈ కొత్త ఆఫర్‌కు తెరదీసింది. ప్రేమికుల దినాన ఒంటరిగున్నోళ్లకు (సింగిల్స్) రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు ఫ్రీగా చాయ్ ఇస్తామని ఆ కెఫే ఓనర్ ప్రఫుల్ బిల్లోర్ చెప్పాడు.

**ఇంట్లో వాళ్లు తిట్టినా.. ఎంబీఏ వదిలేసి మరీ..**

2017 జూన్ 25న అహ్మదాబాద్‌లోని వస్త్రపూర్‌లో ఈ కెఫేను ప్రారంభించాడు ప్రఫుల్. నిజానికి అతడు ఓ ఎంబీఏ డ్రాపవుట్. టాప్ బీ స్కూల్స్‌లో అడ్మిషన్ కోసం రెండేళ్లు ప్రయత్నించాడు. ఎంతకీ రాలేదు. మామూలు కాలేజీలో ఎంబీఏ జాయిన్ అయ్యాడు. చెయ్యలేక వదిలేశాడు. అప్పుడే వస్త్రపూర్‌లో ఓ చిన్న టేబుల్ పెట్టి ₹ 8 వేలతో చిన్న టీ స్టాల్‌ను ప్రారంభించాడు. అయితే, ఆ టీస్టాల్ పెట్టినప్పుడు ఇంట్లోవాళ్లు, చుట్టాలు తిట్టారట. అయినా కూడా లెక్క చేయకుండా దానిని నడపడం మొదలుపెట్టాడట. వ్యాపారం పెరుగుతుండడంతో చిన్నచిన్నగా స్నాక్స్ కూడా సర్వ్ చేయడం మొదలుపెట్టానని ప్రఫుల్ చెప్పాడు. అలా అలా వ్యాపారం పెద్దగవడంతో ఎంబీఏ చాయ్ వాలా కెఫేని పెట్టానని చెప్పాడు.

### నిజాయితీగా రండి.. ప్లీజ్

వాలెంటైన్స్ డే అనగానే అన్ని కెఫేలు, రెస్టారెంట్లు జంటలకే ఆఫర్లు పెడుతుండడాన్ని తాను గమనించానని, మరి, ఒంటరోళ్ల పరిస్థితేంటని ఆలోచిస్తే ఈ ఆఫర్ తట్టిందని అన్నాడు. అందుకే ఒంటరోళ్లూ (అమ్మాయిలు, అబ్బాయిలు) వాలెంటైన్స్ డేని ఎంజాయ్ చేయాలన్న ఉద్దేశంతోనే 'ఫ్రీ చాయ్' ఆఫర్ పెట్టానని చెప్పాడు. అయితే, ఒంటరోళ్లు అనగానే అందరూ వచ్చే అవకాశం ఉంటుందని, అందులో ఎవరు నిజమైన వాళ్లో గుర్తుపట్టడం కొంచెం కష్టమైన పనేనని అన్నాడు. ఎవరు వచ్చినా 'నిజాయితీ'గా రావాలని జనానికి అతడు సూచిస్తున్నాడు. రష్ ఎక్కువగా ఉండకూడదన్న ఉద్దేశంతో ఆఫర్‌ను రాత్రి 7 నుంచి 10 గంటల వరకే పెట్టామన్నాడు. ఈ కెఫేలో 35 రకాల టీలు, మ్యాగీ, బన్ మస్కా, బ్రెడ్ బటర్, సాండ్‌విచ్, ఫ్రెంచ్ ఫ్రైస్ తదితర స్నాక్స్‌ను కస్టమర్లకు వడ్డిస్తారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.